ఆదివారం
28•1•2018
హైదరాబాద్
• వెల.6 రూ.
• సంపుటి 7 • సంచిక 231
• పేజీలు : 16 + (20/16) + 36 పేజీల ఆదివారం అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

సండే స్పెషల్



విశ్వాసపు విశ్వరూపం మేడారం

ప్రపంచంలోనే
కోటి మందికి పైగా
పాల్గొనే
ఏకైక జాతర

మేడారం.. తెలంగాణ రాష్ట్రంలో ఒక చిన్న కోయగూడెం.. అందమైన ఏటూర్‌నాగారం అడవుల్లో అమాయకమైన గిరిజన గూడెం. అడవి మల్లెలంత స్వచ్ఛమైన పల్లెసీమ. మాఘమాసం వచ్చిందంటే చాలు.. అంత అమాయకంగా ఉన్న పల్లెతనం ఒక్కసారిగా పురివిప్పి ఆనందతాండవం చేస్తుంది. అడవిలోని ప్రతి చెట్టూ నిటారుగా నిలిచి కోట్లాది ప్రజలను సాదరంగా స్వాగతిస్తుంది. ఎగిసిపడే ఎర్రెర్రని ధూళి ఆకాశమంతటా పరుచుకొని అడవితల్లికి సింధూరమవుతుంది. రెండేండ్లపాటు స్తబ్ధుగా ఉండే గూడేన్ని ఒక్కసారిగా మహాశక్తి ఆవహిస్తుంది. పట్టుమని మూడునాలుగు వేల మందికి కూడా ఆవాసం కష్టమయ్యే పల్లె.. కోటిమందికి ఆతిథ్యమిస్తుంది. వాళ్లు సంబురాలు చేసుకొంటే వనదేవతలు ఆశీర్వదిస్తారు. వాళ్లు అలంకరించుకొంటే అడవితల్లి తనను తాను అలంకరించుకున్నంత సంబురపడుతుంది. వాళ్లకు విగ్రహాలు అక్కరలేదు. సంప్రదాయ పూజాపునస్కారాలతో పనిలేదు.. చెట్టు.. పుట్ట.. వాగు.. కొండ.. వాటన్నింటి మధ్యన అన్నీ మరిచి.. ఆడీపాడీ.. తినీతాగీ.. మొక్కులు చెల్లించుకొంటే అడవి అడివంతా పులకించిపోతుంది.

16

రాష్ట్రంపై కంపెనీల చూపు

ఆసక్తి ప్రదర్శించిన ఐటీ, టెక్స్‌టైల్, ఆటోమొబైల్ సంస్థలు
త్వరలో రాష్ట్రానికి రానున్న ప్రతినిధులు
మంత్రి కేటీఆర్ దావోస్ పర్యటన విజయవంతం
స్థానిక సమస్యల పరిష్కారానికి కృత్రిమ మేధస్సు: కేటీఆర్


దావోస్ పర్యటన చివరిరోజు మంచుకురిసిన వీధులలో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు సక్సెస్ అయ్యారు. ఆయన దావోస్ పర్యటన విజయవంతంగా ముగిసింది. రాష్ట్రంలో పరిశ్రమలను స్థాపించేందుకు ఉన్న అవకాశాల గురించి.. ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశానికి హాజరైన వివిధ దేశాల ప్రతినిధులకు మంత్రి కేటీఆర్ వివరించారు. ఈ పర్యటనలో ఆయన అనేకమంది దిగ్గజ కంపెనీల సీఈవోలు, నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయనకు అపూర్వమైన గౌరవం కూడా లభించింది. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన టీఎస్‌ఐపాస్, ఇతర విధానాలతోపాటు హైదరాబాద్‌కు భౌగోళికంగా ఉన్న అనుకూలతలను మంత్రి కేటీఆర్ వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రధానంగా ఐటీ, టెక్స్‌టైల్, ఆటోమొబైల్‌రంగ పరిశ్రమల యాజమాన్యాలు ముందుకొచ్చాయి. త్వరలో రాష్ట్రాన్ని సందర్శించి, ఇక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి, తుది నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చాయి. ద్వితీయశ్రేణి పట్టణాల్లో ఐటీ సంస్థల యూనిట్లను నెలకొల్పడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను మంత్రి కేటీఆర్ వివరించడంతో టెక్ మహీంద్రా కంపెనీ వరంగల్‌లో తమ సంస్థను ఏర్పాటుచేయడానికి ముందుకొచ్చింది.

నిర్వాహకులకు మంత్రి కేటీఆర్ ధన్యవాదాలు

పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించడానికి అద్భుతమైన వేదికను ఏర్పాటుచేశారని ప్రపంచ

మిగతా 2వ పేజీలో


రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై అధ్యయనానికి వచ్చిన 19 దేశాల ప్రతినిధులు శనివారం హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఎస్ కే జోషిని కలిసినప్పటి దృశ్యం

మిషన్‌కు ప్రశంస

కాళేశ్వరం, మిషన్ కాకతీయ అద్భుతం
సాగునీటి ప్రాజెక్టులపై 19 దేశాల ప్రతినిధిబృందం కితాబు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కేవలం మూడున్నరేండ్ల కాలంలో సాగునీటిరంగంలో రాష్ట్రం సాధించిన ప్రగతి గురించి తెలుసుకొన్న 19 దేశాల ప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తంచేశారు. మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టులాంటి పథకాలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఇది కలయా? నిజమా? అంటూ సంభ్రమాశ్చర్యాలు ప్రకటించారు. 'వాస్తవంగా ఒక మంచినీటి పథకం పూర్తయిందంటేనే కలయా? నిజమా? అన్నట్లుంటుంది. కానీ రూ.80వేల కోట్లకుపైగా అంచనా వ్యయంతో కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని చేపడుతుండటం చాలా గొప్ప విషయం. ప్రాజెక్టు వివరాలు చూస్తుంటే.. దీని ద్వారా గ్రామీణప్రాంతాల్లో నిజమైన పేద, సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనం కలుగుతుందన్న సంగతి స్పష్టంగా అర్థమవుతున్నది' అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో నాలుగువారాలపాటు పర్యటించి..

మిగతా 6వ పేజీలో



కేంద్రాన్ని నిలదీస్తాం

తెలంగాణకు కేంద్ర పథకాల నిధుల విడుదలలో నిర్లక్ష్యం
ఎయిమ్స్‌కు కేటాయింపులే లేవు.. బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం
'నమస్తే తెలంగాణ'తో టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్షనేత జితేందర్‌రెడ్డి


2



నెత్తురోడిన కాబూల్

తాలిబన్ల 'అంబులెన్స్' దాడి
95 మంది మృతి,
158 మందికి గాయాలు

5



బెన్‌స్టోక్స్ అ'ధర'హో!

రూ12.5 కోట్లకు రాజస్థాన్ రాయల్స్ కైవసం

ఆటలో

బోన్ క్యాన్సర్ చిన్నారికి సీఎం చేయూత

- సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.15 లక్షల ఆర్థికసాయం
- విద్యార్థిని తల్లిదండ్రులకు చెక్కును అందజేసిన డిప్యూటీ సీఎం కడియం



బాలిక కుటుంబసభ్యులకు రూ.15 లక్షల చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

ధర్మసాగర్ (వరంగల్): బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి రాష్ట్ర సర్కారు చేయూతనిచ్చింది. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ప్రత్యేకంగా మాట్లాడిన డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి.. బాలిక చికిత్స కోసం రూ.15 లక్షలను సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి అం దజేశారు. వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మం డలం కొత్తకొండకు చెందిన గొడెల కుమారస్వామి, మంజుల దంపతులు కుటుంబంతో కలిసి వరంగల్ బీట్‌బజారులో హమాలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. రెండో తరగతి చదువుతున్న వీరి కుమార్తె జ్యోత్స్న బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నది. చిన్నారికి వైద్య చికిత్స కోసం ఆర్థికసాయం అందజేయాలని బాధితురాలి కుటుంబసభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. వేలేరు సర్పంచ్ విజయపురి మల్లికార్జున్‌ను సంప్రదించగా, ఆయన డిప్యూటీ సీఎం కడియం శ్రీహరిని కలిసి సమస్యను వివరించారు. శనివారం డిప్యూటీ సీఎం చాంబర్‌లో సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.15 లక్షల ఆర్థికసాయం చెక్కును చిన్నారి కుటుంబసభ్యులకు అందజేశారు. సీఎం కేసీఆర్, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, స్థానిక టీఆర్‌ఎస్ నాయకులకు జ్యోత్స్న కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వీరివెంట వేలేరు గ్రామశాఖ అధ్యక్షుడు బైరి శ్రీనివాస్, గొల్లకిష్టంపల్లికి చెందిన గంటే రాజు ఉన్నారు.

12 గంటల కరంటు చాలు

- వ్యవసాయ వినియోగంపై కరీంనగర్ జెడ్పీ ఏకగ్రీవ తీర్మానం
- ప్రభుత్వానికి నివేదిస్తామన్న జెడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ



శనివారం కరీంనగర్ జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తదితరులు కూడా ఉన్నారు.

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా అవసరం లేదని కరీంనగర్ జిల్లా ప్రజాపరిషత్ తీర్మానించింది. 24 గంటల కరంటును రైతుల్లో చాలామంది వినియోగించుకోవడం లేదని, అందులోనూ పూర్తిస్థాయిలో వినియోగించుకునే వారు తక్కువగా ఉన్నారని శనివారం జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు జిల్లాకు చెందిన మంత్రి ఈటల రాజేందర్ దృష్టికి తెచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అంతంత మాత్రంగానే ఉన్న భూగర్భజలాలు 24 గంటల విద్యుత్ వల్ల ఇంకా తగ్గిపోతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రోజుకు 12 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తే సరిపోతుందన్నారు. ఈ మేరకు ముస్తాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు జే శరత్‌రావు తీర్మానాన్ని ప్రవేశ పెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ తీర్మానాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని జెడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ చెప్పారు. సమావేశంలో కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లు సర్ఫరాజ్ అహ్మద్, దేవసేన, కృష్ణభాస్కర్, జగిత్యాల జేసీ బేతి రాజేశం, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, బొడిగ శోభ, రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు..

కాంగ్రెస్‌వి నీచ రాజకీయాలు: ఈటల

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీళ్ల విషయంలో కూడా కాంగ్రెస్ పార్టీ నీచ రాజకీయాలు చేస్తున్నదని మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఎగువ కాకతీయ కాలువపై కొందరు అక్రమంగా అమర్చిన మోటర్లకు విద్యుత్తు సరఫరా నిలిపివేయడాన్ని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ నాయకులు అన్యాయమని పేర్కొనడంపై మండిపడ్డారు.



నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పెండింగులో ఉన్న కల్వకుర్తి ప్రాజెక్టు పనులపై శనివారం జలసౌధలో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వానకాలంలోగా కల్వకుర్తి పూర్తి

- గడువులోగా పనులు చేయకుంటే ఏజెన్సీ మార్పు
- ప్రజల విజ్ఞప్తులపై వెంటనే స్పందించాలి
- అధికారులకు మంత్రి హరీశ్ ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పెండింగులో ఉన్న కల్వకుర్తి ప్రాజెక్టు పనులన్నీ వచ్చే వానకాలం నాటికి పూర్తిచేయాలని నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. శనివారం జలసౌధలో నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పెండింగులో ఉన్న కల్వకుర్తి ప్రాజెక్టు పనులను మంత్రి సమీక్షించారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన 'జల విజయయాత్ర' సందర్భంగా ప్రజలు చేసిన విజ్ఞప్తులను మంత్రి పరిశీలించారు. దాదాపు 60కి పైగా వచ్చిన వినతులపై వెంటనే స్పందించి వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, తిమ్మాజిపేట, తాడూరు, తెల్కపల్లి మండలాల్లో కల్వకుర్తి ప్యాకేజీ-29,30 పనుల పురోగతిని మంత్రి సమీక్షించారు. కల్వకుర్తి ప్రాజెక్టు జలాలతో 2016-17లో 280 చెరువులను, ఈ ఏడాది 350 చెరువులను నింపినట్లు అధికారులు తెలిపారు. ఇందులో ఒక్క నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోనే 120 చెరువులను నింపామని వారు చెప్పారు. కల్వకుర్తి మెయిన్ కెనాల్ సహా 29, 30 ప్యాకేజీల్లో మిగిలిన డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ పనులను వచ్చే వానకాలంలోగా పూర్తి చేయాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. ఏజెన్సీలు ఒకవేళ గడువులోగా పనులుచేయని పక్షంలో నిబంధనల ప్రకారం వాటిని వెంటనే తొలిగించి, వేరే ఏజెన్సీలతో పనులు చేయించాలని ఆయన అధికారులకు సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ సీఈ ఖగేందర్‌రావు, ఎస్‌ఈ భద్రయ్య, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రైతుల పేరుతో అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు

రైతుల పేరుతో వ్యాపారస్తులు అక్రమాలకు పాల్పడితే లైసెన్సులు రద్దు చేయడమే కాకుండా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మార్కెటింగ్ శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హెచ్చరించారు. జనగామ మార్కెట్ యార్డులోని కందుల కొనుగోలు కేంద్రంలో వెలుగుచూసిన సంఘటనపై మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. ఈ నెల 18న జనగామ జిల్లా కలెక్టర్ మార్కెట్‌యార్డ్‌లోని కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రం నుంచి 88 బస్తాల కందులు అక్రమంగా తరలిస్తుండటంతో ఆమె గుర్తించి కందుల బస్తాలను సీజ్‌చేసి మార్కెట్ కమిటీ కార్యాలయానికి అప్పగించారు.

కేంద్రాన్ని నిలదీస్తాం

- తెలంగాణకు నిధుల విడుదలలో నిర్లక్ష్యం
- ఎయిమ్స్‌కు కేటాయింపులే లేవు
- బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం
- 'నమస్తే తెలంగాణ'తో టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్షనేత జితేందర్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలులో మన రాష్ట్రానికి విడుదల చేయాల్సిన నిధుల విషయంలో మోదీ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 29 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో జితేందర్‌రెడ్డి నమస్తే తెలంగాణతో మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర సంబంధాలు బాగుండాలనే ఉద్దేశంతోనే ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వానికి అంశాలవారీగా మద్దతు తెలిపామని వెల్లడించారు. కొత్త రాష్ట్రమైనా అభివృద్ధిలో తెలంగాణ దూసుకుపోతున్నదని, అందుకు అనుగుణంగా కేంద్రం కూడా రాష్ట్రాలను ప్రోత్సహించాలని ఆయన కోరారు. 18 శాతం వృద్ధి రేటుతో తెలంగాణలో దేశంలోనే ముందున్నదని వెల్లడించారు. అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో అనేక రాష్ట్రాల కంటే తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నదని వివరించారు. అయినప్పటికీ కేంద్రం నుంచి సరియైన స్పందన లేదని జితేందర్ విమర్శించారు. 'గత సంవత్సరం బడ్జెట్ సమావేశాల్లో ఎయిమ్స్ గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. ఆ తర్వాత మూడుసార్లు బడ్జెట్‌పై సప్లిమెంటరీ చర్చలు జరిగాయి. వాటిలో కూడా ఎయిమ్స్‌కు నిధులు కేటాయించలేదు' అని జితేందర్‌రెడ్డి ఆరోపించారు. దాదాపుగా ప్రతి సెషన్‌లోనూ ఎయిమ్స్ గురించి కేంద్రాన్ని డిమాండ్ చేశామని తెలిపారు. ఈసారీ కేంద్రాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. ఒక్క ఎయిమ్స్‌కు మాత్రమే కాకుండా, కేంద్ర ప్రాయోజిత పథకాల్లో సైతం రాష్ట్రానికి రావాల్సిన నిధులు విడుదల కావడంలేదని చెప్పారు. కేంద్రప్రభుత్వం 41 రకాల పథకాలను అమలుచేస్తున్నదని, వీటి అమలు కోసం ఖర్చవుతున్న రూ.14 వేల కోట్లలో కేంద్రం వాటా రూ.9 కోట్ల మేరకు ఉండగా, రూ.5 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో కంది పంట సాగు పెరుగడంతో 1.50లక్షల టన్నుల దిగుబడి వచ్చిందని, వీటిని కొనుగోలు చేయాలని కేంద్రాన్ని కోరితే సానుకూలంగా స్పందించలేదని తప్పుపట్టారు. కందులను కేంద్రం 33వేల టన్నులు మాత్రమే కొనుగోలు చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రానికి కేటాయించే బియ్యాన్ని విడుదల చేయాలని అనేక మార్లు కేంద్ర మంత్రి రాంవిలాస్ పాశ్వాన్‌ను రాష్ట్ర మంత్రి ఈటల రాజేందర్, తాను కలిసి విజ్ఞప్తి చేసినా స్పందన లేదన్నారు.

సడక్ యోజనకు ఒక్క పైసా ఇవ్వలేదు

గ్రామీణ నీటిసరఫరాకు కేంద్రం రూ.302 కోట్లు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.704 కోట్లు ఖర్చు చేసిందని ఎంపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్‌ఎంఎస్‌ఏ) పథకం కింద కేంద్రం రూ.191కోట్లు కేటాయిస్తే రూ.302 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. ప్రధానమంత్రి సడక్ యోజన పథకానికి కేంద్రం ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. ఉపాధి హామీ పథకం కింద కేంద్రం రాష్ట్రానికి రూ.2700 కోట్లు కేటాయిస్తే డిసెంబర్ నాటికి రూ.462 కోట్లు మాత్రమే విడుదల చేసిందని తెలిపారు. స్వచ్ఛభారత్‌కు కేటాయించిన నిధుల్లో 59 శాతం, నేషనల్ హెల్త్ మిషన్‌కు కేటాయించిన నిధుల్లో 35 శాతం నిధులు మాత్రమే విడుదలయ్యాయని చెప్పారు. స్మార్ట్ సిటీ, పౌష్టికాహార పథకం లాంటి ఇతర అనేక పథకాల నిధుల విడుదలలోనూ కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని వివరించారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు రావాల్సిన పన్నుల వాటాలను ప్రస్తుతం నెలనెలా బదిలీ చేస్తున్నారని, ఈ బదలాయింపును మూడునెలలకొకసారి చేస్తామన్న ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించిందని, దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా ఈ విధానాన్ని వ్యతిరేకించాయని జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు.



హైదరాబాద్ బిర్యానీకి వాల్‌స్ట్రీట్ జర్నల్ ప్రశంసలు

సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ బిర్యానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు దక్కాయి. అమెరికాకు చెందిన ప్రఖ్యాత మీడియా సంస్థ 'ది వాల్‌స్ట్రీట్ జర్నల్' హైదరాబాద్‌కు చెందిన ఆరు హోటళ్లను దేశంలోనే ప్రముఖ బిర్యానీ హోటళ్లుగా గుర్తిస్తూ కథనాన్ని ప్రచురించింది. దీనిపై తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్ నగరంలోని ఓ హోటల్‌లో తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హోటళ్ల యజమానులను సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్, ప్యారడైజ్, ది స్పైసీ వెన్యూ, షాదాబ్, బహార్ రెస్టారెంట్, షాగౌస్ బిర్యానీ హోటళ్లను 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' గుర్తించడం గర్వకారణమని అన్నారు. భోజన ప్రియులకు మంచి రుచికరమైన బిర్యానీని వడ్డిస్తూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. మన హోటళ్లకు ఇంతటి గుర్తింపు లభించడానికి నగరానికి చెందిన ప్రముఖ ఆహార కన్సల్టెంట్ సంకల్ప్ విష్ణు కృషి ఎంతో ఉందని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి అజ్మీరా చందూలాల్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.53 గంటలకు



సూర్యాస్తమయం: 6.05 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం ఏకాదశి ఉదయం 8.29 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: రోహిణి తె. 4.05 వరకు తదుపరి మృగశిర, అమృతఘడియలు: సాయంత్రం 5.47 నుంచి రాత్రి 7.23 వరకు, రాహుకాలం: సాయంత్రం 4.41 నుంచి 6.05 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.36 నుంచి 5.21 వరకు, వర్జ్యం: ఉదయం 9.08 నుంచి 10.44 వరకు.

లోకం పోకడ



బడ్జెట్ ఆయన టేబుల్ మీది వ్యవహారం.. నాకు సంబంధం లేదు!

ఇంజినీరింగ్ విద్యార్థులకు బీమా!



- డిజిటల్ లావాదేవీలు తప్పనిసరిచేస్తూ ఏఐసీటీఈ కొత్త నిబంధనలు
- ర్యాగింగ్ నియంత్రణ కమిటీలు, కౌన్సెలర్ల నియామకం
- పరిశ్రమలతో అనుసంధానికి 'ఇన్‌స్టిట్యూట్- ఇండస్ట్రియల్ సెల్' ఎస్సీ, ఎస్టీ కమిటీల ఏర్పాటు
- స్టూడెంట్, ఫ్యాకల్టీ నిష్పత్తి అమలు కచ్చితం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇంజినీరింగ్, టెక్నికల్ విద్యార్థులకు బీమా పథకంతో డిజిటల్ లావాదేవీలను తప్పనిసరిచేస్తూ అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) కీలక నిర్ణయం తీసుకుంది. వీటితోపాటు 31 రకాల ముఖ్యమైన నిబంధనలను 2018-19 విద్యాసంవత్సరం నుంచే కచ్చితంగా అమలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని అన్ని యూనివర్సిటీలను, కాలేజీల యాజమాన్యాలను ఆదేశించింది. ఈ నిబంధనలు పాటించిన ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలకు మాత్రమే అఫిలియేషన్లు ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తప్పనిసరిగా బీమా పథకాన్ని అమలుచేయడం వల్ల విద్యార్థులకు యాక్సిడెంట్ జరిగినప్పుడు బీమా కంపెనీల నుంచి పరిహారాన్ని పొందవచ్చని, ఈ బీమా పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.12 చొప్పున ప్రీమియంను కాలేజీల ద్వారా చెల్లించాల్సి ఉన్నదని జేఎన్టీయూహెచ్ అధికారులు తెలిపారు. యాక్సిడెంట్ సంఘటనలు జరిగినప్పుడు బీమా కంపెనీలు రూ.2 లక్షల వరకు చెల్లించేవిధంగా విద్యార్థి బీమా పథకాన్ని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్నదని సాంకేతిక విద్యాశాఖ అధికారులు తెలిపారు. దీనిని అన్ని కాలేజీలలో అమలుచేయాల్సి ఉన్నదని చెప్పారు. కాలేజీల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులకు గ్రూపు ఇన్స్యూరెన్స్ సదుపాయాన్ని కల్పించాలని ఏఐసీటీఈ స్పష్టంచేసింది.

అన్ని కాలేజీలలో డిజిటల్ లావాదేవీలు

అన్నిరకాల ప్రైవేట్ ఇంజినీరింగ్, టెక్నికల్ కాలేజీల్లో నగదు లావాదేవీలకు స్వస్తిపలికి, డిజిటల్ లావాదేవీలనే కొనసాగించాలి. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ ఆదేశాల ప్రకారం ఈ మేరకు ఏఐసీటీఈ నిర్ణయం తీసుకున్నది. ఈ క్రమంలో కార్డు/ బ్యాంకు/ యాప్/ ఆన్‌లైన్ విధానం ద్వారా ఫీజులు స్వీకరించడం, చెల్లింపులు వంటివి నిర్వహించాలి. అన్నిరకాల ఇంజినీరింగ్ కాలేజీల్లోని విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధికి అవకాశం కల్పించే పరిశ్రమలతో అనుసంధానం చేసుకోవాలి. అందుకోసం కాలేజీల్లోనే 'ఇన్‌స్టిట్యూట్ –ఇండస్ట్రియల్ సెల్'ను కచ్చితంగా ఏర్పాటుచేయాలి.

కౌన్సెలర్లను నియమించాలి

దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ కాలేజీల్లో వేధింపులు పెరుగుతున్నాయి. తీవ్రమైన ర్యాగింగ్, అనేక రకాల ఒత్తిడి వల్ల విద్యార్థులు ఆత్మహత్యలకు గురవుతున్నారు. ఇలాంటివాటిని నివారించడం కోసం.. విద్యార్థుల మానసిక ప్రవర్తన తెలుసుకుని వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం కోసం కౌన్సెలర్లను నియమించడం తప్పనిసరి. ప్రథమచికిత్స, మెడికల్ క్యాంపులు, కౌన్సెలింగ్ సదుపాయాలు ఏర్పాటుచేయాలి. రోడ్లు, భవనాల శాఖ ప్రమాణాల ప్రకారం అన్ని కాలేజీలలో రోడ్లను నిర్మించాలి. విద్యార్థులు, సిబ్బంది కోసం జనరల్ నోటీసుబోర్డు, డిపార్టుమెంటల్ నోటీసుబోర్డు ఏర్పాటుచేయాలి. ఆన్‌లైన్ ఫిర్యాదుల విధానాన్ని అమలుచేయాలి. ప్రతి కాలేజీలో ఎస్సీ, ఎస్టీ కమిటీలను ఏర్పాటుచేయాలి. 1989లో చేసిన ఎస్సీ, ఎస్టీ పార్లమెంట్ చట్టం ప్రకారం ఈ కమిటీలను ఏర్పాటుచేయాలి.

యూజీ కోర్సులవారీగా ఫ్యాకల్టీ నిష్పత్తి వివరాలు ఇలా ఉన్నాయి

యూజీ కోర్సులు	స్టూడెంట్, ఫ్యాకల్టీ నిష్పత్తి
ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ	1:20
ఫార్మసీ	1:15
ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్	1:16
అప్లైడ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్	1:10
హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ	1: 20

పీజీ కోర్సులవారీగా ఫ్యాకల్టీ నిష్పత్తి వివరాలు

పీజీ కోర్సులు	స్టూడెంట్, ఫ్యాకల్టీ నిష్పత్తి
ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ	1:12
ఎంఫార్మసీ	1:10
ఫార్మా–డీ	1:15
ఆర్కిటెక్చర్	1:10
ప్లానింగ్	1:10
అప్లైడ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్	1:10
హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ	1:12
ఎంసీఏ	1:20
ఎంబీఏ/పీజీడీఎం	1:20

1:20 నిష్పత్తి ప్రకారం ఫ్యాకల్టీ

2018-19 విద్యా సంవత్సరంలో స్టూడెంట్ టీచర్ ఫ్యాకల్టీ నిష్పత్తిలో కొన్ని మార్పులుచేశారు. గతంలో బీటెక్ కోర్సుల్లో 1:15 ప్రకారం స్టూడెంట్, ఫ్యాకల్టీ నిష్పత్తి ఉండేది. ఇప్పుడు 1:20 నిష్పత్తి ప్రకారం ఫ్యాకల్టీని నియమించుకోవడానికి ఏఐసీటీఈ వెసులుబాటు కల్పించింది. ఇతర కోర్సులకు కూడా ఫ్యాకల్టీ నిష్పత్తి వివరాలను ప్రకటించింది.

రాష్ట్రంపై కంపెనీల చూపు

మొదటిపేజీ తరువాయి...

ఆర్థిక వేదిక నిర్వాహకులకు మంత్రి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచంలోని పెద్దవ్యాపారవేత్తలు ఒకే వేదిక మీదకు రావడం దీని ద్వారా సాధ్యమయ్యిందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రముఖ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ప్రదర్శించాయని చెప్పారు. టెక్ మహీంద్రా వరంగల్‌లో సెంటర్‌ను ఏర్పాటుచేయడానికి ముందుకొచ్చిందని, దీనిద్వారా ద్వితీయశ్రేణి పట్టణాలను అభివృద్ధిచేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు ప్రోత్సాహం లభించినట్టుగా భావిస్తున్నామన్నారు.



దావోస్ సదస్సు విజయవంతానికి సహకరించిన బృందంతో మంత్రి కే తారక రామారావు. చిత్రంలో ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ కూడా ఉన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృత్రిమ మేధస్సు

స్థానిక సమస్యల పరిష్కారానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించుకోవచ్చని, దీనికి గ్లోబల్ టెక్నాలజీ సహాయం తీసుకోవచ్చని మంత్రి కేటీఆర్ చెప్పారు. చివరిరోజున 'గ్లోబల్ టెక్ అండ్ లోకల్ సొల్యూషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. తెలంగాణ ప్రభుత్వం ఓపెన్ డాటా పాలసీని 2016లో ఆవిష్కరించిందని, దీనితో 50 డాటాసెట్స్ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. వీటిద్వారా పారదర్శకత పెరుగడంతోపాటుగా నాణ్యమైన డాటా లభ్యమవుతుందని పేర్కొన్నారు. డాటా సైన్సెస్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ) ను ఏర్పాటుచేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని తెలిపారు. స్థానికంగా సమస్యల పరిష్కారానికి సాహిత్యం, ప్రాంతీయం, భాషాపరమైన తేడాలను ఏ విధంగా పరిగణనలోకి తీసుకోవాలనే విషయాన్ని మంత్రి కేటీఆర్ విశ్లేషించారు. ఒక ప్రాంతంలో ఉన్న సమస్యకు పరిష్కారం మరో ప్రాంతంలో వేరేవిధంగా ఉంటుందని చెప్పారు. ప్రభుత్వాలు స్థానికంగా ఉన్న నైపుణ్యాలను వాడుకోవాలని, ప్రపంచసంస్థలు స్థానిక అవసరాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు.

భరత్‌భూషణ్‌కు జీవన సాఫల్య పురస్కారం

- ఘనంగా సత్కరించిన తెలుగు యూనివర్సిటీ



తెలుగువర్సిటీలో జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకుంటున్న ఫొటో గ్రాఫర్ భరత్‌భూషణ్. చిత్రంలో వీసీ సత్యనారాయణ, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు తదితరులు కూడా ఉన్నారు.

తెలుగు యూనివర్సిటీ: ప్రముఖ ఫొటోగ్రాఫర్ గుడిమెల్ల భరత్‌భూషణ్ తెలంగాణ సంస్కృతి విశిష్టతను యావత్ ప్రపంచానికి చాటి చెప్పారని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ కొనియాడారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 32వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా భరత్‌భూషణ్‌కు విశిష్ట జీవనసాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. పురస్కారం కింద ఆయనను లక్ష నగదు, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ, తెలంగాణ గర్వించదగిన గొప్ప ఫొటోగ్రాఫర్ భరత్‌భూషణ్ అని అన్నారు. తెలంగాణ జీవన వైచిత్రిని ఆయన గొప్పగా ఆవిష్కరించారని పేర్కొన్నారు. బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భరత్‌భూషణ్ నిశితంగా పరిశీలించారని, ఎంతో అద్భుతంగా, కళాత్మకంగా వేల సంఖ్యలో సజీవ చిత్రాలు తీశారని చెప్పారు. మన సంస్కృతి గురించి అంతగా తెలియని నేటితరం యువతకు భరత్‌భూషణ్ ఫొటోలు చూపించాలని ఆకాశవాణి కేంద్రం సంచాలకుడు ఉదయ్‌శంకర్ అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, చిత్రకారుడు శీలావీర్రాజు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు మంగారి రాజేందర్, పాత్రికేయుడు పాశం యాదగిరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ప్రాంగణంలో భరత్‌భూషణ్ ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు.

పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని గ్రామపంచాయతీలకు 2017-18, 2019-20 సంవత్సరాలకు ప్రోత్సాహక నిధులను మంజూరు చేయనున్నారు. ఈ మేరకు 14వ ఆర్థికసంఘం కొత్త మార్గదర్శకాలను జారీచేసింది. 14వ ఆర్థిక సంఘం ప్రతి ఏటా పంచాయతీలకు నిధులు ఇవ్వడంతో పాటు.. ప్రోత్సాహక నిధులను అందిస్తున్నది. కొత్త నిబంధనల ప్రకారం పంచాయతీలు సొంత ఆదాయాలను పెంచుకోవాలి. గడిచిన రెండేండ్ల పంచాయతీ నిధుల ఆడిట్ తప్పనిసరిగా సమర్పించాలి. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. గడిచిన ఆర్థిక సంవత్సరం ఆర్థిక సంఘం ఇచ్చిన నిధుల ఖర్చు వివరాలను పంచాయతీ డాష్‌బోర్డుపై పొందుపర్చాలి. వీటిని పాటించిన పంచాయతీలకు మార్కులను కేటాయించారు. 10 శాతం ఆర్థిక వనరులను పెంచుకున్న పంచాయతీలకు 5 మార్కులు, 10 నుంచి 25 శాతం ఆదాయ వనరులను పెంచుకున్న వాటికి 10 మార్కులు, 25 నుంచి 50 శాతం పెంచుకుంటే 15 మార్కులు, 50 శాతంపైన ఆదాయాన్ని పెంచుకున్న పంచాయతీలకు 20 మార్కులు కేటాయించారు. గత ఏడాది ఓడీఎఫ్‌గా ఎంపికైన పంచాయతీకి 30 మార్కులు, గ్రామంలోని చిన్నారులకు రెండేండ్లపాటు 100 శాతం టీకాలు వేయించిన గ్రామాలకు 10 మార్కులు కేటాయించారు. 49 మార్కులు సాధించిన పంచాయతీలకు 50 శాతం, 50 నుంచి 70 మార్కులు వచ్చిన గ్రామాలకు 70 శాతం, 71 కంటే ఎక్కువ మార్కులు వచ్చిన గ్రామాలకు 100 శాతం నిధులు కేటాయించనున్నారు.



శామీర్‌పేటలో జరిగిన అంతర్జాతీయ ఐసీసీబీ కణ జీవశాస్త్ర సదస్సులో మాట్లాడుతున్న నోబెల్ గ్రహీత మార్టీన్ చాల్ఫీ

కణజాలంపై మరిన్ని పరిశోధనలు జరుగాలి

- కణజీవశాస్త్ర పరిశోధనలే ప్రజారోగ్య సవాళ్లకు పరిష్కారం
- నోబెల్ బహుమతి గ్రహీత మార్టీన్‌చాల్ఫీ
- హైదరాబాద్‌లో ప్రారంభమైన అంతర్జాతీయ సెల్ బయాలజీ కాంగ్రెస్
- భారత్‌లో సదస్సు నిర్వహించడం ఇదే తొలిసారి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కణజీవశాస్త్ర పరిశోధనలే ప్రజారోగ్య సవాళ్లకు పరిష్కారం చూపగలవని నోబెల్ బహుమతి గ్రహీత మార్టీన్‌చాల్ఫీ పేర్కొన్నారు. కణజాలంపై మరిన్ని పరిశోధనలు సాగాలని ఆయన ఆకాంక్షించారు. దేశంలోనే మొదటిసారిగా హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 'ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ సెల్ బయాలజీ 2018' సదస్సు శనివారం శామీర్‌పేటలోని లియోనియా రిసార్ట్‌లో ప్రారంభమైంది. 'గ్రీన్ ఫ్లోరోసెంట్ ప్రోటీన్' అనే అంశంపై చాల్ఫీ ప్రసంగించారు. నూతన పరిశోధనలను మరింత ప్రోత్సహించి.. ప్రస్తుత ప్రజారోగ్య సవాళ్లను పరిష్కరించడానికి ఈ సదస్సు తోడ్పడుతుందని చెప్పారు. కణజీవశాస్త్రంలో విప్లవాత్మకమైన పురోగతి వచ్చిందని, ఈ ముందడుగు అనేక వ్యాధులకు పరిష్కారం చూపగలదని పేర్కొన్నారు. కణాల్లో వ్యాధి సోకడానికి గల కారణాలు, చికిత్సకు దోహదపడే అంశాలపై ఇటీవలకాలంలో పరిశోధనలు పెరిగాయని.. ఇది హర్షించదగ్గ పరిణామమని చెప్పారు. అనంతరం యువ పరిశోధకులను ఉద్దేశించి నిర్వహించిన ప్రత్యేక సెషన్‌లో కణజీవశాస్త్రంలో సక్రమ పరిశోధన విలువలు, ఉపాధి అవకాశాల గురించి చాల్ఫీ వివరించారు. సీసీఎంబీ ఆధ్వర్యంలో ఈ నెల 31 వరకు నిర్వహించనున్న ఈ సదస్సులో సెల్ బయోలజీపై పరిశోధనచేస్తున్న 30 దేశాలు, 300 సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలతోపాటు 1,400 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. నాలుగేండ్లకోసారి నిర్వహించే 'ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ సెల్ బయాలజీ' సదస్సును భారత్‌లో నిర్వహించడం ఇదే మొదటిసారి. అనేక అంతర్జాతీయ సదస్సులకు వేదికగా మారిన హైదరాబాద్ ఈ సదస్సు కూడా ఆతిథ్యమిస్తూ, తన ప్రత్యేకతను మరోసారి చాటుకుంటున్నది. కాంగ్రెస్‌లో భాగంగా నిర్వహించే వివిధ సెషన్స్‌లో స్టెమ్‌సెల్స్, మాలిక్యులర్ స్ట్రక్చర్, క్రయోఎలక్ట్రాన్ మైక్రోస్కోపి మెథడ్స్, డ్రగ్ టార్గెట్స్, 'అప్లికేషన్స్ ఆఫ్ సెల్ బయోలజీ ఫర్ హెల్త్ అండ్ డయోగ్నస్టిక్స్' వంటి అంశాలపై చర్చలు నిర్వహిస్తారు.

రాజీవ్ స్వగృహ డైరెక్టర్ల నియామకం

బోర్డును పునర్వ్యవస్థీకరించిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్‌కు కొత్త డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో ఉన్న డైరెక్టర్లపై అనర్హత వేటు పడటంతో అప్పటినుంచి నియామకాలు జరుగలేదు. కంపెనీల చట్టం 2013 ప్రకారం డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి చిత్రా రామచంద్రన్ ఉత్తర్వులు జారీచేశారు. గృహనిర్మాణశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ.. బోర్డు ఆఫ్ డైరెక్టర్లకు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆర్థికశాఖ కార్యదర్శి, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్/డైరెక్టర్, తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, తెలంగాణ హౌసింగ్ బోర్డు కమిషనర్లు డైరెక్టర్లుగా వ్యవహరించనున్నారు.

కాంగ్రెస్‌వి దివాలాకోరు రాజకీయాలు

- నల్లగొండలో హత్యతో టీఆర్ఎస్‌కు సంబంధంలేదు.. న్యాయవిచారణ జరిపించాలి
- నిందితులను కఠినంగా శిక్షించాలి
- హతుడు, నిందితులు అంతా కాంగ్రెస్‌వారే
- వేములదే కాదు కోమటిరెడ్డి కాల్ లిస్ట్‌నూ బయటపెట్టాలి
- టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్



శనివారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్. చిత్రంలో తుంగతుర్తి ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ ఉన్నారు



నల్లగొండ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త శ్రీనివాస్ హత్య కేసులో నిందితులు కాంగ్రెస్ కార్యకర్తలేనని ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ విడుదల చేసిన ఫొటోలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నల్లగొండ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యతో టీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ స్పష్టంచేశారు. ఈ హత్యపై న్యాయవిచారణ జరిపించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్‌చేశారు. శనివారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో తుంగతుర్తి ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్‌తో కలిసి ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ ఏ సంఘటన జరిగినా దానిని టీఆర్ఎస్ పార్టీకి ఆపాదించడం కాంగ్రెస్ దివాలాకోరు రాజకీయాలకు పరాకాష్ఠ అని మండిపడ్డారు. మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశంపై కాంగ్రెస్ నేతలు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని వివరించారు. నేరెళ్లలో ప్రమాదవశాత్తూ లారీ కిందపడి చనిపోయిన ఘటన, ఖమ్మం జిల్లాలో కుటుంబకలహాల వల్ల జరిగిన హత్య నుంచి మొదలు తాజాగా నల్లగొండలో జరిగిన బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య వరకూ ప్రతీదాన్నీ కాంగ్రెస్ నేతలు టీఆర్ఎస్‌కు అంటగడుతూ తమ నీచబుద్ధిని చాటుకొంటున్నారని కర్నె ధ్వజమెత్తారు. హతుడు శ్రీనివాస్‌తో టీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధంలేదని స్పష్టంచేశారు. శ్రీనివాస్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి అనుంగు శిష్యుడని, ఇప్పుడు ఆయనను హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాంబాబు, మల్లేశ్, శరత్‌లు కోమటిరెడ్డి శిష్యబృందంలో సభ్యులని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి తదితరులు నల్లగొండ వెళ్లి శవరాజకీయాలకు తెరలేపారన్నారు. ఈ ఘటనతో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డిలకు సంబంధం ఉన్నదని అసత్య ఆరోపణలు చేస్తున్నారని, చివరకు సీఎం కేసీఆర్‌పై బాధ్యతను నెట్టేయడం వారి మనసుల్లో ఉన్న దుర్మార్గపు ఆలోచనలకు నిదర్శనమన్నారు. నేరచరితులకు స్నేహహస్తం అందించడం కాంగ్రెస్ పార్టీకి అలవాటేనన్నారు. జాతీయస్థాయిలో హాజీ మస్తాన్ నుంచి దావూద్ఇబ్రహీం వరకూ.. రాష్ట్రంలో మద్దెలచెర్వు సూరి నుంచి నయీం వరకూ ఫ్యాక్షనిస్టులను, గ్యాంగ్‌స్టర్లను పెంచి పోషించిన రక్తచరిత్ర కాంగ్రెస్‌దని ఆయన ఆరోపించారు. వేముల వీరేశం ఫోన్ కాల్స్‌కు సంబంధించి ఆర్నెలల కాల్ లిస్ట్‌ను బయటకు తీయాలని కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలపై కర్నె స్పందిస్తూ వేముల వీరేశంతో పాటు నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డికి సంబంధించి ఏడాది ఫోన్‌కాల్ లిస్ట్‌ను తీస్తే అన్ని విషయాలూ వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు.

నిందితుడు రాంబాబుపై కేసులు

శ్రీనివాస్ హత్య కేసులో ముఖ్యనిందితుడైన రాంబాబుకు నేర చరిత్ర ఉన్నదని, 2010లో నిడమానూరులో జరిగిన ఒక హత్య కేసులో జైలుకు పోయివచ్చాడని కర్నె ప్రభాకర్ తెలిపారు. 2011లో ఒక హత్యాయత్నం కేసులో నల్లగొండ టూ టౌన్‌లో కేసు నమోదయిందని, 2015లో అధికారులపై దాడిచేసిన కేసులో ఆయన నిందితుడని ప్రభాకర్ వెల్లడించారు. రాంబాబుతోపాటుగా మల్లేశ్, శరత్‌లు కోమటిరెడ్డి అనుచరులేనని స్పష్టంచేశారు. గతంలో కోమటిరెడ్డి దశరథరెడ్డి అనే కాంగ్రెస్ నేతపై రాంబాబు రెండుసార్లు దాడిచేసినప్పుడు అతడిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు శవరాజకీయాలు మానుకోవాలని కర్నె ప్రభాకర్ హితవు పలికారు. ఫొటోలే విచారణకు ప్రామాణికమైతే నిందితులందరూ కోమటిరెడ్డితో ఫొటోలు దిగినవారేనన్నారు. ఎమ్మెల్యే వీరేశం ఎన్జీ కాలేజీలో పీజీ ఎంట్రన్స్ పరీక్ష రాయడానికి వచ్చినప్పుడు కాలేజీ వద్ద యువ ఎమ్మెల్యే అనే క్రేజ్‌తో ఫొటో తీసుకొన్నారని తెలిపారు.

గ్రూప్-4 భర్తీకి సన్నాహాలు

సీఎంవో ముఖ్యకార్యదర్శితో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ భేటీ

తాజా ఖాళీలు, మరిన్ని కొలువులపై చర్చ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రూప్-4 ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీ సమాయత్తమవుతున్నది. ఈ మేరకు శనివారం సచివాలయంలో సీఎంవో ముఖ్యకార్యదర్శి నర్సింగరావుతో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి భేటీ అయ్యారు. ప్రస్తుతం గ్రూప్-4 క్యాటగిరీలో ఎనిమిది వందల ఖాళీలు ఉన్నాయని.. మరిన్ని ఖాళీల వివరాలపై ఆయా విభాగాల నుంచి సమాచారం సేకరించాలని సీఎంవో ముఖ్యకార్యదర్శి నర్సింగరావుకు ఘంటా చక్రపాణి సూచించగా అందుకు ఆయన అంగీకరించినట్టు తెలిసింది. ఇప్పటివరకు జరిగిన కొలువుల భర్తీ, వాటి పురోగతి తదితర అంశాలు ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్టు సమాచారం.

ప్రభుత్వ హామీలపై శాసనమండలి కమిటీ సంతృప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యాశాఖకు సంబంధించి శాసనమండలిలో ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో కొన్నింటిపై శాసనమండలి ప్రభుత్వ హామీల అమలు కమిటీ సంతృప్తి వ్యక్తంచేసింది. కమిటీ చైర్మన్ కొంపల్లి యాదవరెడ్డి అధ్యక్షతన శనివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో సమావేశమై.. గతంలో ప్రభుత్వం సభకు ఇచ్చిన హామీలపై చర్చించింది. పాఠశాల విద్యాశాఖకు చెందిన 23 హామీలు, ఉన్నత విద్యాశాఖకు సంబంధించి 11 హామీలపై సమీక్షించింది. అనంతరం కొన్ని హామీలపై సంతృప్తికరమైన సమాధానం రావడంతో వాటిని ఉపసంహరించుకొనేందుకు కమిటీ అంగీకరించింది. ఫిబ్రవరి 5వ తేదీన మరోసారి సమావేశమై ఏదైన ఒక స్కూలు, హాస్టల్‌ను సందర్శించాలని కమిటీ నిర్ణయించింది. కమిటీ సభ్యులు కర్నె ప్రభాకర్, డీ రాజేశ్వర్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, ఇంటర్మీడియట్ కమిషనరేట్ కమిషనర్ అశోక్, పాఠశాల విద్యాశాఖ డైరక్టర్ కిషన్, తెలంగాణ లెజిస్లేచర్ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు సమావేశంలో పాల్గొన్నారు.

ఫిబ్రవరి చివరికి ఎమ్మెల్యే క్వార్టర్లు సిద్ధం

ఇప్పటికే 70 పూర్తి.. చివరిదశలో మరో 50 నిర్మాణాలు

పనులు పరిశీలించిన మండలి చైర్మన్ స్వామిగౌడ్, స్పీకర్ మధుసూదనాచారి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదర్‌గూడలో శాసనసభ్యుల కోసం కొత్తగా నిర్మిస్తున్న ఎమ్మెల్యే క్వార్టర్లు ఫిబ్రవరి నెలాఖరు నాటికి అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ ఆధ్వర్యంలో రూ.132.73 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటివరకు రూ.118.15 కోట్లను ఖర్చుచేశారు. 120 ఎమ్మెల్యే క్వార్టర్లు, 120 సర్వెంట్ క్వార్టర్లు, 36 స్టాఫ్ క్వార్టర్లు నిర్మిస్తున్నారు. ఒక్కో అంతస్తులో 10 క్వార్టర్ల చొప్పున మొత్తం 12 అంతస్తులు నిర్మిస్తుండగా, ట్రిపుల్ బెడ్‌రూం సౌకర్యంతో 2400కు పైగా ఎస్‌ఎఫ్‌టీ విస్తీర్ణంలో క్వార్టర్ల నిర్మాణం జరుగుతున్నది. ఎమ్మెల్యేలకు సంబంధించిన 70 క్వార్టర్లు పూర్తి కాగా, మిగతా 50 క్వార్టర్లను ఫిబ్రవరిలో సిద్ధం చేస్తామని రోడ్లు భవనాలశాఖ అధికారులు తెలిపారు. శనివారం శాసనమండలి చైర్మన్ కనకమామిడి స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి తదితరులు రోడ్లు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే క్వార్టర్ల సముదాయాన్ని పరిశీలించారు. నిర్మాణాల గురించి అధికారులను అడిగి తెలుసుకుని, పనుల తీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు. పనులు త్వరగా పూర్తిచేసి క్వార్టర్లను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. వీరివెంట ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, తెలంగాణ లెజిస్లేచర్ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు తదితరులు ఉన్నారు.



హైదర్‌గూడలో ఎమ్మెల్యే క్వార్టర్ల నిర్మాణ పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకుంటున్న స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి. చిత్రంలో డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ ఉన్నారు

ఫిబ్రవరి 15 నుంచి డిగ్రీ ప్రాక్టికల్స్

ఉస్మానియా యూనివర్సిటీ, నమస్తే తెలంగాణ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల ప్రాక్టికల్ పరీక్షలను వచ్చేనెల 15 నుంచి నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని శనివారం ఒక ప్రకటనలో సూచించారు.

'ఎక్సైజ్' ధ్రువపత్రాల పరిశీలన వాయిదా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 2 వరకు నిర్వహించనున్న ఎక్సైజ్ కానిస్టేబుళ్ల ధ్రువపత్రాల పరిశీలన వాయిదా వేసినట్టు టీఎస్‌పీఎస్సీ ఒక ప్రకటనలో పేర్కొంది. తదుపరి తేదీలను త్వరలో వెల్లడించనున్నట్టు తెలిపింది. అదేతేదీల్లో నిర్వహించనున్న ఫిజికల్ క్వాలిఫైయింగ్ పరీక్ష యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేసింది. పూర్తి వివరాలు తమ వెబ్‌సైట్లో పొందుపర్చినట్టు పేర్కొంది.

పొత్తు వద్దనుకుంటే మా దారి చూసుకుంటాం



బీజేపీ నేతల విమర్శలపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందన

అమరావతి, నమస్తే తెలంగాణ: బీజేపీ నేతలు టీడీపీతో పొత్తు వద్దనుకుంటే తమ దారి తాము చూసుకుంటామని.. ఇప్పటికీ బీజేపీతో మిత్ర ధర్మం పాటిస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ నేతలు ఎన్ని విమర్శలు చేస్తున్నా తమ పార్టీ నేతలను చాలా వరకు నియంత్రిస్తున్నట్టు చెప్పారు. ప్రతిపక్షనేత జగన్ మాట మీద నిలబడడని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రత్యేక హోదా కోసం ఎంపీలతో రాజీనామా చేయిస్తా అన్నాడని, కానీ చేయించలేదని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇచ్చినప్పుడు జగన్‌కు ప్రత్యేకహోదా గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. కేసుల నుంచి బయటపడటానికి, అక్రమ ఆస్తులు కాపాడుకోవడానికి జగన్ ఎత్తులు వేస్తున్నారని ఆరోపించారు. అవినీతిపరుల ఆస్తులన్నీ ఇకపై ప్రజలకు చెందాలని జగన్ గురించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. బీహార్, ఒడిశా తరహాలో అవినీతితో దోచుకున్న సొమ్మంతా వెనుకకు తీసుకుంటామని సీఎం బాబు చెప్పారు.

చట్టంతో ట్రిపుల్ తలాక్ ఆగుతుందా?

కేంద్ర ప్రభుత్వంపై మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ధ్వజం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చట్టం తీసుకొచ్చినంత మాత్రాన ట్రిపుల్ తలాక్ ఆగిపోతుందా? ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా వరకట్న చావులు, మహిళలపై ఇతర నేరాలు తగ్గుముఖం పట్టాయా? అని హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. సామాజిక సమస్యలకు చట్టం ఒక్కటే పరిష్కారం కాదని చెప్పారు. ముస్లిం పురుషులను జైలుకు పంపించడానికే కేంద్ర ప్రభుత్వం ట్రిపుల్ తలాక్ బిల్లును ప్రవేశపెట్టిందని, ఇది ముస్లింలపై జరుగుతున్న కుట్రని ఆరోపించారు. సికింద్రాబాద్ బాలంరాయిలో శుక్రవారం రాత్రి 'తహఫుజే షరియత్' (ఇస్లామిక్ లా పరిరక్షణ) అంశంపై నిర్వహించిన మజ్లిస్ పార్టీ బహిరంగసభలో అసదుద్దీన్ మాట్లాడుతూ.. నిర్భయ ఘటన తర్వాత నిర్భయ చట్టం తెచ్చినా, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని, వాటికి చట్టం సమాధానం చెబుతుందా? అని ప్రశ్నించారు. బీజేపీ సర్కార్ ట్రిపుల్ తలాక్ చట్టం ముసుగులో పురుషులను జైలుకు పంపించి, మహిళలను రోడ్డున పడేసే కార్యక్రమాన్ని చేపట్టబోతున్నదని ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టడానికి ముందు ఎన్డీఏ ప్రభుత్వం ముస్లిం పెద్దలతో చర్చించలేదని, కనీసం అభిప్రాయాలు కూడా తీసుకోలేదని ఆయన ఆరోపించారు.

నేర విచారణలో ఇస్రో సహకారం

- టెక్నాలజీ వినియోగంతో సమర్థంగా పోలీస్ సేవలు
- వ్యాస్ జీవితం అధికారులకు ఆదర్శం
- కేఎస్ వ్యాస్ స్మారకోపన్యాసంలో డీజీపీ మహేందర్‌రెడ్డి



శనివారం బేగంపేటలోని సెస్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి. చిత్రంలో ఇస్రో మాజీ చైర్మన్ ఏఎస్ కిరణ్‌కుమార్, మాజీ డీజీపీ కేఎస్ వ్యాస్ సతీమణి అరుణ తదితరులు ఉన్నారు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టెక్నాలజీ వినియోగాన్ని పెంచడం ద్వారా పౌరులకు మరింత సమర్థంగా పోలీస్ సేవలు అందించగలుగుతామని డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి తెలిపారు. నేర విచారణలో ఇస్రో సహకారాన్ని తీసుకొంటామని వెల్లడించారు. మాజీ డీజీపీ కేఎస్ వ్యాస్ వర్ధంతి సందర్భంగా శనివారం బేగంపేటలోని సెస్ (సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్)లో తెలంగాణ పోలీస్ అకాడమీ ఆధ్వర్యంలో 'స్పేస్ టెక్నాలజీ అండ్ మెయింటెనెన్స్ ఆఫ్ లా అండ్ ఆర్డర్' అంశంపై కేఎస్ వ్యాస్ 22వ స్మారకోపన్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో డీజీపీ మహేందర్‌రెడ్డితోపాటు ఇస్రో మాజీ చైర్మన్ ఏఎస్ కిరణ్‌కుమార్, టీఎస్‌పీఏ డైరెక్టర్ జితేందర్, కేఎస్ వ్యాస్ భార్య అరుణ వ్యాస్, వ్యాస్ కుమారుడు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే శ్రీవాత్సవ పాల్గొన్నారు. వ్యాస్ చిత్రపటానికి డీజీపీత మహేందర్‌రెడ్డి నివాళులర్పించి మాట్లాడుతూ.. యువ అధికారులకు వ్యాస్ ఆదర్శంగా నిలుస్తారన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో సిబ్బందికి శిక్షణ నిర్వహించేందుకు ఇస్రో సమ్మతించడంపై సంతోషం వ్యక్తంచేశారు. వ్యాస్ ఏ పనినైనా ప్రణాళికాబద్ధంగా పూర్తిచేసేవారని వ్యాస్ భార్య అరుణవ్యాస్ గుర్తుచేసుకొన్నారు. ఎప్పటికీ వ్యాస్ మార్గదర్శకమేనని టీఎస్పీఏ డైరెక్టర్ జితేందర్ అన్నారు.

టెక్నాలజీ వాడకం పెరుగాలి

దేశ అవసరాల తగ్గట్టు టెక్నాలజీ వాడకం పెరుగాల్సి ఉన్నదని ఇస్రో మాజీ చైర్మన్ ఏఎస్ కిరణ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. శాంతిభద్రతలు కాపాడటంలో పోలీసులకు ఉపయోగపడే ఆవిష్కరణలను వివరించారు. తెలంగాణ పోలీసులకు ఇస్రో తరఫున సాంకేతిక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీజీ (లా అండ్ ఆర్డర్) అంజనీకుమార్, మాజీ డీజీపీలు పీఎస్ రామమోహన్‌రావు, హెచ్‌జే దొర పాల్గొన్నారు.

వికలాంగుల హాస్టళ్లలో నేటినుంచి నిద్ర

రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వికలాంగుల వసతి గృహాల్లోని సమస్యలు తెలుసుకోవడానికి ఆదివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వికలాంగుల వసతి గృహాల్లో నిద్ర కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి తెలిపారు. ఈనెల 28 నుంచి వచ్చే నెల 15వరకు వివిధ జిల్లాల్లోని హాస్టళ్లలో నిద్రపోతామని.. తద్వారా ఆయా వసతిగృహాల్లో ఉన్న సమస్యలను తెలుసుకొని నివేదిక రూపంలో సీఎం కేసీఆర్‌కు సమర్పిస్తామని చెప్పారు. శనివారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం వికలాంగుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన వికలాంగులహక్కు చట్టం ద్వారా కొత్తగా 14 రకాల వారిని వికలాంగులుగా గుర్తించడంతో మొత్తంగా 21 రకాల వారు ఈ జాబితాలోకి వచ్చారన్నారు. దీంతో రాష్ట్రంలో వికలాంగుల జనాభా దాదాపు 20 లక్షలకు చేరిందని వివరించారు. వీరిలో 5 లక్షల మందికి ఆసరా పథకం కింద నెలకు రూ.1500 పింఛన్ చెల్లిస్తున్నామని చెప్పారు. వికలాంగులను సకలాంగులు పెండ్లి చేసుకొంటే గతంలో ఇచ్చే రూ.50వేల ప్రోత్సాహకాన్ని సీఎం కేసీఆర్ రూ. లక్షకు పెంచారని వెల్లడించారు. వికలాంగుల మెస్ చార్జీలను రూ.850 నుంచి రూ.1500కు పెంచారన్నారు. వికలాంగుల వసతిగృహ నిద్రలో భాగంగా ఈ నెల 28న చంపాపేట బాలుర వికలాంగుల వసతి గృహంలో, 29న సాగర్ రింగ్ రోడ్డులోని వికలాంగుల వసతి గృహంలో హాస్టల్ నిద్ర ఉంటుందన్నారు. సమావేశంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కరిమెళ్ల బాబురావు, తెలంగాణ జాగృతి వికలాంగుల రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, వెంకటేశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం, 28 జనవరి 2018
WWW.NTNEWS.COM

సైంధవుల సయ్యాట

కట్టా మీఠా



కట్టా శేఖర్ రెడ్డి

మహాభారతం ఒక గొప్ప రాజకీయ కావ్యం. అందులో కనిపించని రాజకీయపాత్రలు లేవు. కౌరవ పాండవుల పెనుగులాట లాగా ఇప్పుడూ ఎప్పుడూ అధికారం కోసం పెనుగులాట సహజం. ఎవరు కౌరవులు, ఎవరు పాండవులన్నది ఇప్పుడేమో ప్రజలు నిర్ణయిస్తున్నారు. ప్రధాన పాత్రలు కాకుండా భారతంలో సైంధవుడు, శల్యుడు, శిఖండి, కర్ణుడు, అశ్వత్థామ.. వంటి చాలా పాత్రలున్నాయి. ఒకటి మంచికి, మరొకటి చెడుకు, ఇంకొకటి త్యాగానికి, స్నేహానికి, మరొకటి ద్రోహానికి ప్రతీకలు. ప్రధాన పాత్రలు కాకుండా చాలా తరచుగా ఇటువంటి పాత్రల గురించే చర్చ జరుగుతూ ఉంటుంది. ఉదాహరణకు సైంధవుడు. సింధు రాజు. ఆయన అసలుపేరు బృహద్రథుడు. కౌరవుల ఏకైక సోదరి దుస్సల భర్త. అంటే పాండవులకు కూడా బావ వరుస. అటువంటి వాడు ఒకసారి అరణ్యవాసంలో ఉండగా బృహద్రథుడు వరుసకు సోదరి అయిన ద్రౌపదిని చూసి మోహించి, రథంపై లాక్కెళుతుంటాడు. ఈ విషయం తెలిసిన పాండవులు ఆయనను వెంబడించి, బంధించి, జుట్టు కొరిగించి, అవమానించి పంపుతారు. ఆ అవమానంతో తపస్సు చేస్తాడు. పాండవులపై ప్రతీకారం తీర్చుకునే శక్తిని ఇవ్వమని శివుడిని అడుగుతాడు. అంతశక్తిని ఇవ్వలేను కానీ, ఒకరోజంతా పాండవ యోధులను నిలువరించే శక్తిని ఇస్తున్నాను. ఒక్క అర్జునుడిని మాత్రం ఎవరూ నిరోధించలేరు అని శివుడు చెబుతాడు. కురుక్షేత్రంలో పద్మవ్యూహం పన్నిన రోజున అర్జునుడిని ఉద్దేశపూర్వకంగా మరోవైపు మళ్లించి, పద్మవ్యూహంతో పాండవ సేనను ఛిన్నాభిన్నం చేస్తుంటారు ద్రోణాది కౌరవసేన. ధర్మరాజు, భీముడు, నకుల సహదేవులు ఒక్కరు కూడా అడుగు ముందుకువేయలేకపోతారు. అభిమన్యుడు ఒక్కడే పద్మవ్యూహంలోకి వెళ్లగలుగుతాడు. కానీ బయటికి రాలేడు. కౌరవయోధులంతా కలిసి అభిమన్యుడిని చంపుతారు. దానికి ప్రతీకారంగా అర్జునుడు మరుసటిరోజు సైంధవుడిని చంపుతాడు. ఒక్కరోజు పాండవ యోధులను నిలువరించగలుగడం, పాక్షికం నష్టం కలిగించగలుగడం సైంధవుడి పాత్ర. సైంధువుడు దుష్కర్ముడు. దుష్టపాత్ర. అభిమన్యుడి హత్యకు కారకుడు. ఆధునిక రాజకీయాల్లో ఎవరినైనా తిట్టాల్సి వస్తే ఈ పేరుతో తిట్టడం అందుకే. వీరు యుద్ధాన్ని గెలువలేరు. ఏదో తెలియని బాధ, దుగ్ధ ఉంటాయి. ఎవరినో గెలిపించడానికి, మరెవరినో ఓడించడానికి పనికివస్తారు.

పవన్‌కల్యాణ్ గురించి ఒక మిత్రుడు ఇదేమాట అన్నాడు. అందుకే పైకథ అంతా చెప్పాల్సి వచ్చింది. పవన్‌కల్యాణ్ అమాయకుడు, భోళా అని మరో మిత్రుడు అన్నాడు. సైంధవుడా, అమాయకుడా అన్న ప్రశ్న ఆయన మాటలు, ప్రవర్తనను చూసి అర్థం చేసుకోవాలి. ఆయన గెలువాలనుకొని, మార్పు తేవాలనుకొని రాజకీయాలు చేస్తున్నట్టుగా అనిపించదు. ముఖ్యమంత్రి కేసీఆర్ స్మార్ట్ సీఎం అంటారు. ఆయన పాలన బాగుందంటారు. మళ్లీ తెలంగాణలో అన్ని స్థానాలకు పోటీ చేస్తానంటాడు. మనసులో ఒకటి పెట్టుకొని పైకి మరొకటి మాట్లాడుతూ చాలా మిస్టీరియస్ పాత్ర పోషిస్తున్నాడనిపిస్తుంది. వసంత కోకిలలాగా ఎన్నికల రుతువులో పాటపాడే సినీ నాయకుడు కనిపిస్తారాయనలో. 2009 ఎన్నికలకు ముందు నుంచి నిన్న మొన్నటిదాకా ఆయన మాటల్లో వచ్చిన మార్పులన్నీ గుదిగుచ్చి ఎవరో మిత్రుడు ఒక వీడియో పంపారు. ఆయనలో ఎన్ని వైరుధ్యాలో. ఎంత నిలకడలేని తనమో. ఎంత చపలచిత్తమో. ఎంత అవకాశవాదమో. ఆయన చేగో బొమ్మ పెట్టుకుంటే ఒకప్పుడు మురిసిపోయాం. ఇప్పుడు ఈ వీడియో చూస్తే కనిపించేదంతా వాస్తవం కాదని, లోపలి మనుషులు వేరే ఉంటారని అర్థం అవుతుంది. పవన్‌కల్యాణ్ తన అన్న ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు తెలంగాణ రాష్ట్రానికి అనుకూలంగా తీర్మానం చేశారు. పవన్‌కల్యాణ్ తెలంగాణలో ప్రచారం చేస్తూ ఆవేశంతో ఊగిపోతూ నేను మీకు అండగా ఉంటా అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు తాను సైతం అంకితమవుతానని చెప్పారు. 2009 డిసెంబరులో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నిర్ణయం రాగానే అడ్డం తిరిగారు. గడ్డం గీసుకున్నంత తేలికగా రాష్ట్రాన్ని విడదీస్తారా అని ప్రశ్నించారు. విభజన జరిగినప్పుడు 'నాకు ఏడుపొచ్చింది. ఒక్కరోజు కాదు రెండు రోజులు కాదు 11 రోజులు అన్నం తినలేదు' అని చెప్పాడు. 'కేసీఆర్ తాటా తీస్తా' అని బీరాలు పలికాడు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తూ ఇంకా చాలాచాలా మాట్లాడాడు. అటువంటి మనిషి ఇప్పుడేం మాట్లాడుతున్నాడు? జై తెలంగాణ, వందేమాతరం వంటి ఒక మహావాక్యమట. కేసీఆర్ అంటే తనకు చాలా ఇష్టమట. ఊసరవెల్లులు కూడా సిగ్గుపడుతాయేమో. తెలంగాణకు నిజంగా కేసీఆర్ చాలు. ఇప్పుడు పవన్‌కల్యాణ్ వంటి టుమ్రీ రాజకీయవాదులు అవసరంలేదు. పిచ్చికూతలతో, పిచ్చి ఆవేశాలతో ఇక్కడ వాతావరణం చెడగొట్టకుంటే చాలు. చిరంజీవిలో ఉన్నపాటి స్థిరత్వం, గాంభీర్యం కూడా ఈ మనిషిలో లేదు.

రాజకీయాల్లో స్థిరత్వం ఉండాలి. మాట్లాడే ప్రతి మాటకు పొంతన ఉండాలి. సంబద్ధత ఉండాలి. కొనసాగింపు ఉండాలి. దీర్ఘకాలిక దృక్పథం ఉండాలి. ఇవి లేని విన్యాసాలన్నీ దూదిపింజల్లా గాలికి కొట్టుకుపోతాయి. పవన్‌కల్యాణ్ అయినా, తెలంగాణలో ప్రతిపక్ష నాయకులకైనా అదే వర్తిస్తుంది. ప్రతిపక్షాలది మరీ విచిత్ర వైఖరి. విశాల జనబాహుళ్య ప్రయోజనాలు చూడాలా లేక కొద్దిమంది కక్షిదారుల ప్రయోజనాలు చూస్తారా? కాంగ్రెస్, బీజేపీలు ప్రజాపక్షపాతం కలిగిన రాజకీయపక్షాలుగా కాకుండా కోర్టు కక్షిదారులుగా మారిపోయాయి. కరువు సీమకు ఎన్నో ఏండ్లు ప్రాతినిధ్యం వహించిన నాగం జనార్దన్‌రెడ్డి కేసుల ఉద్యమం నడిపిస్తున్నారు. జేఏసీ నాయకులు సైతం కేసుల వెంటే పరుగెడుతున్నారు. కాంగ్రెస్ సంగతి ఇంకా చెప్పనవసరం లేదు. ఈ కక్షిదారుల మనస్తత్వం భూస్వామ్య సంస్కృతి నుం చి పుట్టుకొచ్చింది. 'వాడు రోడ్డేస్తే నాకు చెడ్డ పేరొస్తుంది. వాడు కాలువ తీస్తే వాడికి పేరొస్తుంది. పొలాలకు నీళ్లొస్తే జనం మన మాట వినరు. ఊళ్లోకి బడి వస్తే పిల్లలు పనికిరారు. అందరికీ భూమి ఉంటే మన పొలాల్లో ఎవరు పనిచేస్తారు?' ఇది తరతరాలుగా సాగుతున్న ఆలోచనాధార. చాలామంది ప్రతిపక్ష నాయకులు ఈ ఆలోచనాధార నుంచి బయటపడటం లేదు. రైతులకు పరిహారం ఇవ్వాలనడం, పునరావాసం కల్పించాలనడంలో ఎవరికీ భిన్నాభిప్రాయంలేదు. ప్రభుత్వం చట్టం ద్వారానే ఆ పనులన్నీ చేస్తున్నది. ఇంకా నష్టపోతున్నామని ఎక్కడైనా రైతులు వాదిస్తే అదనపు సాయం కూడా అందిస్తున్నది. అన్నిరకాలుగా నిర్వాసితులను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అదీ నచ్చకపోతే కోర్టులో అదనపు పరిహారం కోసం కొట్లాడే అవకాశమూ ఉంది. రాజకీయ లక్ష్యాలు, వాంఛలు, అభివృద్ధి పథకాలు, ప్రాజెక్టులకు అవరోధాలుగా మారడం రాష్ట్రానికి మంచిది కాదు.

> 'వాడు రోడ్డేస్తే నాకు చెడ్డ పేరొస్తుంది. వాడు కాలువ తీస్తే వాడికి పేరొస్తుంది. పొలాలకు నీళ్లొస్తే జనం మన మాట వినరు. ఊళ్లోకి బడి వస్తే పిల్లలు పనికిరారు. అందరికీ భూమి ఉంటే మన పొలాల్లో ఎవరు పనిచేస్తారు?' ఇది తరతరాలుగా సాగుతున్న ఆలోచనాధార. చాలామంది ప్రతిపక్ష నాయకులు ఈ ఆలోచనాధార నుంచి బయటపడటం లేదు. రైతులకు పరిహారం ఇవ్వాలనడం, పునరావాసం కల్పించాలనడంలో ఎవరికీ భిన్నాభిప్రాయంలేదు. ప్రభుత్వం చట్టం ద్వారానే ఆ పనులన్నీ చేస్తున్నది. ఇంకా నష్టపోతున్నామని ఎక్కడైనా రైతులు వాదిస్తే అదనపు సాయం కూడా అందిస్తున్నది.

నిజానికి ఈ పరిహారాల గురించి ఆలోచించకుండానే చాలా ప్రాజెక్టుల కింద రైతులు తమ భూముల్లో కాలువలు తవ్వనిచ్చారు. నల్లగొండ జిల్లాలో వరదకాలువ కింద చాలామంది రైతులు భూములు ఎప్పుడో ఇచ్చేశారు. కనీసం భూ సేకరణ నోటిఫికేషన్ కూడా రాకుండానే భూములు ఇచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి ఎత్తిపోతల కింద కొన్ని గ్రామాల రైతులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి భూములు ఇచ్చారు. వాళ్లు దేవుళ్లు. ఎందుకంటే నీరు బంగారమని, జీవనాధారమని, నీటి కంటే ఏదీ విలువైనది కాదని అర్థం చేసుకున్నవాళ్లు, నమ్మినవాళ్లు కాబట్టి వారు అలా చేశారు. రాజకీయ నాయకత్వం అటువంటి వారికి అండగా నిలబడి సత్వర న్యాయం జరిగేట్టు చూడాలి. నీళ్లు లేకపోతే ఎన్ని ఎకరాల భూమి ఉంటే ఏమిటి ప్రయోజనం? రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ తాగు, సాగునీటి కోసం తన్లాడింది. నీరు లేక తెలంగాణ ఎలా వెనుకబడిపోయిందో అందరికీ అనుభవంలో ఉన్నదే. స్వరాష్ట్ర ఉద్యమం కారణంగానే ఆంధ్ర నాయకత్వం తెలంగాణలో ఆదరాబాదరా అడ్డగోలు ప్రాజెక్టులు మొదలుపెట్టింది. తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించిన శక్తులు ఇప్పుడు ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఫ్రంటు గట్టడం అంటే అంతకంటే విడ్డూరం ఏముంటుంది? నిన్నటి మన ఎజెండా ఇవ్వాళ ఎందుకు ఎజెండా కాకుండాపోయింది? అభివృద్ధి పథంలో సైంధవులు కాకూడదని అందరూ అర్థం చేసుకుంటే తెలంగాణకు మేలు జరుగుతుంది.

kattashekar@gmail.com

'బసంత్'లో రాజకీయ చిత్రాలు

జ్ఞాపకాలు



బుద్ధా మురళి

మానవ సంబంధాలు, కుటుంబ సభ్యుల మధ్య అనురాగాలు, రాగద్వేషాలు, వెన్నుపోట్లు, అధికారం, డబ్బు కోసం అయినవారిపైనే కుట్రలు.. కష్టాలు, కన్నీళ్ల సెంటిమెంట్లు ఇవన్నీ సినిమాలో చూస్తూ.. అది తెర అని, మనం చూసేది సినిమా అని తెలిసినా.. ఆ నాటకీయతలో లీనమై ప్రేక్షకులుగా మనం కూడా భావోద్వేగాలకు గురవుతుంటాం. సినిమాలు ప్రదర్శించే టాకీసులో అలాంటి అరుదైన దృశ్యాలు కళ్లముందు నిజంగానే జరుగుతుంటే.. ప్రేక్షకులుగా సినిమా చూసిన కుర్చీల్లోనే నిజమైన ఆ సంఘటనలు చూసే అరుదైన అవకాశం కాచిగూడలోని బసంత్ టాకీస్‌లో లభించింది.

కాచిగూడ మెయిన్‌రోడ్‌కు సంబంధం లేకుండా గల్లీలో ఉండే ఈ టాకీసు అప్పట్లో ఇళ్ల మధ్య ఉండేది. ఇప్పుడు ఏకంగా అపార్ట్‌మెంట్‌గా మారిపోయింది. మూగ మనసులు, జీవనతరంగాలు, జీవనజ్యోతి, బలిపీఠం, ఆలుమగలు వంటి సెంటిమెంట్ కథాబలం ఉన్న సినిమాలు ప్రదర్శించిన బసంత్‌లో అంతకన్నా బలమైన సెంటిమెంట్ దృశ్యాలు చోటుచేసుకున్నాయి.

ఆ దుష్టున్ని బంధించండి అని జానపద సినిమాల్లో వృద్ధరాజు ఆదేశించగానే సైనికులు ఆ రాజునే బంధిస్తారు. తన వెనుక జరిగిన కుట్రలను ఆ రాజు అప్పటివరకు గుర్తించడు. గుర్తించినా ఏమీ చేయలేని దశలో గుర్తిస్తాడు. సైన్యాధ్యక్షుని కుట్రలను ఛేదించి తల్లిదండ్రులను విడిపించిన యువరాజుల కథలు.

జానపద సినిమాల్లో సైన్యాధ్యక్షుల కుట్రలను ఛేదించిన యువరాజుల సినిమాలను మార్నింగ్ షోలుగా, విలన్లను మట్టికురిపించిన హీరోల సినిమాలు రెగ్యులర్ షోలుగా ఎన్నో ప్రదర్శించిన ఈ టాకీసులో అలాంటి సంఘటనలు నిజంగానే జరుగడం విశేషం.

బసంత్ టాకీస్ ఇక నడిచే అవకాశం లేదని గ్రహించాక తెరను శాశ్వతంగా దించేసి ఫంక్షన్‌హాలుగా మార్చారు. అంతకన్నా లాభసాటి ఆలోచన రాగానే దానిని అపార్ట్‌మెంట్‌గా మార్చారు. బసంత్ టాకీస్ అపార్ట్‌మెంట్‌గా అవతారమెత్తక ముందు కీలకమైన రాజకీయ పరిణామాలు అక్కడ చోటుచేసుకున్నాయి. ఎన్టీ రామారావును అధికారం నుంచి దించేసి చంద్రబాబు ముఖ్యమంత్రి పదవి చేపట్టిన సంఘటన అనగానే అందరికీ వైస్రాయ్ హోటల్ గుర్తుకు వస్తుంది. అంతకన్నా కీలక పరిణామం బసంత్ టాకీస్‌లో చోటుచేసుకున్నది.

ఒక కుమారుడు తన తండ్రిని ఒక పదవి నుంచి తొలిగించి బోరున ఏడ్చింది ఇక్కడే. ఒక అల్లుడు మామ పదవిని కైవసం చేసుకొని బావమరిదిని ఓదార్చింది ఇక్కడే.

తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి నుంచి ఎన్టీఆర్‌ను తొలిగించేందుకు బసంత్ టాకీస్‌లోనే పార్టీ సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నో సెంటిమెంట్ సినిమాలు తెరపై ప్రదర్శించిన చోటే సజీవ సెంటిమెంట్ సినిమా ప్రదర్శించారు. ఎన్టీఆర్‌ను దించే ఎపిసోడ్‌లో వైస్రాయ్ హోటల్‌కు లభించినంత గుర్తింపు కీలక పరిణామాలకు వేదికైనా ఇతర ప్రాంతాలకు లభించలేదు. పార్టీ అధ్యక్ష పదవి నుంచి ఎన్టీఆర్‌ను తొలిగిస్తూ ఆయన కుమారుడు నందమూరి హరికృష్ణ బసంత్ టాకీస్‌లో జరిగిన సమావేశంలోనే తీర్మానం ప్రవేశపెట్టారు. అక్కడివరకు ఉత్సాహంగా వచ్చిన హరికృష్ణ తన తండ్రిని పార్టీ అధ్యక్ష పదవి నుంచి తొలిగిస్తూ తీర్మానం చదివి దుఃఖం ఆపుకోలేకపోయారు. సినిమాలు ప్రదర్శించే వేదికపైనే ఏడ్చేశారు. సినీ ప్రేక్షకులు సీట్లపైన మీడియా, పార్టీ నాయకులు ఇప్పుడు ఏమవుతుంది? హరికృష్ణ దుఃఖం వల్ల ఎన్టీఆర్‌ను దించేయాలనే నిర్ణయం మార్చుకుంటారా? ఏం చేస్తారని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తుండగా చంద్రబాబు హరికృష్ణ భుజంపై చేయి వేసి అనునయించారు. బాబు సకాలంలో స్పందించి హరికృష్ణ కన్నీటిని నిలిపివేయించారు. ఆ తర్వాత అశోక గజపతిరాజు, ఇతర నాయకులు అనునయించారు. తండ్రిని కుమారుడు గద్దెదించినట్టు చరిత్ర పుస్తకాల్లో, సినిమాల్లో కనిపించే దృశ్యం బసంత్‌లో కనిపించింది.

తక్కువ బడ్జెట్‌తో అద్భుత కథాబలంతో దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన తూర్పుపడమర, నీడ వంటి సినిమాలు బసంత్‌లో విజయవంతంగా ప్రదర్శించారు.

ఇక్కడి నుంచే దాసరి నారాయణరావు రాజకీయ పార్టీ ఏర్పాటుచేయాలనీ ప్రయత్నించారు. అది విడుదలకు నోచుకోని సినిమాగానే మిగిలిపోయింది. చిరంజీవి కన్నా ఓ దశాబ్దకాలం ముందే దాసరి రాజకీయపార్టీ ఏర్పాటుకోసం ప్రయత్నించారు. బసంత్ టాకీస్‌లో దాసరి అభిమాన సంఘాల రాష్ట్ర సమావేశం జరిగింది. అందరి అభిప్రాయాలూ తీసుకొని అక్కడే దాసరి పార్టీ ప్రకటిస్తారని తొలుత సమాచారం ఇచ్చారు. అభిమానులు పార్టీ పెట్టాల్సిందేనని సూచించారు. మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశరావు అప్పటికప్పుడు ఏ సామాజికవర్గం ఓట్లు ఎక్కడ ఎన్ని ఉన్నాయి. దాసరి పార్టీ పెడితే ఎన్ని సీట్లు వస్తాయో ఆ టాకీసులోనే మీడియాకు లెక్కలు చెప్పారు. దాసరి అభిమానులకు నివేదిక ఇచ్చారు. పార్టీ ఏర్పాటు చేయలేదు. కానీ అక్కడ మాత్రం ఉత్సాహపూరిత వాతావరణం కనిపించింది. పురజనుల కోరికపై దాసరి పార్టీ ఏర్పాటును కొద్దిరోజులు వాయి దా వేస్తున్నారని దాసరి తరపున గోనె మీడియాకు లీకేజీ ఇచ్చా రు. కానీ మీడియా మాత్రం దాసరి పార్టీ విడుదల కావడం లేద ని రాశాయి. దాసరి రాజకీయ సినిమా విడుదల కాకుండానే దాసరి జీవితం ముగిసింది. బసంత్ టాకీస్ కనుమరుగైంది. అప్పుడప్పుడు హిందీ సినిమాలు ప్రదర్శించినా బసంత్‌లో ఎక్కువగా తెలుగు సినిమాలు ప్రదర్శించేవారు.

> తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి నుంచి ఎన్టీఆర్‌ను తొలిగించేందుకు బసంత్ టాకీస్‌లోనే పార్టీ సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నో సెంటిమెంట్ సినిమాలు తెరపై ప్రదర్శించిన చోటే సజీవ సెంటిమెంట్ సినిమా ప్రదర్శించారు. ఎన్టీఆర్‌ను దించే ఎపిసోడ్‌లో వైస్రాయ్ హోటల్‌కు లభించినంత గుర్తింపు కీలక పరిణామాలకు వేదికైనా ఇతర ప్రాంతాలకు లభించలేదు. పార్టీ అధ్యక్ష పదవి నుంచి ఎన్టీఆర్‌ను తొలిగిస్తూ ఆయన కుమారుడు నందమూరి హరికృష్ణ బసంత్ టాకీస్‌లో జరిగిన సమావేశంలోనే తీర్మానం ప్రవేశపెట్టారు.

సినిమా టాకీస్‌లో జనం అంతంత మాత్రమే కాగా సైకిల్‌స్టాండ్‌లో సైకిళ్ల సంఖ్య ఇంకా తక్కువగా ఉండేది. టాకీసుకు పక్కనే వెదురుబొంగులు అమ్మేవారు, అనధికారికంగా సైకిల్‌స్టాండ్ నిర్వహించేవారు. టాకీసులోని సైకిల్ స్టాండ్‌కన్నా తక్కువధర, టికెట్ దొరక్కపోతే రిటన్ తీసుకువెళ్లవచ్చుననే సౌకర్యం కల్పించడంతో ఎక్కువమంది అనధికార స్టాండ్‌లోనే సైకిల్ పార్క్ చేసేవారు. ఇప్పుడంటే ఓ కుటుంబం సినిమాకు వెళ్లాలంటే ఓ వెయ్యి రూపాయలు కావాలి. ఆ రోజుల్లో ఓ ఐదు రూపాయలుంటే చాలు సైకిల్ స్టాండ్, ఇంటర్‌వెల్ ఖర్చుతో సహా.

శోభన్‌బాబుకు సోగ్గాడు అనేది మరో పేరుగా మారిపోయింది. ఆ సినిమా విడుదల సందర్భంగా శోభన్‌బాబు తన సన్నిహితులతో ఈ సినిమా తర్వాత ఈ సినిమా పేరే తనపేరుగా మారిపోతుందని చెప్పారట. దానికి తగ్గట్టుగానే శోభన్‌బాబును అప్పటి నుంచి సోగ్గాడు శోభన్‌బాబు అని పిలిచారు. సోగ్గాడు సినిమా బసంత్‌లో 1975లో 110 రోజులు ఆడింది.

శోభన్‌బాబు విజయవంతమైన ఎన్నో సినిమాలు ఇందులో ప్రదర్శించారు. ఇద్దరు అమ్మాయిలు, కన్నవారి కలలు, చక్రవాకం, రాధాకృష్ణ, దీపారాధన, ప్రతీకారం వంటి సినిమాలు బసంత్‌లో విజయవంతంగా ప్రదర్శించారు.


సినిమా చరిత్రలోనే కాదు రాజకీయ చరిత్రలోనూ బసంత్‌కు స్థానం ఉంది. ఎన్నో విజయవంతమైన సినిమాలు ప్రదర్శించిన బసంత్ మారిన పరిస్థితులను తట్టుకోలేక మూతపడి, బసంత్ అపార్ట్‌మెంట్‌గా కొత్తరూపు సంతరించుకున్నది.

(వ్యాసకర్త: రాష్ట్ర సమాచార కమిషనర్)



పద్మావత్ సినిమాను అడ్డుకునే పేర చేస్తున్న హింసాత్మక ఘటనలు అవాంఛితమైనవి, సహించరానివి. అలాంటి అరాచకాన్ని అడ్డుకోవాలి. పిల్లలు పెడుతున్న ఆర్తనాదాలు పాలకులకు వినడటంలేదా?

రణదీప్ ఎస్.సుర్జేవాలా



టెర్రరిజాన్ని నిర్వచించుకోవాల్సిన సమయం వచ్చింది. స్కూల్ పిల్లల బస్సుపై దాడి టెర్రరిస్ట్ చర్యనే. సరిహద్దు వద్ద భారత జవానులపై దాడి చేయటం లాంటిదే. ఈ రెండింటి మధ్య తేడా ఏమున్నదో ఆలోచించాలి, అర్థం చేసుకోవాలి.

ప్రీతీశ్ నంది



మనం రాజ్యాంగంలో పొందుపర్చిన మూడు ప్రధానమైన హక్కులను పరిరక్షించుకోవాలి. సమానత్వాన్ని, వ్యక్తి మౌలిక స్వేచ్ఛను, జీవించే హక్కును చెబుతున్న ఆర్టికల్-14,19,21లను కాపాడుకోవాలి. వీటికే ప్రమాదం ఏర్పడితే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడినట్లే.

మనీశ్ తివారీ



కర్ణిసేన అల్లరి మూకలను ఎందుకు జీప్ ముందర కట్టి పాఠశాల బస్సులు, టాకీసుల ముందు తిప్పటంలేదు? వారు చేస్తున్న హింసాదౌర్జన్యాలను నియంత్రించాలంటే అలాంటిది సరైనది కాదా? కశ్మీర్‌లో చేసింది ఇక్కడెందుకు చేయట్లేదు?

ఒమర్ అబ్దుల్లా

భాష గౌరవ చిహ్నం

విశ్లేషణ



ప్రొఫెసర్ కనకదుర్గ దంటు

ఒక భాషలో వివిధ స్థాయిలు ఉంటాయి. మానవుడు పుట్టిపెరుగుతున్నప్పుడు రకరకాల భాషాస్థాయిల ప్రభావానికి గురవుతాడు. సరిగ్గా పలుకలేని స్థితిలో ముద్దుమాటలతో పెద్దలు పెద్దవారిని మురిపిస్తారు. వయసు పెరుగుతున్న కొద్దీ కుటుంబంలోని ఇతర వ్యక్తులు మాట్లాడే భాషా స్థాయే అతనికి అలవడుతుంది. విద్యాగంధం లేని కుటుంబాల్లో సాధారణంగా చిన్నపిల్లలు ఇంటిబయట తమస్థాయిలో ఉన్నవారితోనే కాలం గడుపుతారు. ఇంట్లో కూడా నిరక్షరాస్యులైన తల్లిదండ్రులంటే వారి స్థాయిలోనే భాష నేర్చుకుంటారు. ఆ స్థాయి పెరిగి భాషలోని అభ్యంతరకరమైన పదాలు అసభ్యకరమైన భావాలు వేరుచేసి చూడాలంటే భాషా సంస్కారం ఉన్న మనుషులతో కానీ, పాఠశాల వంటి సంస్థతో కానీ, సమాజంలో ఉన్న సంస్కారం ఉన్న సజ్జనులతో కానీ కలిస్తేనే సాధ్యం.

పాఠశాల విద్య గరిపే వారి భాష-కుటుంబ నేపథ్యం ఏదైనా-కొద్దిగా పైస్థాయికి పెరుగటానికి అవకాశముంటుంది. ఇంకాపైకి చదివి రకరకాల మనుషులను కలువడం, గమనించడం చేసిన వారి భాష సంస్కారవంతంగా తయారయ్యే అవకాశం ఉంటుంది. ఈ రకంగా తయారయిన సమాజంలో భాష వివిధ స్థాయిల్లో ఉంటుంది..

1.కేవలం తమ చుట్టుపక్కల ఉన్నవారిస్థాయి భాష ఉపయోగించడం అది శాంగ్ అంటారు.

2.పుట్టుకతో వచ్చిన సంస్కారం లేక చదువు ద్వారా అభ్యంతరకర పదాలు, వాక్యాలు విసర్జించి చుట్టుపక్కల వారికి, బాధ కలిగించని భాష వాడటం, అది కొంచెం ఫార్మల్ భాష అవుతుంది.

3.చదువుతో పాటు భాష మీద పట్టు సాధించి, ఏ పరిస్థితికి చుట్టూ ఉన్న సమాజానికి సరిపోయే భాష వాడి సంస్కారవంతుడన్న సామాజిక ముద్ర సంపాదించడం. ఇది పూర్తి ఫార్మల్ స్థాయి భాష అవుతుంది.

4.విశ్వవిద్యాలయ స్థాయికి వెళ్లి పూర్తిగా పైస్థాయి భాషను వంటపట్టించుకుని సరైన పదాలు, క్లిష్ట వాక్యాలు సందర్భోచితంగా ఉపయోగించగలిగితే దానిని అకడమిక్ స్థాయి భాష అంటారు.

ఇన్నిస్థాయిల్లో భాషను వాడవచ్చు అని కూడా చాలామందికి తెలియదు. అయితే భాష మనిషికి ఉన్న ఒకే ఒక వరం, లేక ఆయుధం. అయితే, మనిషికి ఉన్న ఒకే ఒక వరం, లేక ఆయుధం. అయితే నాగరిక ప్రపంచంలో నివసిస్తున్నామని అనుకుంటున్న మనం పదేపదే ఈ భాషా స్థాయిలలో వ్యత్యాసాల వల్ల ఎందుకు పోట్లాడుకుంటున్నాము?

ఇవన్నీ ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే, ఇన్ని స్థాయిలు ఉంటాయనీ ఇంట్లో, బయట భాషా స్థాయి కూడా ఒకటి ఉండదనీ తెలియకుండా మనుషులు మాట్లాడుతున్నారు గనుక. మన రాష్ట్ర ముఖ్యమంత్రి పబ్లిక్‌లో మాట్లాడే భాష గురించి ఒక జీవో తెస్తారన్న వార్తకు విపక్షాలు, సోకాల్డ్ మేధావులు స్పందించిన తీరు ఆశ్చర్యపరిచింది. నిజానికి ముఖ్యమంత్రి రాజ్యాంగాన్ని తిరుగరాయటంలేదు, అవమానపర్చటం లేదు. అందులోని రెండు అధికరణలను ఉపయోగిస్తామంటున్నారు. వారు అన్నది ఏమిటంటే 'ఎవరి గురించైనా.. ముఖ్యమంత్రి గౌరవనీయ పదవుల్లో ఉన్నవారి గురించి మాట్లాడేటప్పుడు భాషాస్థాయి కూడా గౌరవప్రదంగా ఉండాలనీ, నీచస్థాయి పదాలు వాడినా, సరైనా ఆధారాలు లేకుండా కువిమర్శలు చేసినా అరెస్టులు చేసే అధికారం ఉపయోగిస్తా'మనీ. ఇందులో అభ్యంతరకరమైనదేమీలేదు. అయితే దానికి విపక్షాలు-బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు, జేఏసీ నాయకుడిగా ప్రభుత్వం చేసే ప్రతిపనిని విమర్శించే ప్రొఫెసర్ కోదండరాం ఇతర మేధావులు చేసిన కామెంట్స్ చాలా విచిత్రంగా ఉన్నాయి. వాటిని వింటే ఈ కింది ప్రశ్నలు ఎవరికైనా మనసులో కలుగకమానవు.

1.ప్రభుత్వాన్ని గానీ, టీఆర్‌ఎస్‌ను గానీ, ఇతరులను గానీ విమర్శించేటప్పుడు గౌరవనీయమైన భాష వాడాలంటే అసలు విమర్శించవద్దని అర్థమా? లేక తాము విమర్శించాలంటే కేవలం కిందిస్థాయి భాషే మాట్లాడగలం, స్థాయి పెంచలేం అని వారు భావిస్తున్నారా?

2.గౌరవనీయ పదవుల్లో ఉన్నవారి గురించి అంటే, గౌరవనీయు లు అంటే కేవలం ముఖ్యమంత్రి, టీఆర్ఎస్, అధికారులేనా? కాంగ్రెస్, బీజేపీ, కమ్యూనిస్టునేతలు, విమర్శించిన మేధావులు గౌరవనీయుల పట్టికలోకి రారా?

3.ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్ అంటే ఏదైనా మాట్లాడటమా? తన హక్కులాగే ఇతరులకూ గౌరవంగా బతికే హక్కును ఇవ్వకపోవడమా? ఏది మాట్లాడినా గౌరవనీయ భాషలో చెప్పటం, వ్యక్తిగత దూషణలు లేకుండా మాట్లాడటం ఈ విమర్శకులకు చేతకాదా?

4.ఎంత నష్టం, కష్టం కలిగించిన డిమానిటైజేషన్, జీఎస్టీ లాంటి వాటిమీద కోపంరాని వీరికి కేవలం నీచస్థాయి భాష వాడి మీ స్థాయి దించుకోకండి అంటే ఎందుకింత కోపం వస్తుంది?

నిజానికి ఒక మనిషి వ్యక్తిత్వాన్ని అతని భావాలు, ప్రవర్తన, మాట బట్టికదా నిర్ణయించే ది! భావాలనేవి అతినకేకానీ, ఇతరులకు తెలియదు. ప్రవర్తన గమనించటానికి సయయం పడుతుంది కానీ మాట అన్నది వినగానే ఆ మని షి సంస్కారస్థాయి తెలుస్తుంది. మరి ఇంత క్షణాల్లో మన గురించి చెప్పే ఆ భాషను ఎంత గౌరవించాలి, ఎంత జాగ్రత్తగా వాడాలి? 'యూ ఆర్ ఏ ఫూల్' అన్నా 'యూ ఆర్ నాట్ వెరీ వైజ్' అన్నా అర్థం ఒకటే. కానీ మొదటి మాట ఎదుటి మనిషిని మనకు శత్రువును చేస్తుంది. రెండవది అతన్ని ఆలోచింపజేస్తుంది. ఒక భాషావేత్త అంటాడు 'పాజిటివ్ లాంగ్వేజ్ గెట్స్ పాజిటివ్ రిజల్ట్స్, ఎండ్ నెగటివ్ లాంగ్వేజ్ నెగటివ్!' అని. మరి రేవంత్ రెడ్డి నుంచి కోదండరాంగారి దాకా ఒకలాగే స్పందించటమేమిటి?

ఈ మధ్య ఇంకో మేధావి రాసిన పుస్తకం దుమారం రేపింది. నిజానికి దుమారం లేచింది పుస్తకంలో రాసినది చదివాక కాదు, పుస్తకం టైటిల్ మీదే! అది 'కోమటోళ్ళు-సామాజిక స్మగ్లర్స్' అని. కానీ ఆయన దాని బదులు 'మోసపోయిన బహుజనులు' అని పుస్తక పీఠిక పెట్టి ఉంటే దానికి ఎంతో విలువ ఉండేది. భాష అనేది మనిషికి ఉన్న ఒకే ఒక వరం. మనిషి శరీరం, బుద్ధి పెరిగినట్టే భాషా స్థాయి కూడా పెంచుకుంటే సామాజిక గౌరవం, వ్యక్తిగత ఆదరం ఎవరికైనా పెరుగుతాయి. ఎవరినైనా అవమానించాలన్న కొంటె ఆలోచనవచ్చినా చాలా తెలివిగా చేయొచ్చు 'ఐడోంట్ గివ్ వే టు ఫూల్స్' అని దారికడ్డంగా నిలబడిన మనిషిని చూసి చిరునవ్వుతో 'బట్ ఐడూ' అని తప్పుకునే మేధావి కన్నా చిలిపి వారెవరు? 'కూరలో ఉప్పెక్కువైందా?' అని అడిగిన భార్యతో 'లేదు, నేను ఇంకో రెండు వంకాయలు ఎక్కువ తేవలసింది అని చెప్పే తెలివైన భర్త ఎక్కువ సుఖపడడా? 'నాకీ చీర బాగుందా అని అడిగిన ప్రియురాలికి 'నీకే చీరైనా బ్రహ్మాండమే, చీరకే అందం వస్తుంది' అని చెప్పే మొగవాడు ఈ మేధావుల కంటే తెలివైన వాడు కాదా? ఏనాడో చెప్పిన శతకంలోని పద్యాలు మర్చిపోతే భాష గురించి మరుపు వస్తుంది. 'నొప్పింపక, తానొవ్వక తప్పించుకు తిరుగువాడే ధన్యుడు సుమతీ!' ఇది ఇంటిలోపల పనిచేసే మంత్రం కాదు ఎందుకుంటే పని తప్పించుకునేవాడిని, బాధ్యత లేక తిరిగేవాడిని ఇంట్లో గౌరవించరు. కానీ సమాజ జీవితంలో 'నొప్పింపక తానొవ్వక' అనేది మాత్రం అందరూ గుర్తుపెట్టుకోవాల్సిన సూత్రం. దీనికి పెద్ద చదువులు, మేధ అవసరం లేదు. మనిషిగా ఆత్మగౌరవం ఉంటే చాలు, అవతలవాడి గౌరవాన్ని కూడా గౌరవిస్తారు. దానిని నిర్ణయించేది మాత్రం భాషాసంస్కారమే!


> 'కూరలో ఉప్పెక్కువైందా?' అని అడిగిన భార్యతో 'లేదు, నేను ఇంకో రెండు వంకాయలు ఎక్కువ తేవలసింది అని చెప్పే తెలివైన భర్త ఎక్కువ సుఖపడడా? 'నాకీ చీర బాగుందా అని అడిగిన ప్రియురాలికి 'నీకే చీరైనా బ్రహ్మాండమే, చీరకే అందం వస్తుంది' అని చెప్పే మొగవాడు ఈ మేధావుల కంటే తెలివైన వాడు కాదా? ఏనాడో చెప్పిన శతకంలోని పద్యాలు మర్చిపోతే భాష గురించి మరుపు వస్తుంది. 'నొప్పింపక, తానొవ్వక తప్పించుకు తిరుగువాడే ధన్యుడు సుమతీ!' ఇది ఇంటిలోపల పనిచేసే మంత్రం కాదు ఎందుకుంటే పని తప్పించుకునేవాడిని, బాధ్యత లేక తిరిగేవాడిని ఇంట్లో గౌరవించరు. కానీ సమాజ జీవితంలో 'నొప్పింపక తానొవ్వక' అనేది మాత్రం అందరూ గుర్తుపెట్టుకోవాల్సిన సూత్రం.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ట్రంప్‌తో ఆ 'సంబంధాలు' లేవు

ఆ వదంతులు అత్యంత ప్రమాదకరం, హేయం: నిక్కీ హేలీ





వాషింగ్టన్: అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తనకు వివాహేతర సంబంధం ఉన్నదన్న వదంతులు అత్యంత ప్రమాదకరం, హేయమని ఐక్యరాజ్య సమితిలో అమెరికా రాయబారి, భారతీయ సంతతి మహిళ నిక్కీ హేలీ అన్నారు. ఆ వదంతుల్లో ఎంతమాత్రం నిజం లేదన్నారు. మైఖేల్ వుల్ఫ్ అనే రచయిత ఇటీవల వెలువరించిన 'ఫైర్ అండ్ ఫ్యూరీ' పుస్తకంలో ట్రంప్-హేలీ సంబంధాలపై పలు ఆరోపణలు చేశారు. దీనిపై హేలీ స్పందిస్తూ, 'ఒకసారి నేను ఎయిర్‌ఫోర్స్ వన్ (అధ్యక్షుని విమానం)లో ప్రయాణించాను. అయితే అధ్యక్షుడు ఉన్న గదిలో నాతోపాటు చాలామంది ఉన్నారు' అని చెప్పారు. 'ఓవల్ (అధ్యక్షుని కార్యాలయం)లో నా రాజకీయ భవిష్యత్ గురించి అధ్యక్షునితో చాలా ఎక్కువగా మాట్లాడానని (రచయిత) ఆరోపించాడు. నేనెప్పుడూ నా రాజకీయ భవిష్యత్ గురించి మాట్లాడలేదు. నేను ఎన్నడూ ఒంటరిగా ఆయనతో లేను' అని హేలీ చెప్పారు. దశాబ్దం నుంచి తాను రాజకీయాలలో ఉన్నానని, తనపై గతంలోనూ ఇలాంటి ఆరోపణలు వచ్చాయన్నారు. తనవంటి ఎంతోమంది మహిళలపై ఇటువంటి ఆరోపణలు సాధారణమైపోయాయన్నారు. అందువల్ల మహిళలు తమ ప్రాధాన్యాలను ఎంచుకొని, వాటిపై దృష్టిని కేంద్రీకరించాలని, ఏదైనా చేయగలమన్న నమ్మకముంటే దానిని సరైన విధంగా చేయాలని సూచించారు. నిక్కీహేలీ ట్రంప్ ప్రభుత్వంలో క్యాబినెట్ స్థాయి ఉన్న ఏకైక ప్రవాస భారతీయురాలు.



రాష్ట్రపతి భవన్‌లో శనివారం ఓ చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్. దేశవ్యాప్తంగా ఆదివారం నుంచి మూడురోజులపాటు పల్స్ పోలియో కార్యక్రమాన్ని చేపట్టనున్నారు

బీజేపీ నేతలు ఇంగ్లిష్‌ను అర్థం చేసుకోలేరు

కర్ణాటక మంత్రి రామలింగారెడ్డి



న్యూఢిల్లీ, జనవరి 27: 'బీజేపీ నాయకులు ఇంగ్లిష్‌ను సరిగా అర్థం చేసుకోలేరు' అని కర్ణాటక మంత్రి రామలింగారెడ్డి విమర్శించారు. మైనార్టీ వర్గానికి చెందిన అమాయకుల మీద నమోదైన కేసుల ఉపసంహరణ అంశంపై అభిప్రాయాలు తెలియజేసేందుకు పోలీసు అధికారులు హాజరుకావాలని రాష్ట్ర డీజీపీ ఇటీవల రాసిన లేఖపై బీజేపీ అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలో మంత్రి స్పందించారు. 'బీజేపీ నాయకులు ఇంగ్లిష్‌ను సరిగా అర్థం చేసుకోలేరు. ఇది సర్క్యులర్ కాదు. కేవలం మరోసారి గుర్తుచేస్తున్నారంతే. మైనార్టీలకు వ్యతిరేకంగా కొన్ని తప్పుడు కేసులు నమోదుచేశారని ఆ వర్గం నాయకులు కొందరు తెలిపారు. దీన్ని గుర్తుచేస్తూ ఎస్పీలకు డీజీపీ లేఖ రాశారు' అని రామలింగారెడ్డి చెప్పారు. మతపరమైన ఆందోళనల్లో పాల్గొన్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న అమాయకులైన మైనార్టీ వర్గానికి చెందిన వారి మీద నమోదైన కేసుల ఉపసంహరణపై వెంటనే అభిప్రాయాలు తెలియజేయాలంటూ వివిధ జిల్లాల ఎస్పీలు, కమిషనర్లకు కర్ణాటక డీజీపీ లేఖ రాశారని శుక్రవారం ఓ పత్రిక వార్తను ప్రచురించింది. దీనిపై బీజేపీతోపాటు హిందూసంస్థలు స్పందించాయి. కర్ణాటక ప్రభుత్వం పక్షపాతధోరణితో వ్యవహరిస్తున్నదని, ఈ నిర్ణయంతో సమాజంలోని మెజారిటీవర్గాల్లో అభద్రతాభావం నెలకొనే అవకాశం ఉన్నదని మండిపడ్డాయి. కేవలం మైనార్టీవర్గానికి చెందిన వారి కేసులనే ఉపసంహరిస్తామని పేర్కొనడంపై బీజేపీ నేత రాజేశ్ నాయక్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

కాస్‌గంజ్‌లో హింస

- యూపీలోని పట్టణంలో రెండువర్గాల మధ్య దాడులు
- బస్సులు, షాపులు దగ్ధం.. పట్టణంలో నిషేధాజ్ఞలు



ఆందోళనకారుల హింసలో దగ్ధమవుతున్న బస్సు

లక్నో, జనవరి 27: ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాస్‌గంజ్ పట్టణంలో శనివారం మళ్లీ హింస చోటుచేసుకుంది. శుక్రవారం జరిగిన అల్లర్ల సందర్భంగా మరణించిన యువకుని అంత్యక్రియల అనంతరం ఓ వర్గానికి చెందిన వారు మళ్లీ విధ్వంసానికి పాల్పడ్డారు. పట్టణంలోని ప్రధాన మార్కెట్‌లోగల దుకాణాలను దగ్ధం చేశారు. మరికొన్ని దుకాణాలను ధ్వంసం చేశారు. మార్కెట్‌కు కొంతదూరంలో రెండు బస్సులను కూడా తగులబెట్టారు. దీంతో పట్టణంలో నిషేధాజ్ఞలు జారీ చేసిన అధకారులు, స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆరెస్సెస్ అనుబంధ సంస్థలైన ఏబీవీపీ, విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు పట్టణంలో 'తిరంగా బైక్ ర్యాలీ' నిర్వహించారు. వందల సంఖ్యలో ఉన్న కార్యకర్తలు జాతీయపతాకాలు, కాషాయ జెండాలు చేతపట్టుకొని పట్టణంలోని ఒక ప్రాంతంలో నినాదాలు చేశారు. అయితే స్థానికంగా ఉన్న కొందరు వారిని వేరొక మార్గంలో వెళ్లాలని సూచించారు. ఇందుకు నిరాకరించిన ఏబీవీపీ, వీహెచ్‌పీ కార్యకర్తలు 'భారత దేశంలో ఉండాలంటే అందరూ వందేమాతరం అనాల్సిందే' అని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఘర్షణ మొదలైందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. వైరి వర్గాలు తొలుత పరస్పరం రాళ్లు రువ్వుకున్నాయని, ఆ తరువాత పరిస్థితి కాల్పులకు దారితీసిందని తెలిపారు. ఈ ఘటనలో చందన్‌గుప్తా అనే యువకుడు మరణించగా, నౌషాద్ అనే మరొకరు గాయపడ్డారు. ఇద్దరికీ బుల్లెట్లు తగిలినట్టు తెలుస్తున్నది. చందన్ మృతికి కారణమైన వారందరినీ అరెస్టు చేసేంత వరకు అతని అంత్యక్రియలు నిర్వహించబోమని కుటుంబసభ్యులు మొండికేశారు. దీంతో బీజేపీ ఎంపీ రాజ్‌వీర్ సింగ్ అక్కడికి చేరుకొని మృతుని కుటుంబాన్ని ఓదార్చి, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బైక్ ర్యాలీలో పాల్గొన్న యువకులపై ఒక పథకం ప్రకారమే దాడి జరిగిందని రాజ్‌వీర్‌సింగ్ ఆరోపించారు. ఆసిడ్ బాటిళ్లు, రాళ్లు విసిరారని, ఆ తరువాత తుపాకులతో కాల్చారని ఎంపీ చెప్పారు. చందన్‌గుప్తా మృతికి నిరసనగా కొందరు శనివారం ఉదయం మళ్లీ హింసకు దిగారు. దీంతో జిల్లా సరిహద్దులను మూసివేశామని, 49 మందిని అరెస్టు చేశామని జిల్లా మేజిస్ట్రేట్ ఆర్పీ సింగ్ చెప్పారు. పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నా అదుపులోనే ఉందని తెలిపారు.

మారణహోమం

కాబూల్‌లో అంబులెన్స్‌తో ఉగ్రవాదుల దాడి

95 మంది మృతి, 158 మందికి గాయాలు
వారంలో రెండో ఘటన, రెండు కి.మీ వరకు ప్రకంపనలు
తామే దాడి చేశామని ప్రకటించుకున్న తాలిబన్
ఖండించిన భారత్.. సాయం చేసేందుకు సిద్ధమని వెల్లడి



పేలుడు జరిగిన ప్రదేశం నుంచి క్షతగాత్రులను దవాఖానకు తరలిస్తున్న భద్రతా సిబ్బంది

కాబూల్ / న్యూఢిల్లీ, జనవరి 27:

ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లో మరోసారి ఉగ్రదాడి జరిగింది. బాంబులు నింపిన అంబులెన్స్ వ్యాన్‌ను నడుపుకుంటూ వచ్చిన ఆత్మాహుతిదళ సభ్యుడు శనివారం నగరంలోని రద్దీ మార్కెట్ వద్ద పేల్చివేశాడు. దీంతో అతడితోపాటు కనీసం 95 మంది మరణించగా, 158 మందికి గాయాలయ్యాయని ఆఫ్ఘన్ ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. దాడి జరిగిన ప్రదేశానికి సమీపంలోనే యూరోపియన్ యూనియన్ (ఈయూ)తోపాటు వివిధ దేశాల రాయబార కార్యాలయాలు ఉన్నాయి. కాగా, తామే ఈ దాడి చేశామని తాలిబన్ ప్రకటించింది. వారం రోజుల్లో తాలిబన్లు దాడి చేయడం ఇది రెండోసారి. గత వారం కాబూల్‌లోని కాంటినెంటల్ హోటల్‌పై నలుగురు ఉగ్రవాదులు జరిపిన దాడిలో 22 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. తాజాగా జరిగిన దాడితో బాంబు పేలుడు దాటికి రెండు కిమీ దూరంలోని భవనాల్లో కిటికీలు ఊగిపోయాయి. వందల మీటర్ల దూరంలోని భవనాల కిటికీలు విరిగిపోగా, చిన్న చిన్న నిర్మాణాలు కూలిపోయాయి. కొందరు వ్యక్తులు పేలుడుతో ఆకాశాన్నంటే రీతిలో పొగలు వెలువడ్డ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. బయటపడ్డ వారంతా ప్రాణభీతితో భయాందోళనలతో పరుగులు తీశారు. శిథిలాల మధ్య తీవ్ర గాయాలతో రక్తమోడుతున్న పౌరులను, మృతదేహాలను అంబులెన్సులు, ప్రైవేట్ కార్లలో సమీప దవాఖానలకు తరలిస్తుండటంతో భీతావహ వాతావరణం ఏర్పడింది. క్షతగాత్రులను సమీప జమురాత్ దవాఖానకు తరలించారు. భారీగా గాయపడటంతో వారికి కారిడార్లలోనే చికిత్స అందిస్తున్నారు. సాధారణంగా చెక్‌పోస్టుల వద్ద అంబులెన్స్‌లను నిలువరించరు. ఆత్మాహుతి దళ సభ్యుడు రెండు చెక్‌పోస్టుల మీదుగానే అంబులెన్స్ వ్యాన్ తీసుకెళ్లాడు. మొదటి చెక్‌పోస్టు వద్ద ప్రశ్నించినప్పుడు ఒక రోగిని సమీప జమురాత్ దవాఖానకు తీసుకెళ్తున్నట్లు చెప్పాడని ఆఫ్ఘన్ ఆంతరంగిక వ్యవహారాలశాఖ డిప్యూటీ అధికార ప్రతినిధి నస్రత్ రహీమీ చెప్పారు. రెండో చెక్‌పోస్టు వద్ద అంబులెన్స్‌లో బాంబులు ఉన్నట్లు గుర్తిస్తుండగానే ఆత్మాహుతి దళ సభ్యుడు తనతోపాటు అంబులెన్స్‌ను పేల్చివేశాడని తెలిపారు. ఈ ఘటనతో సంబంధం ఉందని అనుమానిస్తున్న నలుగురు తాలిబన్ అనుబంధ హక్కానీ నెట్‌వర్క్ మిలిటెంట్లను అరెస్ట్ చేశామన్నారు. శనివారం ఉదయం ఉగ్రవాదులు దాడిచేసే అవకాశం ఉన్నదని నిఘా సంస్థలు హెచ్చరికలు జారీ చేశాయి. దాడి జరిగిన ప్రదేశానికి సమీపంలోనే యూరోపియన్ యూనియన్ (ఈయూ)తోపాటు వివిధ దేశాల రాయబార, ఇతర ఉన్నతస్థాయి కార్యాలయాలు ఉన్నాయి. తాలిబన్లతో చర్చలకోసం వచ్చిన ఈయూ ప్రతినిధి బృందం సభ్యులు మాత్రం సురక్షితంగానే ఉన్నారని ఆఫ్ఘన్ అధికారులు చెప్పారు. 'హై పీస్' కౌన్సిల్ కార్యాలయం చెక్‌పోస్ట్ లక్ష్యంగానే దాడి జరిగిందని ఆ సంస్థ ప్రతినిధి హసీనా సఫీ తలిపారు. ఘటనాస్థలానికి సమీపంలో స్టేషనరీ షాపు యజమాని అమీనుల్లా మాట్లాడుతూ పేలుడుతో తమ భవన పునాదులూ కంపించాయన్నాడు. ఇటలీ స్వచ్ఛంద సంస్థ 'ఎమర్జెన్సీ' సమన్వయకర్త డేజాన్ ప్రాణభీతితో వణికిపోయారు. ఈ ఘటనను అమెరికా, నాటోతోపాటు బ్రిటన్ విదేశాంగశాఖ మంత్రి బోరిస్ జాన్సన్ ఖండించారు. కాబూల్‌లో ఒక రాయబార కార్యాలయంపై గతేడాది మే 31న జరిపిన ట్రక్కు బాంబు దాడిలో 150 మంది మృతి చెందారని, అదేస్థాయిలో శనివారం దాడి జరిగిందని ఆఫ్ఘన్ అధికారులు తెలిపారు.

ఆటవికం.. పిరికిపందల చర్య: భారత్

కాబూల్‌లో తాలిబన్లు జరిపిన దాడి ఆటవికం, పిరికిపందల చర్య అని భారత్ వ్యాఖ్యానించింది. క్షతగాత్రులకు చికిత్సనందించడంతోపాటు అవసరమైన సాయమందిస్తామని విదేశాంగశాఖ పేర్కొన్నది.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు నక్సల్స్ మృతి

మృతుల్లో ఒక మహిళ: ఛత్తీస్‌గఢ్‌లో ఘటన

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా అడవుల్లో శనివారం ఉదయం భద్రతాదళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు నక్సల్స్ మృతిచెందారు. వీరిలో ఓ మహిళ కూడా ఉన్నారు. చింతల్నార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాడ్‌మెట్ల, మొర్పల్లి గ్రామాల మధ్య ఎదురుకాల్పులు జరిగినట్టు సుక్మా ఎస్పీ అభిషేక్ మీనా చెప్పారు. కోబ్రా 201వ బెటాలియన్, సీఆర్పీఎఫ్ ప్రత్యేక విభాగం, స్థానిక పోలీసులు సంయుక్తంగా అడవుల్లో గాలిస్తుండగా మావోయిస్టులు కాల్పులు జరిపారని, ఆత్మరక్షణార్థం పోలీసులు కాల్పులు జరిపారన్నారు. తర్వాత ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయని, ఇందులో ఒక మహిళ మృతదేహం కూడా ఉన్నదని తెలిపారు.

కశ్మీర్‌కు స్వాతంత్ర్యం ఇవ్వాలి

బ్రిటన్ ఎంపీ నజీర్ అహ్మద్ వివాదాస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: కశ్మీర్‌కు, ఖలిస్థాన్‌కు స్వాతంత్ర్యం ప్రకటించాలని బ్రిటన్ ఎంపీ లార్డ్ నజీర్ అహ్మద్ లండన్‌లోని భారతహైకమిషనర్ కార్యాలయం ఎదుట వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో బ్రిటన్‌లోని భారతీయులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పాక్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని లండన్‌లోని భారతీయులు ఆరోపించారు. 'లార్డ్ నజీర్ అహ్మద్ నాదేశం నుంచి కశ్మీర్‌కు స్వాతంత్ర్యం కోరుకుంటున్నారు. కానీ నేను పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం నుంచి, ఉగ్రవాదులు చేస్తున్న హింస నుంచి విముక్తిని కోరుకుంటున్నాను' అని భారత్‌కు చెందిన ఉద్యమకారుడు, రచయిత పేర్కొన్నారు.

'ప్రజా మ్యానిఫెస్టో' రూపొందించండి

కర్ణాటక నేతలకు రాహుల్ ఆదేశం

న్యూఢిల్లీ: త్వరలో జరుగనున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలపై కాంగ్రెస్ దృష్టిసారించింది. రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి రావడానికి 'ప్రజా మ్యానిఫెస్టో'ను రూపొందించాలని ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కర్ణాటక నేతలను ఆదేశించారు. కర్ణాటక కాంగ్రెస్ ఇంఛార్జి మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ అమలుకు సాధ్యమైన హామీలను దృష్టిలో ఉంచుకొని మ్యానిఫెస్టో రూపొందించాలని, ఈ మ్యానిఫెస్టో ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని రాహుల్ సూచించినట్లు తెలిపారు.

రాహుల్ వీవీఐపీ అనుకుంటున్నారు

బీజేపీ అధికార ప్రతినిధి నర్సింహారావు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తనను తాను అత్యంత ప్రాముఖ్యం గల వ్యక్తిగా(వీవీఐపీ) భావిస్తున్నారని, అందరి కంటే ఎక్కువగా తనకే ప్రాధాన్యం ఉండాలని కోరుకుంటున్నారని బీజేపీ విమర్శించింది. గణతంత్ర వేడుకల సందర్భంగా రాహుల్‌కు ఆరో వరుస సీటు కేటాయించడంపై కాంగ్రెస్ పార్టీ విమర్శలకు బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నర్సింహారావు స్పందిస్తూ 'వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏం జరిగిందో ఓ సారి గుర్తుచేసుకుంటే మంచిది. అప్పుడు బీజేపీ నేతలకు కూడా ఇలాగే సీట్లు కేటాయించారు. కానీ మా నాయకులు ఎలాంటి సమస్యను సృష్టించలేదు' అని పేర్కొన్నారు.

సైన్యం కాల్పుల్లో ఇద్దరు పౌరుల మృతి

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని సోపియాన్ జిల్లాలో శనివారం సాయంత్రం భద్రతాదళాలు జరిపిన కాల్పుల్లో ఇద్దరు పౌరులు మరణించారు. గనోవ్‌పుర గ్రామం నుంచి వెళ్తున్న సైనికుల కాన్వాయ్‌పై ఆందోళనకారులు రాళ్లురువ్వారు. వారిని పట్టుకునేందుకు సైనికులు జరిపిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన జావేద్ అహ్మద్ భట్, సుహైల్ జావిద్ లోన్ మరణించారు. గాయపడిన మరొక వ్యక్తికి శ్రీనగర్‌లోని దవాఖానలో చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ఘటనపై సీఎం మెహబూబా ముఫ్తీ దర్యాప్తునకు ఆదేశించారు. రక్షణమంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆమె ఫోన్‌లో మాట్లాడారు.

సౌదీ యువరాజు వలీద్ విడుదల

రియాద్: అవినీతి కేసులో జైలుపాలైన సౌదీ అరేబియా యువరాజు, అత్యంత సంపన్నుడు అల్ వలీద్ బిన్ తలాల్ శనివారం విడుదలయ్యారు. మూడు నెలలపాటు ఆయన జైలులో ఉన్నారు. పలువురు యువరాజులపై అవినీతి ఆరోపణలు రావడంతో సౌదీ ప్రభుత్వం దాడులు చేసింది. వలీద్‌తోపాటు పలువురు యువరాజులను అరెస్టు చేసింది. అరెస్టైన వారిలో నేషనల్ గార్డ్ మాజీ అధిపతి ప్రిన్స్ మితెబ్ బిన్ అబ్దుల్లా ఇప్పటికే జైలు నుంచి విడుదలయ్యారు.

ఐరాసలో ఘనంగా గణతంత్రం

అమెరికా, దక్షిణాఫ్రికాలలో ఉత్సాహంగా రిపబ్లిక్ డే వేడుకలు



భారత రాష్ట్రపతి ప్రసంగ పాఠాన్ని ఐరాసలో చదివి వినిపిస్తున్న భారత రాయబారి అక్బరుద్దీన్

వాషింగ్టన్: న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి (ఐరాస)తోపాటు అమెరికా, దక్షిణాఫ్రికా తదితర దేశాల్లో భారత్ 69వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఐరాసలో భారత శాశ్వత రాయబారి సయ్యద్ అక్బరుద్దీన్ మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఇచ్చిన విందుకు భద్రతామండలి శాశ్వత సభ్యదేశాల్లో అమెరికా రాయబారి నిక్కీ హేలీ మినహా మిగతా దేశాల రాయబారులు హాజరయ్యారు. ఆమె న్యూయార్క్‌లో లేరు. పాక్ శాశ్వత రాయబారి మహీలా లోధీతోపాటు ఐరాస సాధారణ అసెంబ్లీ అధ్యక్షుడు మిరోస్లావ్ లాజాక్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ అమీనా జే మహ్మద్, వివిధ దేశాల రాయబారులు హాజరయ్యారు. వీరందరికి ఐరాసలో శాశ్వత రాయబారి సయ్యద్ అక్బరుద్దీన్ ట్విట్టర్‌లో ధన్యవాదాలు తెలిపారు. వాషింగ్టన్‌లోని రాయబార కార్యాలయం ముందు మహాత్మాగాంధీ విగ్రహం వద్ద అమెరికాలో భారత రాయబారి నవ్‌తేజ్ సింగ్ సర్నా పుష్పాంజలి ఘటించారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అమెరికాలోని న్యూయార్క్, శాన్‌ఫ్రాన్సిస్కో, షికాగో, హ్యూస్టన్, అట్లాంటా దౌత్య కార్యాలయాల్లోనూ గణతంత్ర వేడుకలు జరిగాయి. దక్షిణాఫ్రియా రాజధాని జొహెన్స్‌బర్గ్‌లో భారత్ కాన్సుల్ జనరల్ కేజే శ్రీనివాస ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు జరిగాయి. 2018కి ప్రత్యేకత ఉన్నదని శ్రీనివాస పేర్కొంటూ.. జాతి వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించిన మహాత్మాగాంధీని పీటర్‌మారిట్జ్‌బర్గ్‌లో రైలు నుంచి బ్రిటిష్ పాలకులు బయటకు తోసివేసి సరిగ్గా 125 ఏండ్లవుతున్నదని గుర్తు చేశారు. దక్షిణాఫ్రికా జాతిపిత నెల్సన్ మండేలా శతజయంతి కూడా ఇదే ఏడాది అని పేర్కొన్నారు.

13 మంది జల సమాధి

- మృతుల్లో ఏడుగురు చిన్నారులు
- నదిలో పడ్డ మినీ బస్సు; మహారాష్ట్రలో దుర్ఘటన
- మరో ఘటనలో ఆరుగురి మృతి



కొల్హాపూర్ వద్ద నదిలోపడి నుజ్జునుజ్జయిన బస్సు

ముంబై, జనవరి 27: మహారాష్ట్రలో 13 మంది జల సమాధి అయ్యారు. వారు ప్రయాణిస్తున్న బస్సు నదిలో పడిపోవడంతో ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఏడుగురు చిన్నారులు ఉన్నారు. ఈ దుర్ఘటన మహారాష్ట్రలోని కొల్హాపూర్ పట్టణంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పుణెకు చెందిన మూడు కుటుంబాలు మినీబస్సులో రత్నగిరి జిల్లాలోని గణపతిపులె ప్రాంతాన్ని సందర్శించి తిరిగి వస్తుండగా కొల్హాపూర్ పట్టణంలోని శివాజీ బ్రిడ్జి వద్ద బస్సు అదుపుతప్పి పంచ గంగనదిలో పడిపోయింది. ఈ సంఘటనలో 13 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలు, ఏడుగురు చిన్నారులు ఉన్నారు. ఈ ఏడుగురు చిన్నారుల్లో ఏడు నెలల పసిపాప కూడా ఉన్నది. మృతుల్లో డ్రైవర్ కూడా ఉన్నారు. పోలీసులు మాట్లాడుతూ వేగంగా ఉన్న బస్సును అదుపు చేయడంలో డ్రైవర్ విఫలమయ్యాడని దీంతో బస్సు బ్రిడ్జి రేలింగ్‌ను ఢీకొని నదిలో పడిపోయిందని చెప్పారు. ప్రమాదం సమయంలో బస్సులో 16 మంది ఉన్నారని, అందులో 13 మంది మృతిచెందగా, ముగ్గురు గాయాలతో బయటపడ్డారని తెలిపారు. మృతులు పుణేలోని బాలెవాడి, పిరన్‌గట్ ప్రాంతానికి చెందినవారని పోలీసులు చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున నష్టపరిహారం అందజేయనున్నామని మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు శుక్రవారం ఉదయం కొల్హాపూర్ జిల్లాలో జరిగిన మరో ప్రమాదంలో ఆరుగురు మరణించారు. వారు ప్రయాణిస్తున్న కారు చెట్టును ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది.

భారత్-కాంబోడియా మధ్య రక్షణ సంబంధాలు



ప్రధానులు మోదీ, హున్‌సేన్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న భారత్, కాంబోడియా అధికారులు

న్యూఢిల్లీ: రక్షణ, భద్రత, ఉగ్రవాద నిరోధక చర్యలు వంటి అంశాల్లో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని భారత్, కాంబోడియా నిర్ణయించాయి. ఉగ్రవాద నిర్మూలనకు ప్రపంచవ్యాప్త ప్రయత్నాలు మరింత ముమ్మరం కావాలని, ఉగ్రవాద స్థావరాల నిర్మూలన, ఉగ్రవాదులకు నిధులు అందే మార్గాల మూసివేతకు చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్రమోదీ, కాంబోడియా

ఉభయ దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు

ప్రధాని హున్‌సేన్ పిలుపునిచ్చారు. ఇద్దరు ప్రధానుల మధ్య చర్చల అనంతరం ఉభయ దేశాలు నాలుగు ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. నేరాల నివారణ, వాటి దర్యాప్తు, నేరాలకు సంబంధించిన అంశాలలో న్యాయ సహాయంపై కూడా ఒక ఒప్పందం కుదిరింది. కాంబోడియాలో స్టంగ్ స్వా హ్యాబ్ జల వనరుల అభివృద్ధి ప్రాజెక్టుకు భారత్ 36.92 కోట్ల డాలర్లను సహాయం అందించనుంది. ఉభయ దేశాల మధ్య ప్రస్తుతం కొనసాగుతున్న ద్వైపాక్షిక రక్షణ సంబంధాలు, నౌకల సందర్శన, శిక్షణ పట్ల ఇద్దరు ప్రధానులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజం

ఎన్సీసీ, ఎన్నెస్సెస్ వలంటీర్లతో ప్రధాని మోదీ ఇష్టాగోష్ఠి భేటీ

ప్రజాస్వామ్య వ్యవస్థలో భిన్నాభిప్రాయాలు సహజమని, కానీ దేశ ఐక్యత కోసం అందరూ ఏకం కావాలని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. శనివారం ఆయన ఎన్సీసీ క్యాడెట్లు, ఎన్నెస్సెస్ వలంటీర్లు, కళాకారులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సామాజిక మార్పు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై ఆశలు పెట్టుకోవడానికి బదులు జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా 2019లో స్వచ్ఛ భారత్ లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలన్నారు. దేశం కోసం త్యాగాలు చేసిన వారి జీవితాలను గురించి తెలుసుకోవాలని సూచించారు.

పులుల హననం




- మధ్యప్రదేశ్‌లో 13 నెలల్లో 33 పులుల మృత్యువాత

భోపాల్, జనవరి 27: మధ్యప్రదేశ్ (ఎంపీ)లో పులులు పెద్ద సంఖ్యలో మరణిస్తున్నాయి. తాజాగా ఈ రాష్ట్రంలోని సెహదోలి జిల్లా జైసింగ్‌నగర్ ప్రాంతం దేవ్‌హారా గ్రామంలో మరో పులి చనిపోయింది. దీంతో ఈ నెలలో రాష్ట్రంలో చనిపోయిన పులుల సంఖ్య ఏడుకు చేరింది. గత 13 నెలల్లో ఎంపీలో 33 పులులు మరణించాయి. దీంతో పులుల మరణాల్లో ఎంపీ మొదటి స్థానంలో నిలుస్తున్నది. ప్రపంచంలో పులుల అభయారణ్యాలు ఎంపీలోనే ఎక్కువగా ఉన్నాయి. ఒకప్పుడు ఈ రాష్ట్రంలో చాలా పులులు ఉండేవి. అయితే వివిధ కారణాల వల్ల, ముఖ్యంగా కరంట్ షాకులతో చనిపోతున్నాయి. అటవీ గ్రామాల్లోని రైతులు తమ పంటలను అడవి పందులు, నీల్‌గాయ్‌ల బారి నుంచి కాపాడుకోవడానికి పొలాల చుట్టూ అక్రమంగా హైవోల్టేజీ విద్యుత్ కంచెలు నిర్మించుకుంటున్నారు. పులుల వేటగాళ్లు కూడా ఇటువంటి కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. నీళ్లు, ఆహారం కోసం ఆ గ్రామాలవైపు వచ్చిన పులులు ఆ కంచెలు తాకి షాక్‌తో ప్రాణాలు కోల్పోతున్నాయి. పులుల చర్మం, గోళ్లు, పంజాల కోసం పులులను హతమార్చడం ఈ రాష్ట్రంలో ఎక్కువగా జరుగుతున్నది. అందుకే ఈ రాష్ట్రంలో పులుల మరణాలు ఎక్కువగా ఉంటున్నాయని ఆ అధికారి వివరించారు. ఇప్పుడు దేశంలో పెద్దసంఖ్యలో పులులున్న రాష్ట్రాల్లో కర్ణాటక మొదటిస్థానంలో ఉన్నట్టు తెలుస్తున్నది.

కేరళలో మహిళా ఇమామ్!

శుక్రవారం ప్రార్థనలు నిర్వహణ.. దేశంలోనే తొలిసారి



మల్లపురం: కేరళ రాష్ట్రం మల్లపురం జిల్లా పరిధిలో జమీదా (34) అనే ముస్లిం మహిళ శుక్రవారం ప్రార్థనలు నిర్వహించారు. ఒక ముస్లిం మహిళ.. శుక్రవారం ప్రార్థనలు (జుముమా) నిర్వహించడం దేశంలో ఇదే తొలిసారి అంటున్నారు. ఖురాన్ సున్నత్ సొసైటీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న జమీదా ప్రతి శుక్రవారం తమ కార్యాలయంలో జరిగే ప్రార్థనల్లో పాల్గొంటారు. అయితే, ఈసారి ఆమె స్వయంగా ప్రార్థనలను నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో మహిళలతోపాటు 80 మంది పాల్గొన్నారు. ఖురాన్ ఎక్కడా మహిళలు, పురుషుల మధ్య వివక్ష చూపలేదని ఆమె చెప్పారు. మహిళలు 'ఇమామ్' కాకుండా ఇస్లాం అడ్డుకోలేదన్నారు. మసీదుల్లోనే ప్రార్థనలు నిర్వహించాలన్న నిబంధనేమీ లేదన్నారు. తిరువనంతపురం ప్రాంతానికి చెందిన జమీదా ఇక ముందు కూడా ప్రార్థనలకు సారథ్యం వహిస్తానన్నారు. సంప్రదాయాలకు వ్యతిరేకంగా మహిళ ప్రార్థనలు నిర్వహించడంపై సోషల్ మీడియాలో విస్తృత చర్చ జరుగుతున్నది.

ఆధార్‌కు ఆక్స్‌ఫర్డ్ పట్టం

నిరసనల దృష్ట్యా జైపూర్ సాహితీ ఉత్సవానికి వెళ్లని సెన్సార్ చైర్మన్

జైపూర్: 2017 సంవత్సరం హిందీ పదంగా ఆధార్‌ను ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు ఎంపిక చేసింది. జైపూర్‌లో జరుగుతున్న సాహితీ ఉత్సవాల్లో శనివారం ఈ విషయాన్ని వెల్లడించారు. గతేడాదికి హిందీ పదాన్ని ఎంపిక చేయటం కోసం ఆధార్‌తోపాటు మిత్రో, నోట్‌బందీ, గోరక్షక్ తదితర పదాలను కూడా పరిశీలించారని, చివరికి ఆధార్‌ను ఎంపిక చేశారని తెలిపారు. మరోవైపు, 'పద్మావత్'విడుదల అంశం వివాదాస్పదమై, నిరసనల నేపథ్యంలో జైపూర్ సాహితీ ఉత్సవాలకు సెన్సార్ బోర్డ్ చైర్మన్ ప్రసూన్ జోషి దూరమయ్యారు. కార్యక్రమ నిర్వాహకులకు, రచయితలకు ఎలాంటి అసౌకర్యం కలిగించొద్దనే ఉత్సవాలకు హాజరుకావొద్దని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు.

ప్రజల్లో మార్పుతోనే అవినీతి నిర్మూలన

కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ: కేవలం విధానపరమైన సంస్కరణల ద్వారానే అవినీతిని నిర్మూలించలేమని, ప్రజల ఆలోచనా ధోరణిలో కూడా మార్పురావాలని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. శనివారం ఢిల్లీలో 'ఆన్‌ది ట్రయల్ ఆఫ్ బ్లాక్' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ అవినీతి నిర్మూలనకు ప్రధాని నరేంద్రమోదీ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని చెప్పారు. 'ఆదాయాల్లో తేడాలు ఎక్కువైతే సామాజిక అశాంతి పెరుగుతుంది. అభివృద్ధి లక్ష్యాలను ఆశించిన మేరకు సాధించలేం.ఈ వాస్తవాన్ని మనం అంగీకరించాలి' అన్నారు.

బోయినపల్లి మార్కెట్ ధరలే ప్రామాణికం

- మన కూరగాయల ప్రాజెక్టు అమలుకు మార్గదర్శకాలు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బోయినపల్లి మార్కెట్ యార్డులోని మోడల్ ధరకు లేదా దానికి సమానంగా ఉన్న ఇతర మార్కెట్ హోల్‌సేల్ ధరలకు రైతుల నుంచి కూరగాయలు కొనుగోలు చేయాలని మార్కెటింగ్‌శాఖ ఆదేశించింది. మన కూరగాయలు ప్రాజెక్టుపై వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి శనివారం ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేశారు. ఈ ప్రాజెక్టును గతంలో ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలుచేశారు. ఆయాజిల్లాల్లో కూరగాయలు పండించే ప్రాంతాల్లో కలెక్షన్ కేంద్రాలు, హైదరాబాద్‌లో అనేకచోట్ల రిటైల్ ఔట్‌లెట్లను ఏర్పాటు చేశారు. ఈ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించి మార్గదర్శకాలను విడుదలచేసింది. ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం రైతులకు నేరుగా మార్కెటింగ్ వసతి కల్పించడం, వారికి కూరగాయలపై ఆదాయాన్ని మరింత పెంచడం, నాణ్యమైన కూరగాయలను అనువైన ధరలకు వినియోగదారులకు అందజేయడం. ఈ ప్రాజెక్టును ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో అమలుచేస్తారు. ఏజెన్సీలను టెండర్ల ద్వారా ఖరారు చేస్తారు. ఈ ప్రాజెక్టు మూడుదశల్లో ఉంటుంది. ఒకటి క్షేత్రస్థాయిలో కలెక్షన్ కేంద్రాలు, రెండు కూరగాయలు, పండ్లను గ్రేడింగ్ చేసేందుకు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, ఆ తర్వాత రిటైల్ ఔట్‌లెట్ల ద్వారా వినియోగదారులకు అందజేయడం.




హైదరాబాద్ ఇంజినీర్స్ డైరీ ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు శనివారం జలసౌధలో హైదరాబాద్ ఇంజినీర్స్ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు టీ వెంకటేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ మధుసూదన్‌రెడ్డి, అధ్యక్షుడు సీ మహేందర్, ప్రధాన కార్యదర్శి కే చక్రధర్, సలహాదారు వై శేఖర్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, చీఫ్ ఇంజినీర్ హరిరాం, ఎస్‌ఈలు వేణు, రాజశేఖర్, చంద్రశేఖర్, నరహరిబాబు, డీసీఈఎస్ మురళి పాల్గొన్నారు.

నేడు రాష్ట్రవ్యాప్తంగా పల్స్‌పోలియో

- 36,55,204 మంది పిల్లలకు చుక్కల మందు
- ఏర్పాట్లు పూర్తిచేసిన వైద్య, ఆరోగ్యశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఏర్పాట్లు పూర్తిచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 36,55,204 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఇందుకోసం ఆయా విభాగాలకు అవగాహన కల్పించారు. కాగా 55 లక్షల డోసులు వేసేందుకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఏర్పాట్లు చేపట్టింది. మార్చి 11న రెండోవిడత పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. మహిళా, శిశుసంక్షేమ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పాఠశాల విద్యాశాఖ, పంచాయతీరాజ్, ఐకేపీ, డిఫెన్స్, నేవీ, ఆర్టీసీ శాఖల సమన్వయంతో పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రయాణాల్లో ఉన్న వారి కోసం 737 ట్రాన్సిట్ కేంద్రాల ద్వారా అన్ని బస్టాండ్లలో, రైల్వే స్టేషన్లలో, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేస్తున్నారు. 787 మొబైల్ బృందాలు, 2,280 రూట్ సూపర్‌వైజర్లు, 8,711 మంది ఏఎన్‌ఎంలు, 27,045 మంది ఆశావర్కర్లు, 32,082 మంది అంగన్‌వాడి వర్కర్లు పోలియో చుక్కల పంపిణీలో పాల్గొననున్నారు.



ఆదివారం ఏ కారణం చేతనైనా పల్స్ పోలియో చుక్కలు వేయించుకోలేకపోతే ఆ చిన్నారులకు ఆ తర్వాత రెండురోజులపాటు పోలియో చుక్కలు ఇంటింటికి వెళ్లి వేసేందుకు వైద్యశాఖ ప్రణాళికలు రూపొందించింది. పోలియోరహిత సమాజానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైద్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. పోలియో చుక్కల కార్యక్రమానికి ప్రసార మాధ్యమాలు, పత్రికలు, మీడియా విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.



శనివారం విద్యుత్ సౌధలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

24 గంటల విద్యుత్‌ను కొనసాగిద్దాం

- ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: రైతులకు 24 గంటల విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్ ఉద్యోగులు నిరంతరం కృషిచేయాలని తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు సూచించారు. శనివారం విద్యుత్ సౌధలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, డైరెక్టర్ సచ్చిదానందం, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరేపల్లి మోహన్, సెక్రటరీ జనరల్ శ్రీనివాస్, రాజు, దానయ్య, దయానంద్, రాజనర్సు పాల్గొన్నారు.

జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీకి శుభాకాంక్షలు

ఓయూ టీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి శ్రీకాంత్, యూఎస్‌ఏ ఇండియా పొలిటికల్ యాక్షన్ కమిటీ సెక్రటరీ డాక్టర్ జగన్మోహన్‌రాజ్ శనివారం విద్యుత్‌సౌధలో జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సాగుకు 24గంటల ఉచిత విద్యుత్తు ఇవ్వడం గొప్ప విషయమన్నారు.



శనివారం హైదరాబాద్‌లో టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డిని సన్మానిస్తున్న డైరెక్టర్లు జే శ్రీనివాస్‌రెడ్డి, టీ శ్రీనివాస్, మీర్‌కమాలుద్దీన్ అలీఖాన్

అవార్డు రావడం చాలా సంతోషం

- టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి
- అభినందనలు తెలిపిన డైరెక్టర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సంస్థకు చాలా అవార్డులు లభించాయని.. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అవార్డు రావడం చాలా సంతోషంగా ఉన్నదని టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి చెప్పారు. సంస్థలో పనిచేసే ప్రతి అధికారి, సిబ్బంది కృషి ఫలితంగానే అవార్డు వచ్చిందని పేర్కొన్నారు. టీఎస్ ఐపాస్ పథకం అమలులో టీఎస్‌ఎస్పీడీసీఎల్ చురుకుగా పనిచేసినందుకు గుర్తింపుగా.. రాష్ట్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం సందర్భంగా సంస్థ సీఎండీ రఘుమారెడ్డికి అవార్డును ప్రదానం చేసింది. శనివారం టీఎస్‌ఎస్పీడీసీఎల్ కంపెనీ కార్యాలయంలో డైరెక్టర్లు జే శ్రీనివాస్‌రెడ్డి, టీ శ్రీనివాస్, మీర్‌కమాలుద్దీన్ అలీఖాన్ తదితరులు సీఎండీకి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రఘుమారెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటివరకు 1567 దరఖాస్తులను అందుకున్నామని, అందులో 50శాతం వరకు అనుమతులు మంజూరుచేశామని చెప్పారు.

సాగుభూమికే పెట్టుబడి పథకం

- వారంరోజుల్లో మరో 851 ఏఈవో పోస్టుల భర్తీ
- 17న ఖమ్మం జిల్లాలో 1000 ట్రాక్టర్ల పంపిణీ
- వానకాలం పంటలపై సమీక్షలో మంత్రి పోచారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సాగుకు యోగ్యమైన భూమికే పంటకు పెట్టుబడి అందిస్తామని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మార్చి 11న రాష్ట్రవ్యాప్తంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. అప్పటివరకు రైతుకున్న మొత్తం విస్తీర్ణంలో సాగుభూమి, సాగుకు యోగ్యం కాని భూముల వివరాలు పక్కాగా సేకరించాలని, ఈ అంశంపై జిల్లా వ్యవసాయ అధికారులు దృష్టిపెట్టాలని మంత్రి ఆదేశించారు. హైదరాబాద్‌లోని వ్యవసాయ కమిషనర్ కార్యాలయంలో '2018 ఖరీఫ్ సాగు సన్నద్ధం'పై వివిధ



వానకాలం పంటల సాగు సన్నద్ధంపై సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

జిల్లాల వ్యవసాయాధికారులతో శనివారం మంత్రి పోచారం సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం 1,780 వ్యవసాయ విస్తరణ అధికారులకుతోడుగా వారంలో మరో 851 విస్తరణ అధికారుల పోస్టులను భర్తీచేయనున్నట్టు చెప్పారు. త్వరలోనే పాత జిల్లాల ప్రకారం ఏఈవోలతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. రైతు సమన్వయ సమితులతో కూడా సమావేశాలు నిర్వహిస్తామని, వారికి తగిన దిశానిర్దేశం చేయడానికి స్వయంగా ముఖ్యమంత్రి పాల్గొంటారని చెప్పారు. ప్రతి ఏఈవో క్లస్టర్‌లో రూ.15 లక్షలతో రైతు సమావేశ వేదికలను నిర్మించనున్నట్టు చెప్పారు. ఫిబ్రవరిలో అన్నిజిల్లాల్లో ట్రాక్టర్ల మేళాలు నిర్వహించనున్నట్టు మంత్రి తెలిపారు. మొదటగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 17న వెయ్యి ట్రాక్టర్లు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ సేవలు అందించి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అధికారులుగా ఎంపికైన జిల్లా వ్యవసాయాధికారులను మంత్రి పోచారం పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. వ్యవసాయ కమిషనర్ డాక్టర్ ఎం జగన్‌మోహన్ అధ్యక్షతన సమావేశంలో వ్యవసాయ కార్యదర్శి సీ పార్థసారథి, జిల్లాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో జీవాల ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి

- ప్రతి పశువైద్యశాలలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి
- గ్రాసం కొరత రాకుండా చర్యలు చేపట్టాలి
- పశుసంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమల అభివృద్ధిపై సమీక్షలో అధికారులకు మంత్రి తలసాని ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వేసవిలో జీవాల ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని పశుసంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమ అభివృద్ధిశాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పెరిగిన గొర్రెల సంఖ్యకు అనుగుణంగా ప్రతి పశువైద్యశాలలో అవసరమైన మందులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రానున్న వేసవిలో జీవాలకు గ్రాసం కొరత ఏర్పడకుండా ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళికలను అమలుచేయాలని అధికారులకు సూచించారు. శనివారం సచివాలయంలో పశుసంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమల అభివృద్ధిశాఖలపై ఆయా శాఖల అధికారులతో మంత్రి తలసాని సమీక్ష నిర్వహించారు. వ్యవసాయం తర్వాత జీవాల పెంపకానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదని, అందులోభాగంగానే రూ.5 వేల కోట్లతో నేటివరకు 40 లక్షల గొర్రెలను పంపిణీ చేశామని మంత్రి చెప్పారు. పశు సంచార వైద్యశాలల కోసం ఏర్పాటుచేసిన 1962 కాల్‌సెంటర్‌కు పెద్దఎత్తున ఫోన్లు వస్తున్నాయని, కాల్‌సెంటర్‌పై ఒత్తిడి తగ్గించే విధంగా సిబ్బందిని పెంచాలని ఆదేశించారు. రైతులను సొంత భూమిలో గడ్డిసాగు చేసే విధంగా ప్రోత్సహించాలని, సబ్సిడీపై విత్తనాలను సరఫరా చేయాలని సూచించారు. పంపిణీ చేసిన గొర్రెలు అన్నింటికీ సంబంధించిన ఇన్సూరెన్స్ ప్రక్రియను త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గొర్రెలకు



శనివారం సచివాలయంలో పశుసంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమల అభివృద్ధిశాఖలపై అధికారులతో సమీక్షిస్తునన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

షెడ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులు 10 శాతం వాటా చెల్లిస్తే ప్రభుత్వం రూ. లక్ష వరకు ఆర్థికసాయం అందజేస్తుందని తెలిపారు. ఈ ఏడాది రిజర్వాయర్లు, చెరువులలో 50 కోట్ల చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేశామని, ప్రయోగాత్మకంగా 11 రిజర్వాయర్లలో 1.89 లక్షల రొయ్య పిల్లలను విడుదలచేశామని మంత్రి తలసాని చెప్పారు. ఇంటిగ్రేటెడ్, హోల్‌సెల్, రిటేల్ మార్కెట్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మంత్రి శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. రాష్ట్రంలో 1000 విజయ డెయిరీ ఔట్‌లెట్‌లను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. సమావేశంలో పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య చైర్మన్ కన్నెబోయిన రాజయ్యయాదవ్, టీఎస్‌ఎల్‌డీఏ చైర్మన్ రాజేశ్వర్‌రావు, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ నిర్మల, గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, టీఎస్‌డీఏ సీఈవో మంజువాణి తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ' ట్రయల్ రన్ విజయవంతం

- పాలేరు నుంచి ఎదెళ్లగుట్ట ప్లాంట్‌కు చేరిన కృష్ణాజలాలు
- మార్చిలో మహబూబాబాద్ జిల్లాలో 624 ఆవాసాలకు మంచినీరు

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఖమ్మం జిల్లా పాలేరు ఇన్‌టేక్‌వెల్ నుంచి నిర్వహించిన ఇంటర్నల్ ట్రయల్‌రన్ విజయవంతమైంది. ఈనెల 25న పాలేరు ఇంటేక్‌వెల్ నుంచి ట్రయల్ రన్‌ను ప్రారంభించగా, శనివారం తెల్లవారుజామున మరిపెడ మండలం అబ్బాయిపాలెం ఎదెళ్లగుట్ట వద్ద నిర్మించిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు కృష్ణాజలాలు చేరాయి. శుద్ధి చేసిన నీటిని సంప్ ద్వారా పంప్‌హౌస్‌కు పంపించే ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా వేగంగా పూర్తి చేసి వచ్చే మార్చి నుంచి మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలోని ఆరు మండలాలు, పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు, రాయపర్తి మండలాలకు చెందిన 624 ఆవాసాలకు మొదటి విడుతలో శుద్ధి చేసిన కృష్ణా జలాలను సరఫరా చేయనున్నారు. ఎదెళ్లగుట్ట ప్లాంట్ నుంచి మహబూబాబాద్ జిల్లాలోని 14 మండలాలు, వరంగల్ రూరల్ జిల్లా



సీఎల్‌ఎఫ్ ట్యాంక్‌కు చేరిన నీరు

లోని 8, ఖమ్మం జిల్లాలోని ఒక మండలానికి చెందిన 10,85,942 మందికి రోజుకు వంద లీటర్ల చొప్పున శుద్ధి చేసిన నీటిని అందించాలని నిర్ణయించారు. ఇందుకోసం 2027.04 కిలోమీటర్ల పైప్‌లైన్లు వేస్తున్నారు. ఈ పనులన్నీ శరవేగంగా జరుగుతున్నాయి.

మిషన్‌కు ప్రశంస

మొదటిపేజీ తరువాయి...

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధ్యయనం చేసేందుకు హైదరాబాద్ వచ్చిన 19 దేశాల ప్రతినిధుల బృందం శనివారం జలసౌధలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషితో సమావేశమైంది. ఇథియోపియా, ఆఫ్ఘనిస్థాన్, భూటాన్, మాల్దీవులు, శ్రీలంక, దక్షిణాఫ్రికా తదితర దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ బృందంలో ఉన్నారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (అస్కి) ఈ పర్యటనను సమన్వయం చేస్తున్నది. ఈ సందర్భంగా సాగునీటిరంగంలో సాధించిన ప్రగతిని పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించిన ఎస్కే జోషి.. గడిచిన మూడున్నరేండ్లుగా రాష్ట్ర సాగునీటిరంగంలో విప్లవాత్మక మార్పులొస్తున్నాయని చెప్పారు. ఆయన కాళేశ్వరం ప్రాజెక్టు గురించి వివరిస్తున్నప్పుడు విదేశీ ప్రతినిధులు అనేక ప్రశ్నలు అడిగి, సందేహాలు నివృత్తి చేసుకోవడం విశేషం. రూ.80వేల కోట్ల భారీమొత్తంతో చేపట్టిన ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వ సహాయం తీసుకొంటున్నారా? అని అడిగిన ఓ విదేశీ ప్రతినిధి.. రాష్ట్ర ప్రభుత్వమే నిధులను సమీకరించిందనే వాస్తవాన్ని తెలుసుకొని ఆశ్చర్యపోయారు. ఇంత పెద్దమొత్తాన్ని వెచ్చిస్తున్నారంటే ప్రజల నుంచి రిటర్న్స్ ఆశిస్తున్నారా? అని మరో విదేశీ ప్రతినిధి ప్రశ్నించారు. దీంతో తెలంగాణ నేపథ్యాన్ని వివరించిన జోషి.. రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కోటి ఎకరాల సంకల్పం గురించి వారికి తెలిపారు. శ్రీలంక ప్రతినిధులు మిషన్ కాకతీయపై పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో పూర్వం 80 వేల చిన్న నీటి వనరులుండేవని, రాష్ట్రం ఏర్పడేనాటికే అందులో సగం వరకు కనుమరుగయ్యాయని, మిగిలినవాటిని పునరుద్ధరించేందుకు సీఎం కేసీఆర్ మిషన్ కాకతీయ కార్యక్రమం చేపట్టారని వివరించారు. ఈ పథకం విజయవంతానికి నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు ప్రతివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారని, నిరంతరం పర్యవేక్షణ కారణంగా సానుకూల ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమం కింద 46 వేల చెరువులను ఎంపిక చేసి.. దశలవారీగాబాగుచేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే పూర్తయిన పనుల ద్వారా అద్భుత ఫలితాలు వస్తున్నట్టు శాస్త్రీయంగా రుజువైందని జోషి వివరించారు. తెలంగాణ గ్రామీణ, ఆర్థిక, సామాజిక స్థితిగతుల్లో అనూహ్యమైన మార్పులొస్తున్నాయని పేర్కొన్నారు. చెరువు మీద ఆధారపడి వ్యవసాయం చేసే రైతులతోపాటు ఆ చెరువును నమ్ముకొన్న రజక, బెస్త, ముదిరాజులకు జీవనోపాధి దొరుకుతున్నదని వివరించారు. రాష్ట్రంలో జల వనరులు, నీటి లభ్యత పెంచడమే మిషన్ కాకతీయ ప్రధాన ఉద్దేశమని చెప్పారు.

40 లక్షల ఎకరాలకు కాళేశ్వరం

రాష్ట్ర ప్రజల, రైతుల జీవితాన్ని సర్వతోముఖంగా అభివృద్ధి చేయనున్న కాళేశ్వరం ప్రాజెక్టు గురించి జోషి విదేశీ ప్రతినిధులకు వివరించారు. రూ.80 వేల కోట్లకుపైగా అంచనా వ్యయంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని తెలిపారు. సుమారు 40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపడుతున్న ఈ పథకం ద్వారా తాగునీటి అవసరాలకు 36 టీఎంసీలు, పారిశ్రామిక అవసరాలకు మరో పది టీఎంసీలు కేటాయించినట్టు చెప్పారు. ప్రాజెక్టులో వినియోగిస్తున్న అత్యాధునిక సాంకేతిక విధానాలను జోషి వివరించారు. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టుతో సన్న, చిన్నకారు రైతులకు చాలా మేలు జరుగుతుందని, కేవలం సాగునీరే కాకుండా వేలాది గ్రామాలకు తాగునీరు, పారిశ్రామిక అవసరాలను కూడా ఈ ప్రాజెక్టు ద్వారా తీర్చడమనేది గొప్ప విషయమని ప్రతినిధులు వ్యాఖ్యానించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు తీరును కూడా జోషి వివరించారు. కార్యక్రమంలో కాడా కమిషనర్ డాక్టర్ మల్సూర్, మైనర్ ఇరిగేషన్ సీఈలు సురేశ్, శ్యాంసుందర్, అస్కి ప్రోగ్రాం డైరక్టర్లు డాక్టర్ పీ సుభాషిణి, రాజ్‌కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



శనివారం సచివాలయంలో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డితో భేటీ అయిన వీఐటీ సీఈవో అర్జున్ నూరపనేని, శశిధర్‌రెడ్డి తదితరులు

ఆస్ట్రేలియాలో మైనారిటీలకు ఉచిత విద్య

- వీఐటీ సంస్థతో హోంమంత్రి నాయిని చర్చలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆస్ట్రేలియాలో చదివేందుకు వెళ్లే తెలంగాణ మైనారిటీ విద్యార్థులకు ఉచితంగా విద్యనందించేందుకు మెల్‌బోర్న్‌లోని విక్టోరియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) ముందుకొచ్చింది. ఈ మేరకు వీఐటీ సీఈవో అర్జున్ సూరపనేని, నిశిధర్‌రెడ్డి శనివారం సచివాలయంలో రాష్ట్ర హోం, కార్మికశాఖల మంత్రి నాయిని నర్సింహారెడ్డితో చర్చించారు. మంత్రి ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లినప్పుడు వీఐటీని సందర్శించి తెలంగాణ మైనారిటీ విద్యార్థులకు ఉచిత విద్య అందించాలని కోరారు. ఇందుకు స్పందించిన వీఐటీ సీఈవో డిగ్రీ, పీజీ స్థాయిలో మైనారిటీ విద్యార్థులకు ఉచితంగా విద్యనందించాలని నిర్ణయించామని తెలిపారు. ఇందుకోసం ఒక్కొక్క విద్యార్థిపైన రూ.25 లక్షల వరకు ఖర్చు చేస్తామని తెలిపారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు వీ శ్రీనివాస్‌రెడ్డి, అంజుమన్ సంస్థ అధ్యక్షుడు అక్తర్ అలీ, కార్యదర్శి అబ్దుల్ వాహెబ్, ఇమాముద్దీన్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ యువకులకు సర్టిఫికెట్ కోర్సు

- బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు చైర్మన్ కేవీ రమణాచారి వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్రాహ్మణ యువకులకు సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు (టీఆర్‌బీఎస్‌పీ) భావిస్తున్నది. ఫిబ్రవరి రెండోవారంలో శిక్షణా తరగతులను ప్రారంభించి మూడునెలల్లో సిలబస్ పూర్తిచేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం వేదపండితులు, ఆగమశాస్త్ర నిపుణులు, పరమహంస పరివ్రాజకులతో రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు చైర్మన్ కేవీ రమణాచారి చర్చించారు. కోర్సు పూర్తి చేసిన వారికి బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ద్వారా సర్టిఫికెట్‌ను అందించనున్నారు. అర్చన, ఆరాధనాక్రమం, గ్రహణాలను గణించడం, పంచాంగం విశేషాలను తెలుసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు.

శాశ్వత పదోన్నతులు కల్పించండి

- ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అసోసియేషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో సీనియారిటీ జాబితాను ఖరారు చేసి, శాశ్వత పదోన్నతులు కల్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్ కోరారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా సీనియారిటీ జాబితా ఖరారు కాకపోవడంతో 2008 నుంచి తాత్కాలిక పదోన్నతులే కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల తీరుకు నిరసనగా శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఎర్రమంజిల్‌లోని ప్రధాన కార్యాలయం ఎదుట మౌన దీక్షకు దిగారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏటీఎంఏ ముజీబ్, ప్రధాన కార్యదర్శి మర్రి రమేశ్, కోశాధికారి డాక్టర్ ఎం రజిత, అడ్వైజర్ అబు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెస్కో విద్యార్థులకు అందని హాల్‌టిక్కెట్లు

- ఉన్నత విద్యామండలికి ఫిర్యాదు చేసిన బాధితులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మెస్కో మైనార్టీ ఫార్మసీ కళాశాలకు చెందిన 15 మంది విద్యార్థులకు ఓయూ సెకండ్ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన హాల్ టిక్కెట్లు అందలేదు. దీంతో విద్యార్థులు తమకు న్యాయం చేయాలని శనివారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులకు విజ్ఞప్తి చేశారు.

జేఎన్‌టీయూలో 12 కోట్లతో ఇండోర్ స్టేడియం

కేపీహెచ్‌బీ కాలనీ: జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో విద్యార్థుల సౌలభ్యం కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నామని వీసీ ఎ వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. శనివారం జేఎన్‌టీయూహెచ్‌లో రూ.12.17 కోట్లతో నిర్మించనున్న ఇండోర్ స్టేడియం పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో రెక్టార్ ఎ గోవర్ధన్, రిజిస్ట్రార్ ఎన్ యాదయ్య, ప్రిన్సిపాల్ ఈ సాయిబాబారెడ్డి, బిక్స్ డైరెక్టర్ లక్ష్మణ్‌రావు, ఈఈ చంద్రశేఖర్, డీఈ మధురవాణి, బిక్స్ కో-ఆర్డినేటర్ జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.



పీపీవీఎఫ్‌ఆర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్థసారథి, ప్రవీణ్‌రావు తదితరులు

రైతులకు మేధో హక్కులు కల్పించాలి

- పంట వివరాల నమోదుకు కృషిచేయాలి: పార్థసారథి వినతి

హైదరాబాద్/రాజేంద్రనగర్, నమస్తే తెలంగాణ: రైతులకు పంటలపై మేధోసంపత్తి హక్కులు కల్పించడానికి ఇంకా పెద్దఎత్తున కృషి జరుగాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి అధికారులను, కేంద్ర వ్యవసాయశాఖను కోరారు. 'రైతుల హక్కులు- వ్యవసాయ జీవవైవిధ్యం' అంశంపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పంటరకాల సంరక్షణ, రైతుహక్కుల సాధికారత సంస్థ (పీపీవీఎఫ్‌ఆర్), భారత వ్యవసాయ పరిశోధనామండలి ఆధ్వర్యంలోని 10,11 జోన్ల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రాంతీయ సదస్సును ఆయన శనివారం ప్రారంభించారు. పంటలపై మేధోహక్కులసాధన, పీపీవీఎఫ్‌ఆర్‌లో నమోదు తదితర అంశాలపై రైతులకు అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పార్థసారథి అన్నారు. కేంద్ర వ్యవసాయ సంయుక్త కార్యదర్శి సీడ్స్, ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ అండ్ ఫార్మర్స్ రైట్స్ అథారిటీ చైర్మన్ బీ రాజేందర్ మాట్లాడుతూ, పంటరకాల నమోదులో దక్షిణాది రాష్ట్రాలు, ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు వెనుకబడి ఉన్నాయని తెలిపారు. పీపీవీఎఫ్‌ఆర్ ప్రాంతీయ కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ నాలెడ్జ్ పోర్టల్‌ను ఏర్పాటుచేసి రాష్ట్రంలో పండిస్తున్న వంగడాల వివరాలను అందులో పొందుపర్చాలని సూచించారు. సదస్సులో పీపీవీఎఫ్‌ఆర్ రిజిస్ట్రార్ జనరల్ అగర్వాల్, టెన్త్ జోన్ డైరెక్టర్ వైజీ ప్రసాద్, పరిశోధన సంచాలకుడు ప్రదీప్, ఐదు రాష్ట్రాల నుంచి 500 మంది రైతులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
ఆదివారం 28 జనవరి 2018

WWW.NTNEWS.COM



'నటుడిగా ఒకే మూసకు పరిమితమై పోవడం ఇష్టం వుండదు. ప్రయోగాల ప్రయాణాన్నే నేను ఇష్టపడతాను. కథాంశాల్లో నవ్యతకే పెద్దపీట వేస్తాను' అంటున్నారు యువహీరో నాగశౌర్య. 'ఊహలు గుసగుసలాడే' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు నాగశౌర్య. వైవిధ్యమైన కథల్ని ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేకతను సృష్టించుకున్నారు. నటుడిగా తనని తాను కొత్త పంథాలో ఆవిష్కరించుకుంటూ కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటున్నారు. నాగశౌర్య కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'ఛలో'. వెంకీ కుడుముల దర్శకుడు. ఐరా క్రియేషన్స్ పతాకంపై ఉషా ముల్పూరి నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో నాగశౌర్య 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా సంభాషించారు. ఆయన చెప్పిన సంగతులివి..

- **భవిష్యత్తులో ఎలాంటి కథాంశాల్ని ఎంచుకోవాలనుకుంటున్నారు?**
- ఏడాదికి మూడు సినిమాలు చేయాలనుకుంటున్నాను. ఫ్యామిలీ స్టోరీస్‌తో పాటు కమర్షియల్ సినిమాలు చేయాలని అనుకుంటున్నాను.

- **నిర్మాతలుగా మీ అమ్మానాన్నకు మీరెన్ని మార్కులు వేస్తారు?**
- పదికి తొమ్మిది ఇస్తాను (నవ్వుతూ). ఎందుకంటే తొమ్మిది నా లక్కీ నెంబర్.

- **నిర్మాణపరంగా ఈ సినిమా మీకు ఎలాంటి అనుభవాన్నిచ్చింది?**
- సాధారణంగా ప్రతి నిర్మాత హీరో మార్కెట్‌ను బట్టి సినిమాకు వ్యయం చేస్తుంటారు. కానీ నేను మాత్రం కథ డిమాండ్ మేరకు ఖర్చు పెట్టాలనే సిద్ధాంతాన్ని నమ్ముతాను. కంటెంట్ లేకపోతే సినిమా ఎవరూ చూడరు. కథే సినిమాకు హీరో. ఈ విషయంలో నా అంచనాలు అప్పుడప్పుడూ తప్పొచ్చేమో కానీ.. నేను మాత్రం కథకే ప్రాముఖ్యతనిస్తాను.

- **నటుడిగా మీ ప్రయాణంలో ఎలాంటి పరిణితి సాధించారనుకుంటున్నారు?**
- సినిమా సినిమాకు మధ్య పెద్ద మార్పులేమి రాలేదు. కానీ 'ఛలో' సినిమాకు చాలా మార్పు చూశాను. 'ఛలో' ముందు ఏడాదిన్నర సినిమాలు చేయలేదు. దాంతో మా నాన్నగారు కంగారు పడ్డారు. స్టోరీలు నచ్చడం లేదు కాబట్టి గ్యాప్ తీసుకొని చేస్తానని నాన్నకు చెప్పాను. ఎప్పుడు కథలు వినడం వల్ల యావరేజ్‌గా ఉన్న స్టోరీ కూడా సూపర్‌గా అనిపించేది. అందుకే కొంతగ్యాప్ తీసుకున్నాను. దాంతో ఇండస్ట్రీలోని చాలామంది 'శౌర్య కనిపించడం లేదు, సినిమాలు రావడం లేదు' అని మాట్లాడుకున్నారు. అయితే వాటి గురించి నేను బాధపడలేదు. మనదగ్గర విషయముంటే ఎవరికో ఒకరికి అవసరం ఉంటుంది. నా సినిమాలు ఫెయిల్ అయ్యాయి కానీ.. నటుడిగా నేనెప్పుడు ఫెయిల్ కాలేదు. ప్రస్తుతం వరుసగా సినిమాలు ఉన్నాయి.

తిట్టినా పర్లేదు... నిక్కచ్చిగా ఉంటా!

- **గడ్డం పెంచి రఫ్‌గా కనిపిస్తున్నారు. 'ఛలో' కోసమేనా?**
- నా తదుపరి సినిమాలో ఈ గెటప్‌లో కనిపించబోతున్నాను. కథానుగుణంగా ఈ లుక్‌తో కనిపించాల్సివుంది. అందుకే గడ్డం తీసేయకుండానే 'ఛలో' ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను.

- **'ఛలో' సినిమాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఫలితంపై మీ అంచనాలు ఎలా వున్నాయి? ఏమైనా ఒత్తిడికి గురవుతున్నారా?**
- నా కెరీర్‌లో ఇంత కాన్ఫిడెంట్‌తో ఎప్పుడూ కనిపించలేదు. నేను చేసిన సినిమాలన్నింటిలో 'ఛలో' విజయంపైనే ఎక్కువ ధీమాతో ఉన్నాను. డెఫినెట్‌గా హిట్ కొట్టబోతున్నామనే విశ్వాసం ఉంది. కథలోని ప్రతి అంశం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. అందుకే సక్సెస్‌పై నమ్మకం పెరిగింది.

- **'ఛలో' అంటున్నారు. ఇంతకి కథాంశమేమిటి?**
- వాణిజ్య పంథాలో విభిన్నంగా చేసిన చిత్రమది. రెండు గ్రామాల మధ్య గొడవలు జరుగడం చూస్తుంటాం. కానీ ఒకే గ్రామంలో ఉన్న తెలుగు, తమిళ ప్రజల మధ్య విభేదాల నేపథ్యంలో కథ నడుస్తుంది. వారి గ్రామాన్ని రెండుగా విభజిస్తూ మధ్య నుంచి ఓ రోడ్డు వెళుతుంది. కుడివైపు తెలుగువారు, ఎడమవైపు తమిళంవారు ఉంటారు. ఇద్దరి మధ్య ఓ ఫెన్సింగ్ (కంచె) ఏర్పాటు చేసుకుంటారు. ఈ నేపథ్యంలో ఓ యువకుడు ఆ గ్రామానికి ఎందుకు వెళ్లాడు? అక్కడి ప్రజల మధ్య ఉన్న మనస్పర్థలేమిటి? అన్నదే సినిమా కథ.

- **కథ వింటుంటే చాలా సీరియస్ సబ్జెక్ట్‌లా అనిపిస్తున్నది?**
- కథను మనం ఎలా ట్రీట్ చేస్తామనే దానిపైనే భావోద్వేగాలు ఆధారపడి ఉంటాయి. 'మర్యాద రామన్న' చాలా సీరియస్ కథాంశం. కానీ చక్కటి హాస్యం మేళవింపుతో సాగుతుంది. 'ఛలో' కూడా అదే తరహాలో భిన్న ఉద్వేగాల సమాహారంగా నడుస్తుంది. ఇందులో వందమందిని కొట్టడం, భారీ యాక్షన్ సీన్స్ ఉండవు. కథాగమనం అంతా సహజత్వంతో కూడుకొని ఉంటుంది. నేను, దర్శకుడు కలిసి ఈ కథ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. 'క్లైమాక్స్‌లో నేను ఫైట్ చేయను. కానీ క్లైమాక్స్ సీన్స్ అందరిని మెప్పించేలా ఉండాలి' అని ముందే దర్శకుడికి చెప్పాను. దాంతో ఎలాంటి పోరాటఘట్టాలు, భారీ డైలాగ్‌లు లేకుండా పతాకఘట్టాల్ని సరికొత్త రీతిలో ఆవిష్కరించారు.

- **దర్శకుడు వెంకీ.. త్రివిక్రమ్ దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేశారు కదా..ఈ సినిమాలో త్రివిక్రమ్ ముద్ర ఏమైనా కనిపిస్తుందా? ముఖ్యంగా పంచ్ డైలాగ్స్ పరంగా..?**
- వెంకీ మీద త్రివిక్రమ్ కంటే పూరి జగన్నాథ్ ప్రభావం ఎక్కువగా ఉంది. కొన్ని సన్నివేశాలలో పూరి మార్క్ కనిపిస్తుంది.

- **సొంత బ్యానర్‌మీద కొత్త దర్శకుడితో ఈ సినిమా చేశారు. రిస్క్ అనిపించలేదా?**
- ఎప్పుడూ రిస్క్‌గా భావించలేదు. కథపై పూర్తి నమ్మకంతో ఈ సినిమా చేయడానికి ముందుకొచ్చాను. 'ఊహలు గుసగుసలాడే' టైమ్‌లో నేను కొత్తవాణ్ణి అయినప్పటికి ఆ చిత్ర నిర్మాత సాయి కొర్రపాటి, దర్శకుడు అవసరాల శ్రీనివాస్ నన్ను ఎంతగానో నమ్మారు. అదే విధంగా 'ఛలో' విషయంలో నేను దర్శకుడు వెంకీ కుడుములపై పూర్తి నమ్మకం పెట్టుకున్నాను.



- **ఈ సినిమాలో మీ పాత్ర చిత్రణ ఎలా ఉంటుంది. గతంలో మీరు ప్రేమకథా చిత్రాలు చాలా చేశారు కదా? ఇందులో క్యారెక్టర్ పరంగా నవ్యమైన అంశమేమిటి?**
- దర్శకుడు వెంకీతో నాకు ఎప్పటి నుంచో పరిచయం ఉంది. మేమిద్దరం ఒకరినొకరం 'చిట్టి' అని పిలుచుకుంటాం. వెంకీ నాకు ఈ సినిమా కథ చెబుతూ 'నీ ఒరిజినల్ క్యారెక్టర్ చాలా బాగుంటుంది. అందరూ నిన్ను క్యూట్ బాయ్‌లా చూపిస్తున్నారు. నాకు అది నచ్చడంలేదు. బయట నువ్వెలా ఉంటావో అదే రకంగా నిన్ను సినిమాలో చూపిస్తా' అన్నాడు. నాకు ఆయన మాటలు నచ్చాయి. కన్నీళ్లు పెట్టుకునే సెంటిమెంట్ సన్నివేశాలు నాకు రొటీన్ అయిపోయాయి. అందుకే ఈ సినిమాలో పాత్రపరంగా కొత్తగా ప్రయత్నించాను.

- **ఈ సినిమా ఆడియో వేడుకలో చిరంజీవిగారి గురించి మీరు బాగా మాట్లాడారు. ఆయనతో మీకు ఎలాంటి అనుబంధం ఉంది?**
- ప్రతి ఒక్కరూ ఇష్టపడే వ్యక్తి చిరంజీవిగారు. అప్పటి తరంలో ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణగారు అందరికి అభిమానపాత్రులయ్యారు. నా జనరేషన్‌లో చిరంజీవి తప్ప నంబర్‌వన్ మరొకరు లేరు. చిరంజీవిగారంటే నాకు చాలా ఇష్టం. ఆయన సినిమాలు, డ్యాన్సులకు పెద్ద ఫ్యాన్‌ని. 'ఛలో' ఆడియో వేడుకకు ఆయన్ని ఆహ్వానించడానికి ఇంటికి వెళ్లినప్పుడు మమ్మల్ని ఎంతో గొప్పగా రిసీవ్ చేసుకున్నారు. అంతటి మెగాస్టార్ అయివుండి కూడా కించిత్ గర్వం లేకుండా నిరాడంబరంగా కనిపించారు. 'సొంత బ్యానర్ పెట్టాను సార్.. మీరు తప్పకుండా ఆడియో వేడుకకు రావాలి' అని కోరగానే తప్పకుండా వస్తానని మాటిచ్చారు. ఇంతకంటే నాకు ఇంకేంకావాలి? చిరంజీవిగారిని నేను జీవితంలో మరచిపోను. ఆయన్ని జీవితాంతం ప్రేమిస్తూనే ఉంటాను.

- **సొంత బ్యానర్‌ను కంటిన్యూ చేస్తారా?**
- ఈ బ్యానర్‌లో వరుసగా సినిమాలు చేస్తాం. బయటి హీరోలతో కూడా సినిమాలు చేయాలని అమ్మానాన్న అనుకుంటున్నారు.

- **అమ్మనాన్న నిర్మాతలు కావడం వల్ల మీ మీద ప్రేమతో సినిమాకు ఖర్చు ఎక్కువ చేశారా?**
- ఈ సినిమా తొలి షెడ్యూల్‌ను 11 రోజుల్లో తీయాలనుకున్నాం. కానీ నాలుగు రోజుల్లోనే పూర్తిచేశాం. అవుట్‌పుట్ చూశాక అమ్మకు నచ్చలేదు. దాంతో మళ్లీ షూటింగ్‌కు వెళ్లాం. తొలి ప్రయత్నంగా సినిమా తీస్తున్నాం కాబట్టి ప్రొడక్షన్ గురించి వారికి అంత పెద్దగా తెలియదు. అమ్మనాన్న ఓ సాధారణ ప్రేక్షకుల మాదిరిగానే నా సినిమాల్ని విశ్లేషిస్తారు. ఏది అవసరమో దాని గురించి చెబుతారు.

- **మీరు ప్రయోగాత్మకంగా చేసిన కొన్ని సినిమాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. వాటి గురించి మీరేమంటారు?**
- 'ఒక్క మనసు' కొంత నిరాశపరచింది. 'జ్యో అచ్యుతానంద' నా దృష్టిలో గొప్ప సినిమా. అది కొంతవరకే మా అంచనాల్ని అందుకుంది. ఆ సినిమా విషయంలో కూడా బాధపడ్డాను. కెరీర్ ఆరంభంలో ఎవరికైనా నా అభిప్రాయాల్ని చెప్పాలంటే భయమేసేది. సినిమా గురించి ఏమైనా మార్పులు చెబితే హర్ట్ అవుతారేమో అని భయపడేవాణ్ణి. 'డైరెక్షన్‌లోకి హీరో వెళ్లిపోయాడేంట్రా' అనే కామెంట్స్ వినిపిస్తాయని అనుకునేవాణ్ణి. ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిలా షూటింగ్‌లకు వెళ్లాను. అయితే కాలక్రమంలో 'శౌర్య సబ్జెక్ట్ సరిగ్గా చూసుకోడు' అని నా మీద కామెంట్స్ మొదలయ్యాయి. దానివల్ల నా మార్కెట్‌కు సమస్యలు ఎదురయ్యాయి. దాంతో ఎవరేం తిట్టుకున్నా ఫర్లేదని నా అభిప్రాయాల్ని నిక్కచ్చిగా చెప్పడం అలవాటు చేసుకున్నాను. సినిమాల విషయంలో చాలా జాగ్రత్తగా వుండాలని నిర్ణయించుకున్నాను.

- **ఏడాదిన్నర గ్యాప్ తీసుకున్నారు కదా. అప్పడు మీ మానసిక స్థితి ఎలా వుండేది?**
- ఆరునెలల పాటు అసలేమి ఆలోచించలేదు. చాలా ప్రశాంతంగా ఉన్నాను (నవ్వుతూ). నా తప్పులేమిటో విశ్లేషించుకున్నాను. లవర్‌బోయ్ క్యారెక్టర్స్ నా ఒరిజినల్ కాదు. అమ్మాయిలతో నేను చనువుగా ఉండను. ప్రేమకథా చిత్రాలు చేయడం వల్ల నాలోని ఒరిజినాలిటీ మిస్ అవుతుందనిపించేది. నేను లవ్‌స్టోరీస్‌తో పాటు కమర్షియల్ సినిమాలకు కూడా సూటవుతాను. ఇలాంటి ముఖ్యమైన విషయాలపై చాలా విశ్లేషణ చేశాను.

- **ఈ ఏడాది మీరు ప్రేమ వివాహం చేసుకోబోతున్నారని తెలిసింది?**
- పెళ్లి విషయంలో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం. నాకైతే నాలుగేళ్ల తర్వాత పెళ్లి చేసుకోవాలని ఉంది. ఈలోగా ఏమైనా అవుతుందో చూద్దాం.

- సినిమా డెస్క్


కిడ్నీల్లో రాళ్లు



ఇప్పుడు చిన్నవాళ్ల నుంచి పెద్ద వాళ్ల వరకు అందరినీ వేధిస్తున్న సమస్య కిడ్నీలో రాళ్లు. నీరు తక్కువగా తాగడం, కాల్షియం అధికంగా లభించే పాల ఉత్పత్తులు ఎక్కువగా తీసుకోవడం కూడా కిడ్నీల్లో రాళ్లు ఏర్పడటానికి కారణం అవుతుంది. రోజులో ఎక్కువసేపు పని చేయాల్సి రావడం, ఒబేసిటీ, డయాబెటిస్‌ల కారణంగానూ కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే అవకాశాలెక్కువ.

- కిడ్నీలలో రాళ్లు ఏర్పడిన తొలినాళ్లలో పొత్తి కడుపులో లేదా వెన్నులో నొప్పిగా ఉంటుంది. ఈ నొప్పి తగ్గుతూ పెరుగుతుంది. ఈ నొప్పి వృషణాల వరకు వ్యాపిస్తుంది.
- మూత్రం రంగు మారడంతోపాటు దుర్వాసన వస్తుంది. ఒక్కోసారి మూత్రంలో రక్తం కూడా వచ్చే అవకాశం ఉంది.
- మూత్ర విసర్జన చేసేటప్పుడు నొప్పిగా ఉండటంతోపాటు, మంట వస్తుంది. తరుచుగా మూత్ర విసర్జనకు వెళ్లాల్సి వస్తుంది.
- తరుచుగా మూత్రానికి వెళ్లాల్సి వస్తుంది. మూత్రాశయంలో రాళ్లు ఉండటం వల్ల మూత్ర విసర్జన సాఫీగా సాగదు. ఒక్కసారి వెళ్లినా మళ్లీ వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తుతుంది.
- కిడ్నీ ఇన్‌ఫెక్షన్‌కు గురైతే చలితో కూడిన జ్వరం వస్తుంది. కొన్నిసార్లు వికారంగా, వాంతి వచ్చినట్లు అనిపిస్తుంది.
- కిడ్నీలో రాళ్లు ఏర్పడటం వంశ పారంపర్యంగా వచ్చే అవకాశాలు ఎక్కువ. మూత్రాశయ ఇన్‌ఫెక్షన్ల వల్ల కూడా కిడ్నీ స్టోన్లు ఏర్పడే అవకాశం ఉంది

వంటింటి చిట్కాలు



- కరివేపాకు ఎండబెట్టి పొడిచేసి, కూరల్లో వేసుకోవచ్చు.
- టీ ఫ్లాస్క్‌ను మజ్జిగతో కడిగితే దుర్వాసన పోతుంది.
- బెండకాయ ముక్కలపై కాస్త నిమ్మరసం చల్లితే కూరలో జిగురు ఉండదు.
- సాంబార్లో ఉప్పు ఎక్కువైతే ఉడికించిన ఆలుగడ్డలు వేస్తే సరి.
- ఆమ్లెట్‌కు అదనపు రుచి రావాలంటే సొనకు కొబ్బరి కోరు జోడించాలి.
- అరటి ముక్కలు నల్లబడకుండా ఉండాలంటే.. తరిగిన తర్వాత మజ్జిగలో వేస్తే సరిపోతుంది.

నమస్తే తెలంగాణ
సింగిడి
[హైదరాబాద్]
ఆదివారం 28 జనవరి 2018

లేడీ ఓరియెంటెడ్



మామూలుగా ఒక సినిమా విడుదలయిందంటే.. హీరోని చూసి థియేటర్‌కి వెళ్తారు. కొన్నిసార్లు లేడీ ఓరియెంటెడ్‌గా వచ్చిన సినిమాలు స్టార్‌హీరోల సినిమాల కంటే పెద్ద హిట్ అవుతుంటాయి. ఈ వారం విడుదలైన పద్మావత్, భాగమతి సినిమాలు కూడా సూపర్ హిట్ అయ్యాయి. మహిళా ప్రేక్షకులను థియేటర్ల వరకు రప్పించే కథలతో స్త్రీ పాత్ర ప్రాధాన్యత ఉన్న సినిమాలు ఈ మధ్య ఎక్కువగా వస్తున్నాయి. ఆ కోణంలోనే దీపికా పడుకోన్ నటించిన పద్మావత్, అనుష్క నటించిన భాగమతి సినిమాలు ప్రేక్షకాదరణ పొందాయి. వీటితో పాటే.. అమేజాన్ ప్రైమ్‌లో విడుదలైన అరువి అనే తమిళ సినిమాను కూడా మనవాళ్లు తెగ చూస్తున్నారు. ఈ వారం వార్తల్లో ప్రధానంగా నిలిచిన ఈ మూడు సినిమాలను మీరూ చూసేయండి.

మీకు నచ్చిన పాటలు కూడా పంపొచ్చు. ప్రచురిస్తాం.

ఈమెయిల్ :
zindagi.nt@gmail.com
మా అడ్రస్ : నమస్తే తెలంగాణ ప్రధాన కార్యాలయం,
8-2-603/1/7,8,9
కృష్ణాపురం, రోడ్‌నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500034

నాకిష్టమైన పాటలు..

హలో ఎక్కడున్నా..	- హలో
తెలుసా తెలుసా	- సరైనోడు
నీ కల్లలో నా కాటుక	- జై లవకుశ
రెండు కళు	- మహానుభావుడు
తెలుగు బెంగాళీ	- దడ
ఏం చెప్పను	- నేను శైలజ
తెలిసెనే నా నువ్వే	- అర్జున్‌రెడ్డి
గాలి వాలుగా	- అజ్ఞాతవాసి
అతిలోక సుందరి	- సరైనోడు
ఏమిటో	- అందాల రాక్షసి

– పి. మధుసూదన్, హైదరాబాద్

నాకు నచ్చిన పుస్తకాలు

మనం చదివిన పుస్తకాలు ఎన్ని ఉన్నా కొన్ని మాత్రం చదివిన ప్రతీసారి కొత్త పుస్తకమల్లే మొదటినుండి చివరిదాకా చదువుతాము. ఆ పుస్తకం అంటే ఎందుకంట అంత ఇష్టం?. ఆ పుస్తకంలోని కొన్ని మాటలు మనకు మరుపురాని పాఠాలు కావొచ్చు. ఆ మాటలను మన జీవితంలోనే తరచి తరచి చూసుకోవచ్చునేమో. మనసుమూలల్లో దాగిన ఆ ముచ్చట్లు, భావాలు ఈ పుస్తకం చదువడం వల్ల రిఫ్రెష్ అవుతాయేమో. ఏమో?

మీరు మంచి అమ్మాయి కాదు



రచన: యండమూరి వీరేంద్రనాథ్
ప్రతీ అమ్మాయి లేదా అమ్మ తమలోని శక్తిని గుర్తించలేక తండ్రి, భర్త పిల్లల మీద ఆధారపడతారు. ప్రతీ పురుషుడి విజయం వెనుక ఒక ఉంటుంది. ప్రతి విజయం వెనుక పురుషుడు ఉంటారు అని అందరూ అబద్దాలు చెప్పి మభ్యపెడుతుంటారు కాని మీ విజయం వెనుక మీరు, మీ కృషి పట్టుదల ఉంటుంది అది ఎవరికీ ఆపాదించవద్దు అంటారు ఈ పుస్తకంలో, ఇలాంటివెన్నో మంచి విషయాలు, ఆలోచింపజేసేవి కూడా ఉన్నాయి.

సౌందర్యం

రచన: కొమ్మూరి రవికిరణ్
మన బాధను, ఆవేదనను, సందేహాలను మనసు విప్పి మాట్లాడుకోవడానికి ఒక తోడు కావాలనుకుంటాం. మన సమస్యను చర్చించుకోవడానికి లేదా దాని కారణం తెలుసుకోవడానికి ఆ స్నేహితుడు సాయపడతాడు. అటువంటి తోడు ఒక మంచి పుస్తకమైతే ఎలా ఉంటుంది. అలాంటి పుస్తకమే కొమ్మూరి రవికిరణ్ రచించిన సౌందర్యం.

పిఠాపురం క్రానికల్స్




రచన: కంభంపాటి రవీంద్ర
జీవితంలోని సంఘటనలు, మనుషులు, బంధాలు, అనుబంధాలే సాహిత్యానికి పునాదులు. ఈ పుస్తకంలోని కథలు చదువుతుంటే పక్కింట్లోనో, ఎదురింట్లోనో జరుగుతున్న వ్యవహారాల్లాగే అనిపిస్తాయి. నిట్టూర్పులు, కేరింతలు, విషాదాలు, వినోదాలు, ఆవేశాలు.. ఎన్నో మన కళ్ల ముందు కదులాడుతుంటాయి. కాని చివర్లో వచ్చే ట్విస్ట్ మాత్రం అద్భుతం.

ఋతుచక్రం

రచన: మాదిరెడ్డి సులోచన
ఒక గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జరిగే కథ ఇది. ముఖ్య పాత్ర అంటూ ఉండదు. అందరూ ముఖ్యమైన వారే. తండ్రి, కొడుకులు, కూతుళ్లు, పిల్లలు. ఒక్కొకరిది ఒక్కో స్వభావం, ఆరోపణలు, ఆవేశాలు, చిన్న చిన్న గొడవలు, సర్దుబాట్లు. ఇలా ఎన్నో సంఘటనలు కళ్లకు కట్టినట్టుగా ఉంటాయి. ఇందులో ఎవరినీ తప్పుబట్టలేం అనిపిస్తుంది. దండలో దారంలా అందరినీ ఒక చోట కలిపి ఉంచాలని ప్రయత్నిస్తుంది ఆ ఇంటి చిన్నకోడలు అరుంధతి.


ఒకపరి జననం ఒకపరి మరణం



రచన: రామా చంద్రమౌళి
మనిషిగా జన్మనెత్తాక ఎప్పుడో ఒకప్పుడు మరణించక తప్పదు. సరిపడినంత డబ్బు ఉంది ఈ జీవితం సాఫీగా గడిచిపోతుంది చాలు అనుకోకుండా మరణించాక కూడా జీవించాలి. అయితే ఆ జీవనంలో లక్ష్యమనేది లేకపోతే అది మరణమే. అందుకే నేటి యువతకు దిశానిర్దేశం చేసి ప్రోద్బలం అందించాలి. గురిపెట్టిన లక్ష్యానికి చేరువకావాలంటే మార్గం సుగమం కావాలంటారు రచయిత.. ఆలోచనలను చదువాలంటారు.

జ్యోతి వలబోజు, పబ్లిషర్, రచయిత్రి

కళా భూషణుడు



ఆయన కెమెరా పడితే.. తెలంగాణ గ్రామీణ జీవన చిత్రాలకు సజీవ రూపమిస్తాడు.. కుంచె పట్టి బొమ్మ గీస్తే.. ఆ బొమ్మలు ప్రాణమున్న జీవుల్లా మనతో బాస చేస్తాయి.. కలం పట్టి రాత మొదలుపెడితే.. ఎన్నో ఆలోచనలు అక్షరరూపం దాల్చి తెలంగాణ సమాజానికి ప్రశ్నల పరంపరను రగిలిస్తాయి.. సహజత్వం కోల్పోతున్న సంస్కృతిని పరిచయం చేస్తాయి. ఆయనే భరత్ భూషణ్. గత నలభయేళ్లుగా చిత్రకారుడిగా, ఫొటోగ్రాఫర్‌గా, జర్నలిస్టుగా సేవలందిస్తూ అందరికీ సుపరిచితుడిగా పేరు తెచ్చుకున్నాడు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2016 సంవత్సరానికి గానూ ప్రకటించిన విశిష్ట పురస్కారం అందుకున్న సందర్భంగా ఆయన ప్రస్థానం మీకోసం..


ఫొటో జర్నలిస్టుగా ఎన్నో చిత్రాలను తన కెమెరాలో బంధించాడు భరత్ భూషణ్. తెలంగాణ రాష్ట్ర పండుగ, తెలంగాణ ప్రజల అభిమాన వేడుక, రంగుపూల తోరణంలాంటి బతుకమ్మను, బతుకమ్మ సౌందర్యాన్ని, పూలదేవత సహజత్వాన్ని కెమెరాలో బంధించిన తొలి ఫొటోగ్రాఫర్ ఈయన. అప్పటి వరకు బతుకమ్మ అంటే కేవలం తెలంగాణ ప్రాంతంలో జరిగే ఒక పూలజాతరగానే అందరికీ తెలుసు. కానీ ఎవరూ బతుకమ్మను ఫొటో తీసి భావితరాలకు భద్రంగా అందించాలని ఆలోచించలేదు. కానీ భరత్ భూషణ్ ఒక చిత్రకారుడిగా, ఫొటోగ్రాఫర్‌గా బతుకమ్మలోని రంగులను, రంగుల్లోని వైవిధ్యాన్ని ప్రకృతి దేవత సౌందర్యాన్ని తన కళాదృష్టితో చూశాడు. పల్లె తెలంగాణను, తెలంగాణ జానతనాన్ని తన కెమెరా కళ్లతో ప్రపంచానికి చూపించాడు. అందుకే తెలంగాణ ప్రభుత్వం తొలి తెలంగాణ వార్షికోత్సవాల్లో ఆయనను 2015లో ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా అవార్డు ఇచ్చి గౌరవించింది. గత కొన్నిరోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతుండగా.. తెలంగాణ ప్రభుత్వం పెద్ద మనసులో ఆయన వైద్య ఖర్చులన్నీ భరించింది.

లెన్స్ బిగించి..

వరంగల్‌కు చెందిన భరత్ భూషణ్ చిన్నప్పటి నుంచి వరంగల్ కోటల్లో ఆడుతూ పాడుతూ పెరిగాడు. ఊహ తెలియని వయసులోనే గొప్ప చరిత్రకు ఆనవాళ్లైన కాకతీయుల రాజ్య పునాదుల్లో ఆడుకున్నాడు. ఆ కోటగోడలు, ప్రాకారాలు, వరంగల్ జిల్లాలోని గిరిజనుల సంస్కృతి, రంగురంగుల వేషధారణ ఆయనను ఆకట్టుకున్నాయి. ఎలాగైనా వాటిని కొత్తకోణంలో ప్రపంచానికి పరిచయం చేయాలనుకున్నాడు. ఆర్థికపరంగా భరత్ భూషణ్ కుటుంబానికి పెద్దగా ఆస్తిపాస్తులేమీ లేవు. తెలంగాణ పల్లెతనపు అందాలను కుంచెతో చిత్రీకరించి చూపాలనుకున్నాడు. కానీ కుంచె పడితే పూట గడువడానికి డబ్బులు రావని తెలుసు. బంధువులు కూడా కుంచె పడితే.. చిన్నచూపు చూస్తారని భావించాడు. పైగా అప్పట్లో చిత్రకారుల గొప్పతనాన్ని గుర్తించేవారు కాదు. ఒక చిన్నచూపు ఉండేది. అందుకే ఫొటోగ్రఫీ చేయాలనుకున్నాడు. ఇరువయేళ్ల వయసులోనే కెమెరా చేతపట్టాడు. కంటికి కనిపించిన తెలంగాణ సంస్కృతిని తన కెమెరాతో బంధించడం మొదలుపెట్టాడు. ఫొటోగ్రఫీలో మెళకువలు నేర్చుకోవాలన్న కోరిక పుట్టింది. జేఎన్టీయూలో బీఎఫ్ఏ కోర్సులో జాయిన్ అయ్యాడు. ఫొటోగ్రఫీ పట్ల ఆసక్తి, కెమెరా మీదున్న ప్రేమ అతనికి యూనివర్సిటీలో గోల్డ్ మెడల్ సాధించిపెట్టాయి. పనిలో పనిగా డిగ్రీ కూడా పూర్తి చేశాడు. తనదైన శైలిలో తెలంగాణ పల్లెజీవనాన్ని బంధించడం మొదలుపెట్టాడు.

కుంచె పట్టి.. బొమ్మ గీసి..

తనలో నిద్రాణమై ఉన్న 'కుంచె పట్టాలి' అనే కోరికకు 1973లో రూపమిచ్చాడు. తన కుంచె నుంచి జాలువారిన చిత్రాలన్నింటినీ ఒకచోటికి చేర్చి వరంగల్‌లో పెయింటింగ్ షో నిర్వహించాడు. ఆ తర్వాత వరుసగా మూడేండ్లు వరంగల్ ఆర్ట్ సొసైటీ నిర్వహించే పెయింటింగ్ పోటీల్లో అవార్డులు గెలుచుకున్నాడు. ఆ తర్వాత1976లో మరోసారి హైదరాబాద్‌లో పెయింటింగ్ ఎగ్జిబిషన్ పెట్టాడు. 2007లో మరోసారి తన కుంచె నుంచి ప్రాణం పోసుకున్న చిత్రాలను ప్రదర్శనకు ఉంచాడు. మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు మళ్లీ 'గ్రామీణ తెలంగాణం' పేరుతో 30 ఫొటోలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశాడు. తెలంగాణ గ్రామీణ జీవన సౌందర్యాన్ని మనసుకు హత్తుకునేలా చూపుతున్నాడు.



అక్షరాలతో మాట్లాడించాడు..

కాకతీయుల గురించి అందరూ చాలా గొప్పగా చెప్తారు. కానీ వారి గురించి సమగ్ర సమాచారంతో ఎక్కడా రాతపూర్వకంగా ఆయనకు దొరుకలేదు. కాకతీయుల శిల్ప సంపద గురించి ఫొటోలతో కూడిన పుస్తకం రూపొందించాలనుకున్నాడు. కానీ ఆర్థిక పరిస్థితులు సహకరించలేదు. ఆ తర్వాత ఎక్కడా లేని ప్రత్యేకత ఏంటంటే.. తెలంగాణ జాతరలు. మేడారం సమ్మక్కసారలమ్మల జాతర, కొమురవెల్లి మల్లన్న జాతర, ఐనవోలు మల్లన్న జాతర, వేములవాడ రాజన్న జాతర, కొత్తగట్టు, కొండగట్టులాంటి ఎన్నో జాతరలు తెలంగాణ మారుమూలల్లో ప్రతీ ఏడాది జరుగుతూనే ఉంటాయి. అక్కడ స్వచ్ఛమైన జనజీవనం కనిపిస్తది. వాటి గురించి ఎవ్వరూ ఎక్కడా రాయలేదు. కుంభమేళ కంటే గొప్ప జన సమ్మేళనాలు అవి. వాటి గురించి ప్రచారం జరుగాల్సిన అవసరం ఉన్నది అంటారు భరత్ భూషణ్. ఉమ్మడి పాలనలో నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ జాతరలు ఇప్పుడు తిరిగి పునర్జీవం పోసుకుంటున్నాయి. కాకపోతే మారుతున్న కాలం, అభివృద్ధి జాతరల్లోని సహజత్వాన్ని మింగేస్తున్నదంటున్నారాయన. కాకతీయులు, జాతరలు, మరుగున పడిన, విస్మరించబడిన ఎన్నో తెలంగాణకు సంబంధించిన అంశాలను తట్టి వందలాది వ్యాసాలు రాశారు భరత్ భూషణ్. చేర్యాలలో మాత్రమే దొరికే నకాషి ఆర్ట్‌వర్క్ మీద ఫొటోగ్రఫీ చేసి, వ్యాసాలు రాసి ప్రపంచానికి పరిచయం చేశారు.

> ప్రస్తుతం అనారోగ్యం కారణంగా ఫొటోగ్రఫీకి కొన్నిరోజులు విరామం ఇచ్చాను. మోడ్రన్ తెలంగాణ మీద పెయింటింగ్ వేస్తున్నాను. తెలంగాణ గురించి ఇంకా ఎన్నో అంశాలు వెలుగులోకి రావాల్సి ఉన్నది. మన గురించి ప్రపంచమంతా మాట్లాడుకునే రోజు ఒకటి వస్తుంది. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం అదే పనిలో ఉన్నది. ఇప్పటికే తెలంగాణ అంటే ఒక ప్రత్యేక ఆసక్తి, ఆకర్షణ ఉన్నది. దాన్ని ఇంకా పెంచాలంటే మన గొప్పతనం బయటకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.
> **– భరత్ భూషణ్, ఫొటోగ్రాఫర్, చిత్రకారుడు**

రంగులలోకం..

సినిమాల్లో అవకాశం సంపాదించాలి అన్నది భరత్‌భూషణ్ కోరిక. కానీ ఆ కోరిక తీరనేలేదు. ఫిలిం మేకర్, ఆర్టిస్ట్ కావాలని ఆయన కలలు కనేవారు. వరంగల్ ఫిలిం సొసైటీకి ట్రెజరర్‌గా కూడా పనిచేశారు. ఎన్నో ఫిలిం మ్యాగజైన్లలో ఫ్రీలాన్సర్‌గా, ఉద్యోగిగా పనిచేశారు. కొంతకాలం తర్వాత ఆంధ్రజ్యోతి పత్రిక మొదలైంది. అక్కడ జాయిన్ అయ్యారు. ఆ తర్వాత ఉదయం, సుప్రభాతం పత్రికల్లో పనిచేశారు. ఎక్కువగా ఫ్రీలాన్సర్‌గా చేయడానికే ఇష్టపడేవారు. అంతర్జాతీయ స్థాయిలో పలు మీడియా సంస్థలకు ఫ్రీలాన్సర్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేశారు. అప్పటి వరకు హైదరాబాద్ చరిత్రలో పొందుపరుచని వెండిపేపర్, నాన్ రోటీలు, దంతపు వస్తువులు, గాజులు, షెర్వానీ, ఇరానీ ఛాయ్, ధూల్‌పేట పతంగులు ఇలా ఎన్నో అంశాల మీద ఫొటోగ్రఫీ చేశారు. వ్యాసాలు రాశారు. పోచంపల్లి ఆర్ట్, కాళేశ్వరం, గిరిజన తండాల మీద ఫొటోగ్రఫీ చేసి కాఫీటేబుల్ బుక్ తయారుచేయాలన్నవి నా ఫ్యూచర్ ప్రాజెక్టులు అంటున్నారు భరత్ భూషణ్.

శాస్త్రవేత్తలు సైతం..

బతుకమ్మ పండుగ అంటే తెలంగాణ ఆడబిడ్డలకు ఒక సంబురం. రంగురంగుల పూలు ఏరుకొచ్చి పేర్చి పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ పూలను పూజించే గొప్ప సంస్కృతి ఉన్న పండుగ అది. తెలంగాణ ఉద్యమం మొదలైన తర్వాత ఒక పండుగ తెలంగాణ ఉద్యమాన్ని, మహిళా లోకాన్ని ఒకటి చేసింది. అలాంటి బతుకమ్మను తొలిసారి ఫొటోషూట్ చేశాడు భరత్‌భూషణ్. ఒక సందర్భంలో నీటి కరువు వచ్చి బతుకమ్మ పండుగ జరుపుకోవడం, నిమజ్జనం చేయడానికి చెరువుల్లో నీళ్లు లేకపోవడం భరత్‌భూషణ్‌ని కదిలించింది. గునుగు, తంగెడుపూలు దొరుకక ప్రత్యామ్నయంగా కాగితం బతుకమ్మలు తెరమీదకు వచ్చాయి. పూలతో పేర్చే బతుకమ్మల సైజు తగ్గిపోయింది. ఆ సమయంలో హైదరాబాద్ ఇక్రిశాట్‌లో అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తలందరూ నీటి వనరుల మీద చర్చ చేస్తున్నారు. ఆ సెమినార్‌లో నీటి కరువు ప్రభావం బతుకమ్మ పండుగ మీద ఎలా పడిందో ఫొటోషూట్ ద్వారా చూపించాడు. ప్రకృతికి సంబంధించిన పండుగ మీద కరువు ఎఫెక్ట్ ఎలా పడిందో చెప్తూ భరత్ భూషణ్ చేసిన ఫొటోగ్రఫీ శాస్త్రవేత్తలను ఆలోచింపజేసింది. ఆ ఫొటోలు భరత్ భూషణ్ పేరును 'బతుకమ్మ భరత్‌భూషణ్' గా మార్చేశాయి.

క్లాసిక్ మూవీ


మరణం ఒక జవాబు.. మరణం ఒక ప్రశ్న.. మరణం ఒక పరిష్కారం.. మరణం ఒక సమస్య.. మరణం ఒక నిజం.. మరణం ఒక అబద్ధం.. మరణం ఒక మరణం .. మరణం ఒక బతుకు మరణం ఒక ప్రశాంతత.. మరణం ఒక అశాంతి!!

Talvar ప్రశ్నార్థక మరణం!!

ఆ చిన్నారి పేరు ఆరుషీ తల్వార్ !

నోయిడాలో నివాసముంటున్న వైద్య దంపతులు రాజేష్ తల్వార్, నూపుర్ తల్వార్‌ల ఒక్కగానొక్క ముద్దుల కూతురు. తెల్లారి లేచేసరికి గొంతుకోసి రక్తం మడుగులో శవమై కనిపించింది. తల్లిదండ్రులు పక్కరూంలోనే పడుకున్నారు. కానీ ఎలాంటి అరుపులూ లేకుండా నిశ్శబ్దంగా హత్య జరిగింది. యథా ప్రకారం పోలీసుల విచారణ ప్రారంభమైంది. మొదట ఆ ఇంట్లో పనిచేసే నడివయస్కుడు హేమ్ రాజ్ కన్పించకపోయేసరికి అతడే అనుకున్నారు. కానీ రెండో రోజు మధ్యాహ్నం అతడుకూడా భవనం పైభాగంలో హతుడై కన్పిస్తాడు. పోలీసులకు అంతుపట్టని ఆ కేసు సీబీఐకి అప్పగిస్తారు. లోతైన విచారణ అనంతరం ఈ రెండు జంట హత్యల్ని రాజేష్ తల్వార్ ఆసుపత్రి కాంపౌడర్ అతని మిత్రులూ చేశారని సీబీఐ వివరణ. నార్కో టెస్టులో తామే చేశామనే కథనాలు వాళ్ళు వినిపించినా కోర్టు ఆ టెస్టులని సాక్ష్యంగా తీసుకోదు. అవి గాక ఇతర బలమైన సాక్ష్యాలూ దొరకక ముందే నాటకీయంగా సీబీఐ విచారణాధికారి మారిపోయారు. కొత్త సీబీఐ విచారణ ప్రకారం, కూతురికి తమ తమ లైంగిక జీవిత రహస్యాలు తెలిసిపోయి, ప్రతికారంగా/కోపంలో ఆ కూతురు తను కూడా హేమరాజ్‌తో సంబంధం పెట్టుకొన్నదనీ, ఆ రాత్రి ఆ పనివాడూ, కూతురూ ఏకాంతంగా కనపడేసరికి ఉద్రేకంలో తండ్రే ఇద్దర్నీ హత్య చేశాడనీ, తల్లి సహకరించిందనీ మరో కోణంలో వివరించారు. ఈ రెండు రకాల విచారణల్లో, వివరణల్లో ఎటూ తేలక, ఎటూ సాక్ష్యాలు బలంగా లేనందువల్ల కేసును మూసేయాలని రెండో టీం సూచించింది. కానీ కోర్టు దాన్ని తోసిపుచ్చింది. అయితే కాంపౌండర్ చేశాడనటానికి బలమైన సాక్ష్యాలు లేకపోవటం, అనుమానాలు ఎక్కువగా తల్లిదండ్రులవైపే ఉండటం వల్ల ఆ తల్లిదండ్రులకి యావజ్జీవ శిక్ష ఖాయమైంది. వాళ్ళు శిక్షననుభవిస్తూ హైకోర్టుకు అప్పీలు చేసుకున్నారు.

కూతురుని చంపిన తల్లిదండ్రులూ అనే దిగ్రాంతిక విషయం వల్లనో, లేక ఉన్నత కుటుంబాలకి



చెందిన వారే ఇలా చేశారనే లేక విచారణకి అందని కేసు అవటం మూలానే ఈ జంటహత్యలు దేశవ్యాప్తంగా ఉత్సుకతని కలిగించి కలకలం రేపింది. జనం అంతా ఆ చిన్నారికి క్యాండిల్స్‌తో తమ సంతాపం ప్రకటించారు. రాత్రింబవళ్ళూ మీడియా కోడై కూసింది. ఎప్పటికప్పుడు విచారణని జనాలకి తెలియజెప్పింది. ముద్దాయిల, సంబంధిత వ్యక్తుల, సామాజిక నిపుణుల, పాత్రికేయుల, సాక్ష్యుల ఇంటర్వ్యూలూ, వాదనలు, వివరణలతో మీడియా హోరెత్తించింది. ఎప్పటికప్పుడు ఈ సమాచారాన్ని అనుసరించిన వాళ్ళందరూ ఇంకా ఒక డోలాయమాన స్థితిలోనే ఉన్నారు. నోయిడా పోలీసుల అతి నిర్వాకం వల్ల ఉన్న సాక్ష్యాలూ తుడిచిపెట్టుకుపోయాయి. మొదటి సీబీఐ విచారణ పటిష్టంగా అనిపించినా గట్టి సాక్ష్యాలు లేక, కేసు ఎటూ బలంగా తేలక మరోవైపు నెట్టేశారేమో అని మనకు అనిపించక మానదు. ఈ కేసుకు సంబంధించిన వివరాలూ, ఇంటి ప్లానింగూ, విచారణలూ, నార్కో టెస్టులూ, సంబంధిత వ్యక్తుల, బంధువుల, స్నేహితుల చుట్టుపక్కల వాళ్ళ ఇంటర్వ్యూలూ అన్నీ ఇంటర్నెట్లో ఉన్నాయి. కూర్చొని అన్నీ చూసుకొని మనకి మనం ఒక విచారణ చేసినా వీడని మిస్టరీ హత్యలివి. కొంతసేపు మానసికంగా మనం ఒకవైపు మొగ్గినా మళ్ళీ కాసేపట్లో మరోవైపు మొగ్గుతాం. ఎన్ని రోజులు ఎన్నిసార్లు ఆలోచించినా ఎవరికి వాళ్ళు ఎన్ని రకాలుగా వివరించుకున్నా అంతుబట్టని రహస్యంగా మిగిలిందీ కేసు. థ్రిల్లింగ్ ఇన్వెస్టిగేషన్ సినిమాలు చూసే ప్రేక్షకులే కాక ఏళ్లపాటు జరిగిన విచారణ, వివరాలని ఒకేసారి చూద్దాం అనుకునే ప్రేక్షకులుంటారనీ, తాము మిస్ అయిన కొన్ని వివరాల చూడాలకునేవాళ్ళూ ఉంటారనీ నమ్మకమే ఈ సినిమా తీయటానికి కారణం.

ఇంత ఉత్సుకత కలిగిన ఈ హత్యకేసుకి కొద్దిగా నాటకీయతని, సందర్భానుసార హాస్యాన్ని చేర్చి ఒక డాక్యుడ్రామాలాగా, భిన్న రకాల విచారణా దృక్పదాలని విడివిడిగా చూపిస్తూ, ఎక్కడా ఉత్కంఠ తగ్గకుండా విశాల్ భరద్వాజ్ స్క్రీన్‌ప్లే సమకూరిస్తే, ఆ నిజకథని సినిమాలాగా గొప్పగా మలిచింది దర్శకురాలు మేఘనా గుల్జార్!

చక్రధర్‌రావు భైరంపల్లి, సెల్: 9848519435

సుడోకు

డైలీ సుడోకు 112 సమాధానం

2	6	3	7	8	5	1	9	4
5	1	9	6	4	3	2	8	7
4	8	7	9	1	2	5	6	3
6	7	2	8	5	9	3	4	1
9	4	8	3	2	1	7	5	6
1	3	5	4	7	6	9	2	8
3	5	4	1	9	8	6	7	2
7	9	1	2	6	4	8	3	5
8	2	6	5	3	7	4	1	9

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు - 113

6	4		5		3			1
	5	7						
2			8				5	
8		6				9		
			4		9			
		5				2		7
	3				8			6
						3	9	
9			3		1		7	8

ట్వీట్

లీడర్, ఘాజీ, నేనే రాజు నేనే మంత్రి.. వంటి కథలు దేశభక్తి, గొప్ప సంస్కరణకు సంబంధించిన కథలు. ఈ కథలు హృదయాల్ని కదిలించాయి. ఇలాంటి అనేక కథలను సినిమాలుగా చేయాలనుకుంటున్నాను. ఇలాంటి కథలు భారతీయ సినిమాకు అవసరం. నన్ను ఇలాంటి మరిన్ని సినిమాల్లో చూడాలనుకుంటున్నారా?

రానా దగ్గుబాటి
@RanaDaggubati



రానాను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
4,808,240

కామన్‌మ్యాన్ వాయిస్

మనం గొప్పవాళ్లం కావాలంటే మన పక్కవారిని మానసికంగా హింసించి పైశాచిక ఆనందం పొందడం కాదు. వారిని ప్రేమించిన రోజు నువ్వు గొప్పోడివి అవుతావు.
–కుక్కల మధుబాబు

మాకు ప్రశంస పత్రాలే గతి. పద్మశ్రీ, పద్మభూషణ్, భారతరత్నలాంటివి ఇవ్వరు గాని దేనికి పనికిరాని ఉత్త ప్రశంసలు మాత్రం ఇస్తరు. ఇగ మా ప్రతి పక్షాల వారికైతే ఇవేవి కనిపించవు. తెలంగాణ అన్ని రంగాల్లో దేశంలో నంబర్‌వన్‌గా నిలిచి, అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా మారినా వీరికి మాత్రం కనపడదు.
–Madhavi Madhagani

వైరల్ వీడియో



టచ్ చేసి చూడు.. రవితేజ, రాశిఖన్నా జంటగా నటిస్తున్న చిత్రం. సరికొత్త లుక్‌తో, మరింత ఎనర్జిటిక్ ఉన్న ఈ సినిమా ట్రైలర్ యూట్యూబ్‌లో హల్‌చల్ చేస్తున్నది.

Touch Chesi Chudu Theatrical Trailer | Ravi Teja | Raashi | Seerat | JAM8 | #TCCDhamakaTrailer
Total views : 2,946,666+
Published on Jan 25, 2018

నమస్తే తెలంగాణ
అల్లరి
[హైదరాబాద్]
ఆదివారం 28 జనవరి 2018

కొత్త విషయం..

ఆ దేశాల్లో 'నో ట్యాక్స్'



మనదేశంలో ఎక్కువగా సంపాదించేవారు కచ్చితంగా ప్రభుత్వానికి ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించాలి. వారు ఎంత సంపాదించారు? అందులో ఎంత మొత్తం పన్నుగా చెల్లించాలనేది శ్లాబులనుబట్టి నిర్ణయిస్తారు. అయితే ఈ పది దేశాల్లో మాత్రం ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించాల్సిన అవసరమే లేదు!!

ఖతార్ : ఇక్కడ ఉద్యోగం చేసేవారు తమకు వచ్చే ఆదాయంపై ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించాల్సిన పనిలేదు. అయితే వ్యాపారం చేసేవారు మాత్రం ఎంత లాభం వచ్చినా సరే ప్రభుత్వానికి 10శాతం పన్ను కడితే చాలు.

ఒమెన్ : ఈదేశంలో ఉద్యోగులకు, వ్యాపారులకు ట్యాక్స్ విషయంలో పెద్ద ఊరట. ఎందుకంటే ఉద్యోగం చేసినా, వ్యాపారం చేసినా పన్ను కట్టాల్సిన పనే లేదు.

యూఏఈ : ఈదేశంలో కూడా ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ ఆయిల్, గ్యాస్, ఆర్థిక సేవలు అందించేవారు, తీసుకునే వారు కచ్చితంగా ట్యాక్స్ చెల్లించాలి.

వనౌటు : ఈ దేశంలో ఎవరైనా ఉద్యోగం, వ్యాపారం ద్వారా ఎంతైనా సంపాదించుకోవచ్చు. ట్యాక్స్ కట్టాల్సిన పనిలేదు. విచిత్రంగా ఎవరైనా ఈ దేశానికి డబ్బును విరాళంగా ఇస్తే.. వారికి దేశ ఉచిత పౌరసత్వం ఇస్తారు.

కేమ్యాన్ ఐలాండ్స్ : ఈ దేశంలో కూడా ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించాల్సిన పని లేదు. అయితే 1.50 లక్షల డాలర్ల వార్షిక ఆదాయాన్ని కలిగి ఉండాలి. లేదంటే 5 లక్షల డాలర్ల విలువైన రియల్ ఎస్టేట్ ప్రాపర్టీ, కంపెనీలు ఉండాలి. అలా ఉంటేనే ట్యాక్స్ ఉండదు.

మొనాకో : ఈ దేశంలో పౌరులకు పూర్తి స్వేచ్ఛ ఉన్నది. ఎంతైనా సంపాదించుకోవచ్చు. ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించాల్సిన అవసరమే లేదు.

టర్క్స్ అండ్ కైకోస్ : ఈ దేశంలో పౌరులు కూడా ఎంత సంపాదించినా పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే విదేశీయులైతే 3 లక్షల డాలర్ల విలువైన ఇల్లును లేదా భవనాన్ని కొనాలి. లేదా 7.50లక్షల డాలర్లతో కంపెనీని ప్రారంభించాలి. అలా చేస్తే వారు కూడా ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించాల్సిన పనిలేదు.

బ్రూనై : ఈ దేశంలో కూడా పౌరులు ఎంతైనా సంపాదించుకోవచ్చు. పన్ను చెల్లించాల్సిన పని లేదు.

బహమాస్ : ఈ దేశానికి చెందిన ప్రధాన వనరు టూరిజం, కంపెనీలు. ఈ దేశపు పౌరులు కూడా ఆదాయ పన్ను చెల్లించాల్సిన పనిలేదు.

బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్ : ఈ దేశంలో కూడా పౌరులు ఆదాయ పన్ను కట్టాల్సిన పనిలేదు. విదేశీయులైదే తమ బ్యాంక్ స్టేట్‌మెంట్ చూపిస్తూ.. వెయ్యి డాలర్లు చెల్లిస్తే చాలు.. వారికి రెసిడెన్సీ పర్మిట్ జారీ చేస్తారు.

తెలుసుకుందాం..!

మనకూ ఓ అగ్నిపర్వతం

మన దేశంలో ఏకైక అగ్నిపర్వం ఉన్నది తెలుసా! అది ఎక్కడున్నది? ఎలా ఉంటుంది? ఈ విషయాలన్నీ తెలుసుకుందామా!



అగ్ని పర్వతాలంటే ముందుగా అమెరికా, యూరప్, ఆఫ్రికా ఖండాలు గుర్తుకు వస్తాయి. పెద్ద ఎత్తున లావా వెదజల్లుతూ కొన్ని వేల డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతతో ప్రమాదకరంగా ఉంటాయి. అయితే మనదేశంలో కూడా ఓ అగ్ని పర్వతం ఉన్నది. ఎక్కడంటే.. అండమాన్ నికోబార్ దీవుల్లో. దీని పేరు బారెన్ ఐలాండ్ వల్కనో. ప్రస్తుతం ఈ అగ్నిపర్వతం గురించిన వార్త ఒకటి కలవర పెడుతున్నది. అదేంటంటే.. అతి త్వరలోనే ఈ అగ్ని పర్వతం బద్ధలవబోతుంది. దాదాపు 150 ఏండ్లుగా ఈ అగ్నిపర్వతం నిద్రాణ స్థితిలోనే ఉన్నది. ఇప్పుడేమో ప్రతి పదినిమిషాలకు ఒకసారి బూడిద, నిప్పులు వెదజల్లుతూ ఉందట. దీనిపై నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషియానోగ్రఫీ పరిశోధకులు తాజాగా అధ్యయనం చేశారు. అగ్ని పర్వతం నుంచి కొన్ని శాంపిల్స్ తీసుకెళ్లి పరిశోధిస్తున్నారు. ఆ వివరాలు తెలిస్తే ఇది ఎప్పుడు బద్ధలవుతుందో తెలుస్తుంది. 1991లో ఇలాగే ఒకసారి బూడిద, నిప్పురవ్వలు వచ్చాయట. ప్రస్తుతం దీనివల్ల ఎలాంటి భయం అక్కర్లేదట. పర్యాటకులు కూడా నిర్భయంగా ఉండొచ్చని అంటున్నారు.



పిల్లలూ! వీరంతా 2017 సంవత్సరానికిగాను ఎంపికైనా సాహసబాలలు. ఒక్కమాటలో చెప్పాలంటే చాలా ధైర్యవంతులు. వెనుకడుగు వేయని తెగువ, వెన్నుచూపని సాహసమే వీరికి ఈ స్థాయిని కల్పించాయి. వీరంతా ఎవరు? ఎలాంటి సాహసం చేస్తే వీరికి అవార్డులు వచ్చాయో తెలుసుకుందామా?

వీరే మన సాహస బాలలు

జాతీయ సాహస బాలల పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్నది. ఈ అవార్డులు ప్రతి ఏటా ఎందుకిస్తున్నారంటే.. అక్టోబర్ 2, 1957న భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఢిల్లీలోని ఎర్రకోట వద్ద రామ్‌లీలా మైదానంలో ఒక ప్రదర్శనను తిలకిస్తున్నారు. అయితే ప్రదర్శన జరుగుతున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. అక్కడ వందల మంది ఉన్నారు. అక్కడున్న 14 ఏళ్ల హరీష్‌చంద్ర తన దగ్గరున్న కత్తితో కాలిపోతున్న టెంట్‌ను రెండుగా చీల్చి.. అంతా వెళ్లేందుకు మార్గాన్ని సుగమం చేశాడు. దీంతో వందలాదిమంది ప్రాణాలు కాపాడాడు. ఈ సంఘటనతో ప్రేరేపితులైన ప్రధాని నెహ్రూ.. దేశవ్యాప్తంగా ఉత్తమ ధైర్య సాహసాలు ప్రదర్శించిన బాల బాలికలను గౌరవించేందుకు జాతీయ సాహస పురస్కారాలను అందజేస్తున్నారు. మొదటిసారిగా హరీష్‌చంద్రతో పాటు ఇతర సాహసికులకు ఫిబ్రవరి 4, 1958న అందజేశారు. అప్పటి నుంచి ఇండియన్ కౌన్సిల్ ఫర్ చైల్డ్ వెల్ఫేర్ (ఐసీసీడబ్ల్యూ) ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నది. ఈ క్రమంలో ఈ అవార్డులను ఐదు విభాగాలుగా విభజించారు. 6 నుంచి 18 సంవత్సరాల మధ్య వయసున్న సాహస బాలలకు వీటిని అందజేస్తారు. ఈ ఏడాది అవార్డు వచ్చిన వారిలో 11మంది బాలురు, ఏడుగురు బాలికలు ఉన్నారు. ఇప్పటి వరకు 680 మంది బాలురు, 283 మంది బాలికలకు అవార్డులు ప్రదానం చేశారు.

నజియా



2015లో డింపి అనే చిన్నారిని మత ఘర్షణల్లో రక్షించి రాణి లక్ష్మీభాయ్ సాహస అవార్డు అందుకున్నది. ఆ తర్వాత 2017లో ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా ప్రాంతంలో జూదం, పందెంరాయుళ్ల మాఫియాను పోలీసుల సహకారంతో నామ రూపాలు లేకుండా చేసింది. ఇందుకు ప్రతిష్టాత్మకమైన 'భారత్ అవార్డు'కు ఎంపికైంది.

కరణ్‌బీర్ సింగ్



పంజాబ్ రాష్ట్రానికి చెందిన 17ఏండ్ల కరణ్‌బీర్‌సింగ్.. బస్సు కాల్వలో పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అయినా ఆ గాయాలను లెక్కచేయకుండా 15మంది తోటి విద్యార్థులను కాపాడాడు. అతని ధైర్యసాహసాలను గుర్తించిన ప్రభుత్వం అతనికి సంజయ్ చోప్రా అవార్డును ప్రకటించింది.

రాజేశ్వరి చాను



మణిపూర్‌కు చెందిన రాజేశ్వరి చాను.. ఓ తల్లిని, మూడేండ్ల చిన్నారిని కాపాడి ప్రాణాలు కోల్పోయింది. ఓంగ్బి కెబిసన అనే మహిళ తన కూతురితో నదిని దాటుతుండగా.. ప్రమాదవశాత్తు చిన్నారి నదిలో పడింది. పాపను కాపాడే ప్రయత్నంలో ఓంగ్బి కూడా కొట్టుకుపోతుండగా.. ఇదంతా గమనిస్తున్న రాజేశ్వరి.. ఈత రాకపోయినా తల్లిని, పిల్లను కాపాడింది. నదిలో ఈదే ఓపిక లేక చనిపోయింది. తనపేరు మీద ఆమె తండ్రి లొక్‌రో క్వామ్‌రాజ్ అవార్డు అందుకున్నారు.

నదాఫ్ ఎజాబ్ అద్బుల్ రవూఫ్



మహారాష్ట్రకు చెందిన 17ఏండ్ల నదాఫ్ ఎజాజ్ అబ్దుల్ రవూఫ్.. నీటిలో మునిగిపోతున్న ఇద్దరు యువతులను కాపాడాడు. ఓ నలుగురు స్నేహితురాళ్లు సరదాగా నదిని చూడ్డానికి వచ్చారు. వారిలో ఒకామె కాలుజారి పడిపోగా.. రక్షించేందుకు మరో యువతి నదిలోకి దూకింది. వారిద్దరిని కాపాడేందుకు మరో ఇద్దరు కూడా నదిలోకి దూకారు. వీరి ఆర్తనాదాలు విన్న రవూఫ్, మరో ఇద్దరు స్థానికులు వారిని కాపాడే ప్రయత్నం చేశారు. అయితే రవూఫ్ కాపాడిన ఇద్దరు యువతులు ప్రాణాలతో బయటపడ్డారు.

లాల్ చందామా



మిజోరం రాష్ట్రానికి చెందిన 17 ఏళ్ల లాల్ చందమా.. నదిలో తన స్నేహితుడ్ని రక్షించి తన ప్రాణాలు కోల్పోయాడు. కొద్ది రోజులకు లాల్ చందమా మృతదేహాన్ని కనుగొని అంత్యక్రియలు నిర్వహించారు. తన సాహసానికి గుర్తుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ అవార్డును లాల్ తండ్రి అందుకున్నారు.

బైస్వా జాన్ పీలాంగ్



మేఘాలయకు చెందిన 14ఏండ్ల బైస్వాజాన్ పీలాంగ్ తల్లి బట్టలు ఉతికేందుకు చెరువుకు వెళ్లడంతో.. భోజనం వండుకునే క్రమంలో ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. మంటలు ఎగిసిపడుతున్నా లెక్కచేయకుండా తన తమ్ముడిని కాపాడాడు పీలాంగ్. అతని సాహసానికి బాపు గయధని అవార్డు వచ్చింది.

సమృద్ధి సుశీల్ శర్మ



గుజరాత్‌కు చెందిన 16 ఏండ్ల సమృద్ధి సుశీల్ శర్మ ధైర్యం మాటల్లో చెప్పలేనిది. ఓ రాత్రి సమృద్ధి నిద్రిస్తుండగా.. ఓ అగంతకుడు ఇంట్లోకి చొరబడ్డాడు. వెంటతెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడి చేశాడు. తలపై రెండుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. అయినా ఏమాత్రం భయకుండా వాడితో పోరాడి, వెంటబడి, అతన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించింది. ఆ తర్వాత ఆమెకు రెండు సర్జరీలు చేశారు.

లక్ష్మీయాదవ్



ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌కు చెందిన 16 ఏండ్ల లక్ష్మీయాదవ్.. ధైర్యం అనన్య సామాన్యం. ఎందుకంటే ముగ్గురు దుర్మార్గులు తనను అపహరించి, ఓ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేయబోతుండగా వారిపై తిరుగబడింది. ఆ ముగ్గురిని చితకబాది దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌లో ధైర్యంగా ఫిర్యాదు చేసి.. వారిని కటకటాలకు పంపింది.

మన్నా



నాగాలాండ్‌కు చెందిన 13 ఏండ్ల మన్నా.. క్రూరుడైన తన తండ్రిబారి నుంచి తమ్ముడిని, చెల్లెలిని కాపాడింది. తల్లి చనిపోయిన కొన్నాళ్లు ఆమె తండ్రి ముగ్గురు పిల్లల్నీ చంపాలనుకొని నిర్ణయించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మన్నా.. స్నేహితులైన కొన్యాక్, యోక్నీకి చెప్పింది. పథకం ప్రకారం మూడేళ్ల కొడుకును బెల్ట్‌తో చంపబోతుండగా వెనుకనుంచి వెళ్లి తండ్రిని కొట్టింది. ఆ సమయంలో గొడ్డలితో మన్నాను తండ్రి నరుకబోతుండగా.. కొన్యాక్, యోక్నీ అడ్డుకున్నారు. ఈ క్రమంలో మూడేళ్ల చుంబెన్‌కు గాయాలయ్యాయి. వీరు ముగ్గురు ధైర్యం చేసి తండ్రికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వీరి సాహసాన్ని గుర్తించిన ప్రభుత్వం.. ముగ్గురికీ సాహస అవార్డును అందించింది.

జోనొత్లుంగా



మిజోరం రాష్ట్రానికి చెందిన 16 ఏండ్ల జోనొత్లుంగా.. తన తండ్రిని ఎగులు దాడినుంచి కాపాడాడు. తండ్రీకొడుకులిద్దరూ కాయగూరలు తెచ్చేందుకు అడవికి వెళ్లడంతో ఓ ఎలుగుబంటి జోనుత్లుంగా తండ్రిపై దాడికి దిగింది. ముఖాన్ని తన బలమైన గోర్లతో రక్కడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఈ హఠాత్ పరిణామం నుంచి తేరుకున్న జోనొత్లుంగా ఎలాంటి ఆయుధాలు లేకుండానే ఆ ఎలుగుబంటిపై ఎదురుదాడి చేశాడు. జోనొత్లుంగా పోరాటానికి ఎలుగుబంటి పారిపోయింది. తర్వాత తన తండ్రికి వైద్యం అందించాడు.

పంకజ్ సెమ్వాల్



ఉత్తరాఖండ్‌కు చెందిన 16 ఏండ్ల పంకజ్ సెమ్వాల్.. చిరుత బారి నుంచి తన తల్లిని రక్షించాడు. ఒక రోజు తల్లి ఇంట్లో నిద్రిస్తుండగా ఓ చిరుతపులి మెరుపుదాడి చేసింది. కేకలు వేయడంతో మేల్కొన్న పంకజ్.. ఓ కర్రసాయంతో చిరుతపై పోరాడాడు. హోరాహోరి పోరులో పంకజ్‌కు కూడా గాయాలయ్యాయి. ఎంతో ధైర్యంతో చిరుతను కర్రతో కొట్టి పారదోలాడు.

మమతా దలై



ఒడిశాకు చెందిన 7 ఏండ్ల మమతా దలై తన చెల్లితో కలిసి స్థానికంగా ఉన్న చెరువులో స్నానానికి వెళ్లింది. అక్కడ ఓ మొసలి చెల్లెలు అసంతిపై దాడి చేసింది. మమతా ఏమాత్రం భయం లేకుండా మొసలిపైకి దూకి, దానితో పోరాడి.. తన చెల్లెలను కాపాడింది. ఆమె సాహసాన్ని మెచ్చిన ప్రభుత్వం బాపు గయధని అవార్డుకు ఎంపిక చేసింది.

చింగై వాంగ్సా



నాగాలాండ్‌కు చెందిన 17 ఏండ్ల వాంగ్సా మంటల్లో చిక్కుకున్న 74 ఏండ్ల వృద్ధుడ్ని కాపాడాడు. వాంగ్సా గ్రామస్తులందరూ చర్చికి వెళ్లడంతో వృద్ధుడున్న ఇంట్లో ప్రమాదవశాత్తు గ్యాస్‌లీకై మంటలు చెలరేగాయి. గమనించిన వాంగ్సా తలుపులు పగులగొట్టి ధైర్యంగా ఇంట్లోకి వెళ్లి వృద్ధుడ్ని కాపాడాడు.

సెబాస్టియన్ విన్సెంట్



కేరళకు చెందిన 13 ఏండ్ల సెబాస్టియన్ విన్సెంట్. బాపు గయధని పురస్కారానికి ఎంపికయ్యాడు. ఒకరోజు సెబాస్టియన్, తన స్నేహితుడు అభిజిత్ సైకిల్‌పై పాఠశాలకు వెళ్తున్నారు. అయితే అభిజిత్ పట్టాలు దాటే క్రమంలో కిందపడ్డాడు. వేగంగా రైలు వస్తున్నా లెక్కచేయకుండా సెబాస్టియన్.. అభిజిత్‌ను కాపాడాడు.

నేత్రావతి చవాన్



కర్ణాటకకు చెందిన 14 ఏండ్ల నేత్రావతి నీటిలో మునిగిపోతున్న ఇద్దరు బాలురను రక్షించే క్రమంలో ప్రాణాలు కోల్పోయింది. అయితే నేత్రావతి మరణానంతరం ఆమెకు గీతాచోప్రా అవార్డును ప్రకటించారు. మొదట16 ఏండ్ల యువకుడిని రక్షించింది. ఆ తర్వాత పదేళ్ల బాలుడ్ని కాపాడే ప్రయత్నంలో చెరువులో మునిగి చనిపోయింది.

పంకజ్‌కుమార్ మహంతా



బైతరణీ నదిలో మునిగిపోతున్న ముగ్గురు మహిళలను కాపాడాడు. నదిలో స్నానానికి వచ్చిన మహిళల్లో ఒకామె నీటిలో మునిగిపోయింది. ఆమెను కాపాడే ప్రయత్నంలో ఇద్దరూ మునిగిపోయారు. వీరి కేకలు విన్న పంకజ్.. నదిలో దూకి ఒకరి తర్వాత మరొకరిని.. ఇలా ముగ్గురినీ తెలివితో కాపాడాడు.

దారి కనుక్కోండి



మన యాస

సల్వ	:	చల్లదనం
యాట కూర	:	మేక మాంసం
గాలిపంక	:	ఫ్యాను
షాపలు	:	చేపలు
సొర్త పండుగ	:	పుష్పాలంకరణ
కుమ్మరావి	:	కుండలబట్టి
లోట	:	డబ్బ
ఇడుపు	:	గోడంచు
సౌరం	:	క్షవరం
శిబ్బి	:	తీగల జల్లెడ
తూటు	:	రంధ్రం
శిరాపురి	:	పరమాన్నం
ఏమది	:	ఏమిటి
లచ్చమ్మ	:	లక్ష్మమ్మ
రామండెం	:	రామాయణం





మంచిమాటలు..



- చెకుముకి రాయిలో నిప్పు ఉన్నట్లే, ప్రతి సవాలులోనూ విజయం దాగి ఉంటుంది. కఠిన శ్రమ అనే రాపిడి దాన్ని వెలుగులోకి తెస్తుంది.
- ఎవడున్నాడు మనకోసం అనిపిస్తుంది ఓడిన ప్రతిసారి. నేనున్నాను నీకెందుకు ప్రయత్నించు మరోసారి అంటుంది ఆత్మవిశ్వాసం. నమ్మినోడికి నమ్మకమే దేవుడు. నమ్మనోడికి ఆత్మవిశ్వాసమే జీవుడు.
- నేను అనే ఆత్మాభిమానం ఎంత ఎత్తుకు తీసుకువస్తుందో, నేనే అనే అహంకారం అంత పాతాళానికి దిగజారుస్తుంది.

చుక్కలు కలిపి రంగులు వేయండి



నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
ఆదివారం 28 జనవరి 2018


అశోక్, రవీందర్

దక్షిణాదిలో ఇదే తొలిసారి అంటున్నారు!

'భాగమతి' చిత్రానికి అత్యధిక ప్రారంభ వసూళు అందించి మంచి కంటెంట్ వుంటే హీరో, హీరోయిన్ అనే భేదం లేకుండా ఆదరిస్తామని నిరూపించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అన్నారు జి.అశోక్. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'భాగమతి'. అనుష్క ప్రధాన పాత్రలో నటించింది. యు.వి.క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ 'విడుదలైన తొలి రోజు మధ్యాహ్నం ఆట నుంచే థియేటర్‌లు పెంచుకునే స్థాయికి చేరడం, ఉదయం తొలి ఆట నుంచి హిట్ టాక్‌తో ప్రదర్శింపబడుతుండటం ఆనందంగా వుంది. అనుష్క, యు.వి.క్రియేషన్స్‌పై ప్రేక్షకులు పెట్టుకున్న నమ్మకాన్ని నిజమైనందుకు ఆనందిస్తున్నాను. విడుదలైన ప్రతీ సెంటర్ నుంచి భారీ వసూళ్లు సాధిస్తున్నదని చెబుతుంటే నోట మాట రావడం లేదు. సినిమాపై ప్రేక్షకుల్లో ఏర్పడిన క్రేజ్‌కు కారణం కళా దర్శకుడు రవీందర్ వేసిన భాగమతి బంగ్లా. ఈ బంగ్లా గురించి చాలా మంది ఫోన్‌లు చేసి అడుగుతున్నారు. మనిషి తెలివితేటలను మించిన దయ్యం వుందా? అనే ఆలోచనతో చేసిన సినిమా ఇది. సెకండ్ హాఫ్‌లో వచ్చే ట్విస్ట్ అందరినీ ఆకట్టుకుంటున్నది. అది నచ్చడం వల్లే అనుష్క, యు.వి.క్రియేషన్స్ వారు ఈ సినిమా చేశారు. టీమ్ సమిష్టి విజయమిది. మహిళా ప్రధాన చిత్రానికి ఈ స్థాయిలో ఓపెనింగ్స్ రావడం దక్షిణాదిలో ఇదే తొలిసారి అని వార్తలు వస్తున్నాయి' అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డిజైనర్ రవీందర్ పాల్గొన్నారు.


వల్లభనేని వంశీ, వినాయక్, వక్కంతం వంశీ, రవితేజ, సీరత్‌కపూర్, రాశీఖన్నా, విక్రమ్, వి.వి.రెడ్డి, నల్లమలుపు శ్రీనివాస్

నా లైఫ్‌లో అద్భుతం రవితేజ!

రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'టచ్ చేసి చూడు'. విక్రమ్ సిరికొండ దర్శకుడు. లక్ష్మీ నరసింహ ప్రొడక్షన్స్ పతాకంపై నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీ నిర్మిస్తున్నారు. రాశీఖన్నా, సీరత్‌కపూర్ కథానాయికలు. ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్ర ఆడియో, ప్రీరిలీజ్ వేడుక శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ఆడియోను వి.వి.వినాయక్ ఆవిష్కరించి తొలి ప్రతిని పారిశ్రామికవేత్త వి.వి.రెడ్డికి అందజేశారు. థియేట్రికల్ ట్రైలర్‌ను వి.వి.వినాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'దర్శకుడు విక్కీ నాతో కలిసి పనిచేశాడు. ఈ సినిమా రెండు రీళ్లు చూశాను. అద్భుతంగా అనిపించింది. దర్శకుడు విక్కీకి మంచి భవిష్యత్తు వుంది. రవితేజకు రోజురోజుకి వయసు తగ్గినట్లుగా అనిపిస్తున్నది. మంచి ఎనర్జీతో ఈ సినిమా చేశారు. ఆయన కెరీర్‌లో మరో మంచి చిత్రంగా మిగిలిపోతుంది' అన్నారు. దర్శకుడు విక్రమ్ సిరికొండ మాట్లాడుతూ 'నిర్మాత బుజ్జీతో నాకు పన్నెండు సంవత్సరాల అనుబంధం ఉంది. దర్శకుడిగా అవకాశం ఇచ్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు. ఈ చిత్రానికి వక్కంతం వంశీ అద్భుతమైన స్క్రిప్ట్ ఇచ్చాడు. రవితేజ తన ఎనర్జీతో ప్రతి ఒక్కరిని ప్రభావితం చేస్తారు. నా లైఫ్‌లో జరిగిన అద్భుతం రవితేజ. ఆయన సినిమాతో దర్శకుడిగా పరిచయం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. టైటిల్‌లో ఎంత పవర్ ఉందో సినిమాలో కూడా అంతే పవర్ వుంటుంది. ఇందులో చక్కటి సందేశం కూడా వుంది' అన్నారు. వల్లభనేని వంశీ మాట్లాడుతూ 'రవితేజతో 'కృష్ణ' సినిమా తీయాల్సింది. అనుకోకుండా ఛాన్స్ మిస్సయింది. పదేళ్ల కల ఇప్పుడు ఫలించింది' అన్నారు. రవితేజ మాట్లాడుతూ ' ఈ చిత్రానికి జామ్8 బృందం సమకూర్చిన పాటలు చాలా బాగున్నాయి. నిర్మాతలిద్దరూ నాకు మంచి మిత్రులు. వారికి ఈ సినిమాతో మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను. దర్శకుడు విక్రమ్ సిరికొండ నాకు 'మిరపకాయ్' సినిమా నుంచి తెలుసు. నా అంచనాలకు మించి సినిమాను బాగా తీశాడు. తెలుగు పరిశ్రమకు మరో మంచి దర్శకుడు దొరికాడు' అన్నారు. ఈ కార్యక్రమంలో రాశీఖన్నా, సీరత్‌కపూర్, వక్కంతం వంశీ, హరీష్‌శంకర్, పారిశ్రామికవేత్తలు రఘురామకృష్ణంరాజు, వి.వి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అలివేలు, శ్యామలాదేవి, కృష్ణంరాజు, శ్రీకాంత్, కరణం బాబ్జీ

ప్రజల్ని చైతన్యపరిచే సినిమాలు రావాలి!

శ్రీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆపరేషన్ 2019'. 'బివేర్ ఆఫ్ పబ్లిక్' అని ఉపశీర్షిక. కరణం బాబ్జి దర్శకుడు. యజ్ఞశెట్టి కథానాయిక. అలివేలమ్మ ప్రొడక్షన్స్ పతాకంపై అలివేలు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో నటుడు కృష్ణంరాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'శ్రీకాంత్ 'సింహగర్జన'లో నాకు తమ్ముడుగా నటించాడు. ఆ తరువాత 'నాన్నకు పెళ్లి' చిత్రంలో కొడుకుగా కనిపించాడు. తను మంచి నటుడే కాదు మంచి మనసున్న వ్యక్తి. గతంలో చేసిన 'ఆపరేషన్ దుర్యోధన' చిత్రం తనకు మంచి పేరు తెచ్చింది. తాజాగా వస్తున్న 'ఆపరేషన్ 2019' టీజర్ బాగుంది. 'బివేర్ ఆఫ్ పబ్లిక్' అనే ఉపశీర్షిక చూసిన తరువాత నాకు ఓ విషయం గుర్తొచ్చింది. కాకినాడ నుంచి లోక్‌సభ సభ్యుడిగా పోటీచేసి మంచి మెజారిటీతో గెలుపొందాను. ఆ తరువాత మా సొంతూరైన నర్సాపురం నుంచి పోటీచేసి అదే స్థాయిలో గెలుపొందాను. అక్కడ నేను చేసిన మంచి పనుల గురించి ప్రజలు ఇప్పటికీ చెప్పుకుంటారు. కానీ ఆ తరువాత రాజకీయాల్లోకి వ్యాపార వేత్తలు ప్రవేశించి ఓట్లు కొనడం ప్రారంభించారు. పబ్లిక్‌కు కూడా డబ్బుపై ఆశ పెరిగింది. కాబట్టి పబ్లిక్‌తో జాగ్రత్తగా వుండాలి. ప్రజల్ని చైతన్యపరిచే సినిమాలు రావాలి' అన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ 'కరణం బాబ్జీ దర్శకత్వంలో 'మెంటల్ పోలీస్' చేశాను. అయితే టైటిల్ సమస్య కారణంగా, రిలీజ్ అలస్యం కావడం వల్ల ఆ చిత్రానికి అనుకున్నంత పేరు రాలేదు. ఈ సారి కాంట్రవర్సీ లేకుండా సినిమా చేద్దాం అన్నాను. ఇందులో వివాదాస్పద అంశాలు వున్నా మంచి కంటెంట్ వుంది. ఖచ్చితంగా అందరికి నచ్చుతుందనే నమ్మకం ఉంది' అన్నారు. ఈ కార్యక్రమంలో కరణం బాబ్జీ, అలివేలు, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, నాగినీడు, శివకృష్ణ, దీక్షాపంత్, హరితేజ తదితరులు పాల్గొన్నారు.

నాన్న జోక్యం ఉండదు!

'సంగీత దర్శకుడిగా 'ఛలో' నా మూడవ చిత్రం. నాగశౌర్యతో కలిసి చేస్తున్న రెండవ సినిమా ఇది. సందర్భానికి తగ్గట్లుగా మంచి ట్యూన్‌లు కుదిరాయి. కాలేజీ నేపథ్యం కావడంతో పాటలన్నీ అద్భుతంగా కుదిరాయి' అన్నారు మహతి స్వర సాగర్. ఆయన సంగీతం అందించిన తాజా చిత్రం 'ఛలో'. నాగశౌర్య కథానాయకుడు. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు మహతి స్వర సాగర్ శనివారం పాత్రికేయులతో మాట్లాడుతూ ''ఛలో' పాటలకు మంచి స్పందన లభిస్తున్నది. ముఖ్యంగా 'చూసి చూడంగానే...' అంటూ సాగే పాట అందరినీ ఆకట్టుకుంటోంది. ముందు దీన్ని బిట్ సాంగ్‌గా


మహతి స్వర సాగర్

చేయాలనుకున్నాం. ఫుల్ సాంగ్‌గా ఎందుకు చేయకూడదని దర్శకుడు వెంకీ చెప్పడందో పూర్తిస్థాయి పాటగా మార్చడం జరిగింది. ఈ ఆల్బమ్‌లో నాకు బాగా నచ్చిన పాట ఇదే. దర్శకుడు పాటకు తగ్గ సన్నివేశాన్ని సృష్టించడం, నిర్మాణ సంస్థ ఎక్కడా రాజీపడకపోవటం.. ఇలా అన్నీ కలిసొచ్చి పాటలు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నాయి. ఆడియో విడుదలైన తరువాత చాలా మంది నాన్నగారికి ఫోన్ చేసి అభినందించడం ఆనందంగా వుంది. నాపై నాన్న ప్రభావం పడకుండా నా వంతు ప్రయత్నిస్తున్నాను. నా వర్క్‌లో నాన్న జోక్యం చేసుకోరు. నా కంటూ ఓ ప్రత్యేకత వుండాలని అనుకుంటాను. నాదంటూ ఓ స్టైల్‌ను ఏర్పరచుకోవాలనేదే నా కోరిక. ప్రేమకథా చిత్రాలంటే ఎక్కువగా ఇష్టపడతాను. నేపథ్య సంగీతం అనేది ఓ ప్రత్యేకమైన కళ. బ్యాగ్రౌండ్ స్కోర్ అందించడంలో ఒక్కొరిది ఒక్కో శైలి. ఈ విషయంలో నాకున్న గ్రేటెస్ట్ టీచర్ నాన్నగారే. ఆలస్యంగా తెరంగేట్రం చేశాను అనేది కరెక్ట్ కాదు. ఏది ఎప్పుడు జరగాలో అప్పుడే జరుగుతుంది. నాన్నగారితో పాటు ఎం.ఎం.కీరవాణి, కల్యాణీ మాలిక్ వంటి సంగీత దర్శకుల వద్ద దాదాపు 160 చిత్రాలకు పనిచేశాను. ఒక్కొక్కరి దగ్గర ఒక్కో ప్రత్యేకతను నేర్చుకున్నాను. యువన్ శంకర్‌రాజాకు వీరాభిమానిని. ప్రస్తుతం కన్నడంలో రీమేక్ అవుతున్న 'కుమార్ 21ఎఫ్'కు సంగీతం అందిస్తున్నాను. తెలుగులో ఇంకా ఏ చిత్రం అంగీకరించలేదు' అని తెలిపారు.

చేతిలో చెయ్యేసి..

అరుణ్ రాహుల్. అంజన జంటగా నటిస్తున్న 'చేతిలో చెయ్యేసి చెప్పుబావ' చిత్రం ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. కట్ల రాజేంద్రప్రసాద్ దర్శకుడు. కె.జె.రాజేష్ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి సాయివెంకట్ క్లాప్ నిచ్చారు. దర్శకుడు మాట్లాడుతూ 'ప్రేమను దక్కించుకోలేని ఓ జంట మరు జన్మలో ఎలా ఒక్కటయ్యారు? వారి పగను ఎలా తీర్చుకున్నారు? అనే ఆసక్తికర అంశాల నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఫిబ్రవరి నెలాఖరు నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి ఏప్రిల్ వరకు పూర్తి చేస్తాం. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సమ్మర్‌లో చిత్రాన్ని విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు.


అంజన

ఆశాభోస్లేకు యష్ చోప్రా అవార్డు



డా.టి.సుబ్బిరామిరెడ్డి ఫౌండేషన్ తరుపున 2013 నుంచి ప్రముఖ బాలీవుడ్ దర్శకనిర్మాత యష్ చోప్రా మెమోరియల్ అవార్డును అందజేస్తున్నారు. 2017 సంవత్సరానికి గానూ ఈ అవార్డును ప్రముఖ నేపథ్య గాయని, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత ఆశాభోస్లేకు అందజేయనున్నట్లు జ్యూరి సభ్యులు శనివారం ముంబైలో ప్రకటించారు. గతంలో ఈ అవార్డును అమీర్‌ఖాన్, షారుక్‌ఖాన్, లతా మంగేష్కర్, అమితాబ్‌బచ్చన్, రేఖ అందుకున్నారు. ముంబైలో ఫిబ్రవరి 16న ఈ వేడుక జరుగనుంది. మహారాష్ట్ర గవర్నర్ సి.హెచ్. విద్యాసాగర్‌రావు, లతా మంగేష్కర్ సంయుక్తంగా ఈ అవార్డును ఆశాభోస్లేకు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో అమీర్‌ఖాన్, షారుక్‌ఖాన్, శ్రీదేవి, జయప్రద తదితర నటీనటులు పాల్గొననున్నారు.

చైన్‌స్నాచర్ షిండే అరెస్ట్


స్నాచర్ షిండే అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సైబరాబాద్ సీపీ సందీప్ శాండిల్య

- రూ.15 లక్షల సొత్తు స్వాధీనం
- సైబరాబాద్‌లో వీడిన 18 కేసుల మిస్టరీ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్ షిండేను సైబరాబాద్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. దీంతో ఆరు నెలలుగా సైబరాబాద్‌లో జరిగిన 18 చైన్ స్నాచింగ్ కేసుల మిస్టరీ వీడిపోయింది. హైదరాబాద్‌లో వరుస స్నాచింగ్‌లకు పాల్పడుతున్న అమోల్ బాలా సాహెబ్ షిండేను పట్టుకోవడంలో పోలీసులు టెక్నాలజీ కన్నా మానవ మేథస్సుపై ఎక్కువగా ఆధారపడ్డారు. ఇన్‌ఫార్మర్ వ్యవస్థను వినియోగించుకోవడంతో మరో సారి స్నాచింగ్‌కు పాల్పడేందుకు నగరానికి వస్తున్న షిండేను మార్గ మధ్యంలోనే పట్టుకొన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ సందీప్ శాండిల్య వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని పర్బనీకి చెందిన అమోల్ బాలా సాహెబ్(24) ఔరంగాబాద్, లాతూర్ ప్రాంతాల్లో 9 స్నాచింగ్‌లకు పాల్పడి అక్కడి పోలీసులకు దొరికిపోయాడు. లాతూర్ జైలులో ఉన్నప్పుడు సంయజ్ హాకాని జాదవ్ పరిచయమై చైన్ స్నాచింగ్‌లకు తెలుగు రాష్ట్రాలు అనువుగా ఉంటాయని సూచించడంతో, షిండే హైదరాబాద్‌కు మకాం మార్చాడు. తన స్నేహితుల పేరుమీద రెండు బైక్‌లను కొనుగోలు చేసి వాటి ద్వారా నాందేడ్, నిజామాబాద్, చందానగర్, మియాపూర్, కేపీహెచ్‌బీలకు వచ్చి వరుస స్నాచింగ్‌లకు తెగబడ్డాడు. వినాయక చవితి, దసరా, దీపావళి, సంక్రాంతి సమయాల్లో మొత్తం 18 స్నాచింగ్‌లు చేశాడు. షిండే చైన్ స్నాచింగ్‌కు సంబంధించిన దృశ్యాలు సీసీకెమెరాల్లో లభించినా అతనిని గుర్తించడం అసాధ్యంగా మారింది. దీంతో 200 మంది పోలీస్ సిబ్బంది ఘటన జరిగిన ప్రదేశం నుంచి అతను ఏ రూట్‌లో ప్రయాణించి ఉండొచ్చనే అంచనాతో దాదాపు వందల సీసీ కెమెరాలను జల్లెడ పట్టారు. చివరకు సైబరాబాద్ క్రైం డీసీపీ జానకీ షర్మిలకు కర్ణాటక బీదర్‌లో ఉన్న ఓ ఇన్‌ఫార్మర్ కీలక సమాచారం ఇవ్వడంతో షిండే ఆచూకీ లభించింది. దీంతో విచారణను సాగించడంతో షిండే మరోసారి సైబరాబాద్‌లో స్నాచింగ్‌లకు పాల్పడేందుకు వస్తున్న తరుణంలో అతనిని అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ. 15 లక్షల విలువైన 47 తులాల బంగారు ఆభరణాలతోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్, క్రైం డీసీపీ జానకీ షర్మిల, ఎస్‌వోటీ అదనపు డీసీపీ దయానంద్‌రెడ్డి, కూకట్‌పల్లి ఏసీపీ భుజంగరావు పాల్గొన్నారు. స్నాచర్‌ను పట్టుకున్న క్రైం డీసీపీ, మాదాపూర్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కుమార్, కానిస్టేబుల్ అనీల్‌గౌడ్, ఇతర సిబ్బందిని సీపీ అభినందించి రివార్డులను అందించారు.

2.53 కోట్లు రద్దయిన నోట్లు స్వాధీనం

బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టివేత • ముగ్గురు నిందితుల అరెస్ట్


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సత్యనారాయణ

చార్మినార్: రద్దయిన నోట్లను మారుస్తామని చెప్పి చిరువ్యాపారుల వద్ద నుంచి సేకరించి హైదరాబాద్‌కు తరలిస్తూ ఓ ముఠా పోలీసులకు చిక్కింది. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హైదరాబాద్ దక్షిణ మండల డీసీపీ సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. బెంగళూరుకు చెందిన అమిత్ బగాడియా(27) అక్కడి చిరువ్యాపారుల వద్ద ఉన్న రద్దయిన కరెన్సీని మార్చి ఇస్తానని నమ్మించి దాదాపు రూ.2.53 కోట్లు రద్దయిన నోట్లను సేకరించారు. అనంతరం అమిత్ హైదరాబాద్ శాలిబండకు చెందిన కాటం రాంరాజును సంప్రదించి నోట్లను మార్చితే 10 శాతం కమీషన్ ఇస్తానని చెప్పాడు. కాటం రాంరాజు బేగంబజార్‌కు చెందిన వ్యాపారులు మురళీలాల్(57), విష్ణు భటికి అమిత్‌ను పరిచయం చేశాడు. కమీషన్ వస్తుందని ఈ ముగ్గురూ బెంగళూరు నుంచి రద్దయిన నోట్లను తీసుకొని ఓ మారుతి వ్యాన్‌లో హైదరాబాద్‌కు బయలుదేరారు. శుక్రవారం రాత్రి బహదూర్‌పుర పోలీసులు హసన్‌నగర్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీసులకు గమనించిన నిందితులు వ్యాన్ వేగాన్ని పెంచారు. పోలీసులు మారుతీ వ్యాన్‌ను వెంబడించి పట్టుకొని తనిఖీ చేయగా రూ.2.53 కోట్లు లభ్యమయ్యాయి. నిందితులను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. సమావేశంలో అదనపు డీసీపీ గౌస్ మోహినుద్దీన్, చార్మినార్ ఏసీపీ అంజయ్య, బహదుర్‌పుర ఇన్‌స్పెక్టర్ ఖలీల్‌పాషా ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



లైన్‌మన్ వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ రేంజ్ డీఎస్పీ సూర్యనారాయణ

ఏసీబీకి చిక్కిన కుంట్లూరు లైన్‌మన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ పెద్ద అంబర్‌పేట: విద్యుత్ మీటర్ కనెక్షన్ కోసం రూ.3 వేలు లంచం తీసుకుంటూ రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం పెద్ద అంబర్‌పేట సెక్షన్, కుంట్లూరు గ్రామ లైన్‌మన్ బీ వెంకటేశ్ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు. ఏసీబీ డీజీ పూర్ణచంద్రరావు, రంగారెడ్డి జిల్లా రేంజ్ డీఎస్పీ సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆరు నెలల కిందట రాము అనే కాంట్రాక్టర్ కుంట్లూరుకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి విద్యుత్ పరికరాలు అమర్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా నియమాల ప్రకారం చెల్లించాల్సిన మొత్తం డబ్బులు చెల్లించారు. విద్యుత్ లైన్‌మన్ వెంకటేశ్ మీటర్‌ను అమర్చేందుకు రేపు, మాపు అంటూ దాటవేస్తున్నాడు. చివరికి ఈనెల మొదటి వారంలో రూ.3 వేలు ఇస్తేనే మీటర్ అమర్చుతానని లైన్‌మన్ చెప్పాడు. దీంతో కాంట్రాక్టర్ రాము నాలుగు రోజుల కిందట ఏసీబీని ఆశ్రయించారు. వారి సూచన మేరకు శనివారం కుంట్లూర్‌లోని వార్డు కార్యాలయం సమీపంలో లైన్‌మన్‌కు రాము డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లైన్‌మన్‌ను అరెస్ట్ చేశామని డీజీ పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ దాడిలో సీఐలు నవీన్, రఘు, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రగతి పట్టణాలు

మంత్రి కేటీఆర్ చొరవతో మౌలిక సదుపాయాల్లో గణనీయ మెరుగుదల



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని పట్టణాల్లో గత మూడేండ్ల నుంచి మౌలిక సదుపాయాల్లో స్పష్టమైన పురోగతి కనిపిస్తున్నది. పట్టణ ప్రజలకు కీలకమైన తాగునీరు సులభంగా లభిస్తున్నది. వ్యక్తిగత మరుగుదొడ్ల సంఖ్య రెట్టింపయ్యింది. మున్సిపాలిటీల్లో 24 గంటల్లో పలు సమస్యలు పరిష్కారమవుతున్నాయి. పట్టణ ప్రజలు రాకపోకలను సులువుగా సాగించేందుకు రహదారుల వ్యవస్థ ఉమ్మడి రాష్ట్రంతో పోల్చితే మెరుగైంది. పట్టణాలను హరితమయం చేసే ప్రక్రియ కొనసాగుతున్నది. రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు మున్సిపాలిటీలకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. పురపాలకశాఖ అధికారులు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని.. ప్రజాసమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకూడదని ఆదేశాలు జారీచేశారు. పట్టణాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పురపాలికల్లో స్పష్టమైన మార్పు ఆవిష్కృతమైంది. మునుపటితో పోల్చితే పట్టణ సౌకర్యాల్లో ఘనమైన పురోగతి కనిపిస్తున్నది. 31 జిల్లాల ప్రజలకు తాగునీటిని అందించడానికి ప్రభుత్వం మిషన్ భగీరథ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. కేవలం పట్టణాలే కాకుండా గ్రామీణ ప్రజల తాగునీటి అవసరాలనూ తీర్చాలన్నది ప్రభుత్వ ఆశయం. తాగునీటి కోసం మైళ్ల కొద్ది దూరం నడిచే దుస్థితిని దూరం చేయడానికి.. సుమారు 1.30 లక్షల కిలోమీటర్ల మేరకు పైప్‌లైన్లను వేయాలని ప్రభుత్వం మొదట్లోనే నిర్ణయించింది. కలుషితంకాని తాగునీరు ప్రజలకు అందితే.. ఆరోగ్య ప్రమాణాలు మెరుగవ్వడమే కాకుండా ఆర్థిక పరిపుష్టి సాధ్యమవుతుందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించింది. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రభుత్వం రాష్ట్ర ఆవిర్భావం నుంచి కఠోరంగా శ్రమిస్తున్నది. హైదరాబాద్ వాటర్ బోర్డు పరిధిలో మంచినీటి సరఫరా 85 నుంచి 95%.. ఇతర పట్టణాల్లో 50 నుంచి 65% పెరిగింది. తలసరి నీటి సరఫరా (ఎల్పీడీ) 100 నుంచి 135 లీటర్లకు పెరిగింది. వ్యక్తిగత మంచినీటి కనెక్షన్ల సంఖ్య దాదాపు లక్షా పదిహేను వేలకు చేరుకొన్నది. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో సగటు తాగునీటి సరఫరా 70 నుంచి 120 ఎల్పీడీలకు చేరుకోవడం విశేషం.

పెరిగిన గ్రీన్‌కవర్

పట్టణాలను హరితమయం చేయడానికి పురపాలకశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 24 శాతమున్న గ్రీన్ కవర్‌ను 33 శాతానికి పెంచాలన్న బృహత్ లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకున్నది. తెలంగాణకు హరితహారంలో భాగంగా పట్టణాల్లో దాదాపు 1.54 కోట్ల మొక్కలను నాటింది. జీహెచ్‌ఎంసీ మినహా ఇతర పట్టణాల్లో గ్రీన్‌కవర్ రెండు నుంచి మూడు శాతం పెరిగింది. 2024 నాటికి ఇది పది శాతానికి చేరుకోవాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. తెలంగాణ రాష్ట్రం వస్తే అంధకారం అవుతుందనే గోబెల్స్ ప్రచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా తిప్పికొట్టగలిగింది. రాష్ట్రం ఏర్పడిన కేవలం ఆరునెలల్లోనే గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు 24 గంటలు విద్యుత్తును అందించడంలో ఘనమైన విజయాన్ని సాధించింది. దీంతో, మొత్తం పట్టణాల్లో ఎల్‌ఈడీ వీధి దీపాల సంఖ్య రెట్టింపయ్యింది. ప్రస్తుతం 97 శాతం మేరకు రహదారులపై వీధి దీపాలను ఏర్పాటుచేశారు. పట్టణాల్లోని 45.8 శాతం ప్రజానీకం బీటీ రోడ్లపై ప్రయాణం చేయగలుగుతున్నారు. పట్టణాల్లో 43.19 శాతం ప్రజలకు సీసీ రోడ్లు అందుబాటులోకొచ్చాయి. ఇక పట్టణాల్లో పలు ప్రజాసమస్యలకు ఇరవై నాలుగు గంటల్లోనే పరిష్కారం లభిస్తున్నది. గతంలో ఏ సమస్యా.. ఇంత త్వరగా తీరేది కాదు. ప్రస్తుతం 24 గంటల్లోనే 62 శాతం సమస్యలకు పరిష్కారం లభిస్తున్నది.

రహదారుల పక్కన 1,200 మరుగుదొడ్ల నిర్మాణం

మంత్రి కే తారకరామారావు పురపాలకశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత.. ఓడీఎఫ్ (బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతాలు) మీద ప్రధానంగా దృష్టి సారించారు. దీంతో పట్టణాల్లో 70 నుంచి 75 శాతంగా ఉన్న వ్యక్తిగత మరుగుదొడ్లు ప్రస్తుతం 90 శాతానికి చేరుకొన్నాయి. ఇప్పటికే రాష్ట్రంలోని పన్నెండు పట్టణాలను కేంద్రం ఓడీఎఫ్‌లుగా ప్రకటించింది. రాష్ట్రంలో పట్టణాల్లోని దాదాపు రెండువేల కిలోమీటర్ల విస్తీర్ణం గల మొత్తం రహదారుల పక్కన గతంలో కేవలం 400 మరుగుదొడ్లు మాత్రమే ఉండేవి. అవి ప్రస్తుతం పన్నెండు వందలకు చేరుకున్నాయి. కమ్యూనిటీ టాయిలెట్లు, పెట్రోల్ పంపులు, ప్రధాన రహదారు వెంబడి మరుగుదొడ్ల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం మూడేండ్ల నుంచి ప్రత్యేక దృష్టి సారించడం వల్లే ఇది సాధ్యమైంది. వచ్చే ఆరేండ్లలో రాష్ట్రంలోని మున్సిపాల్టీలన్నింటినీ బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతాలుగా ప్రకటించాలన్న లక్ష్యాన్ని మంత్రి కే తారకరామారావు పురపాలకశాఖకు నిర్దేశించారు.

ఘనవ్యర్థాల నిర్వహణ

కేంద్ర ప్రభుత్వం ఘనవ్యర్థాల నిర్వహణపై 2015లో ప్రత్యేక మార్గదర్శకాలను విడుదలచేసింది. ఇందుకనుగుణంగా రాష్ట్ర పురపాలకశాఖ ఘనవ్యర్థాల నిర్వహణకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చింది. పట్టణాల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరణలో ఆశించిన స్థాయి కంటే అధిక పురోగతి కనిపిస్తున్నది. శాస్త్రీయ పద్ధతిలో ఘనవ్యర్థాల నిర్వహణ మెరుగైంది. 2014లో 3,750 టన్నుల వ్యర్థాలను ప్రతిరోజు రీసైకిల్ చేయగా.. 2017 నాటికి 4,545 టన్నులకు చేరుకున్నది. వ్యర్థాలను రీసైకిల్ చేసే ప్రక్రియ 55 నుంచి 65 శాతానికి పెరిగింది. జీహెచ్‌ఎంసీ, ఇతర పట్టణాల్లో వీధి దీపాలను ఎల్‌ఈడీలుగా మార్చే ప్రక్రియ 80 నుంచి 91 శాతానికి పెరిగింది. అతిత్వరలో ఇది వంద శాతం కానున్నది.

వాణిజ్య

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	77.00
రిటైల్ లైవ్	99.00
డ్రెస్డ్	144.00
స్కిన్‌లెస్	163.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	380-00
రంగారెడ్డి	380-00
మెదక్	380-00
కరీంనగర్	382-00
వరంగల్	382-00
రిటైల్ ప్రైస్	4-40

WWW.NTNEWS.COM
నమస్తే తెలంగాణ

ఒకే ఒక్కడు

- పన్ను ఎగవేతలను పసిగట్టడంలో దిట్ట
- 25 ఏండ్లలో పట్టుకున్న కేసుల విలువ రూ.962 కోట్లు
- డీజీజీఎస్‌టీఐ అధికారికి రాష్ట్రపతి అవార్డు

న్యూఢిల్లీ, జనవరి 27: రవి దత్ శంకర్. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ ఇంటిలిజెన్స్ (డీజీజీఎస్‌టీఐ)లో ఓ అధికారి. అయితే ఏంటి అనుకుంటున్నారా?.. పన్ను ఎగవేతలను పసిగట్టడంలో ఈయన దిట్ట. 25 ఏండ్ల తన ఉద్యోగ జీవితంలో ఈ అధికారి పట్టుకున్న కేసుల విలువ రూ.962 కోట్లు మరి. అందుకే రాష్ట్రపతి అవార్డు దక్కింది. శనివారం ఇక్కడ జరిగిన అవార్డుల కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తరఫున జైట్లీ చేతులమీదుగా రవి దత్ శంకర్ అవార్డు తీసుకున్నారు. 1992లో డీజీజీఎస్‌టీఐలోకి వచ్చిన శంకర్.. అంచెలంచెలుగా ఎదిగి ఇంటిలిజెన్స్ అధికారి హోదాకు చేరుకున్నారు. తన ఈ పాతికేండ్ల ఉద్యోగ నిర్వహణలో రూ.961.92 కోట్ల విలువైన సెంట్రల్ ఎక్సైజ్ సుంకం, సేవా పన్ను ఎగవేత కేసులను కనిపెట్టారు. ఈ క్రమంలోనే ఆయన అందించిన అత్యుత్తమ సేవలకుగాను రాష్ట్రపతి అవార్డు సొంతమైంది. ఈ అవార్డుపట్ల శంకర్ ఆనందం వ్యక్తం చేశారు. ఆయన నిజాయితీ, సేవాతత్పరతను ఓ ప్రకటనలో డీజీజీఎస్‌టీఐ కూడా కొనియాడింది. కాగా, ఇంతకుముందున్న డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సెంట్రల్ ఎక్సైజ్ ఇంటిలిజెన్స్‌నే జీఎస్టీ అమలు తర్వాత డీజీజీఎస్‌టీఐగా మార్చారు.

జీఎస్టీని ఇంకా తగ్గిస్తాం

- కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ, జనవరి 27:

వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను ఇంకా తగ్గిస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. అలాగే ఇతర దేశాలతో పోల్చితే భారత్‌లో జీఎస్టీ స్థిరీకరణ చాలా తొందరగానే జరిగిందన్నారు. అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం సందర్భంగా శనివారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న జైట్లీ.. దేశీయ పరోక్ష పన్ను వ్యవస్థ సమూల మార్పునకు జీఎస్టీతో నాంది పలికామని, ముున్ముందు జీఎస్టీ రేట్లను మరింతగా హేతుబద్ధం చేస్తామని స్పష్టం చేశారు. గతేడాది నవంబర్‌లో జీఎస్టీ మండలి నిర్వహించిన సమావేశంలో లగ్జరీ ఉత్పత్తులపై మాత్రమే గరిష్ఠంగా 28 శాతం పన్ను వేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే 178 వస్తువులను 28 శాతం నుంచి 18 శాతం పన్ను శ్రేణిలోకి తెచ్చింది కేంద్రం. మరో 13 వస్తువులను 18 శాతం నుంచి 12 శాతానికి, ఎనిమిదింటిని 12 శాతం నుంచి 5 శాతానికి, ఆరింటిని 18 శాతం నుంచి 5 శాతం పన్నుల్లోకి మార్చారు. ఇక 5 శాతం శ్లాబులోగల 6 వస్తువులపై మొత్తంగా జీఎస్టీనే ఎత్తివేశారు. ఈ నేపథ్యంలో నవంబర్ జీఎస్టీ వసూళ్లు మరింతగా క్షీణించి రూ.80,808 కోట్లకే పరిమితమయ్యాయి. అక్టోబర్‌లో రూ.83,000 కోట్లుగా ఉండగా, అంతకుముందు నెల సెప్టెంబర్‌లో రూ.92,150 కోట్లకుపైగా నమోదవడం గమనార్హం. అయితే గత నెల డిసెంబర్‌లో మళ్లీ రూ.86,703 కోట్లకు పెరిగాయి. ఒకే దేశం.. ఒకే మార్కెట్.. ఒకే పన్ను లక్ష్యంతో దేశవ్యాప్తంగా గతేడాది జూలై 1 నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ఎక్సైజ్ సుంకం, సేవా పన్ను, విలువ ఆధారిత పన్ను (వ్యాట్) తదితర పన్నెండుకుపైగా పన్నులను ఒక్కటిగా చేస్తూ పరిచయమైందీ పరోక్ష పన్ను. 1,200లకుపైగా వస్తువులు, 500లకుపైగా సేవలపై దీన్ని విధిస్తున్నారు. 0, 5, 12, 18, 28 శ్లాబుల్లో ఈ పన్ను వసూళ్లు జరుగుతుండగా, విద్య, వైద్యం, తాజా కూరగాయలు, ఆహార పదార్థాలు తదితర కొన్ని ఉత్పత్తులు, సేవలను పన్ను నుంచి మినహాయించారు. అయితే బంగారంపై 3 శాతం, ముడి వజ్రాలపై 0.25 శాతం చొప్పున ప్రత్యేకంగా పన్ను వేస్తున్నారు.


అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం సందర్భంగా డీజీసీఈఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ ప్రిన్సిపల్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ సత్య నారాయణ్ షాకు రాష్ట్రపతి ప్రశంసా పత్రాన్ని అందచేస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ. చిత్రంలో ఆ శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా, సీబీఈసీ చైర్‌పర్సన్ వనజ సర్న

సజావుగా ఈ-వే బిల్లుల ట్రయల్స్

ఈ నెల మధ్యమం నుంచి మొదలైన ఎలక్ట్రానిక్ వే (ఈ-వే) బిల్లుల ట్రయల్స్ సజావుగా సాగుతున్నాయని జీఎస్టీ నెట్‌వర్క్ సీఈవో ప్రకాశ్ కుమార్ తెలిపారు. వచ్చే నెల 1 నుంచి రాష్ట్రాల మధ్య సరకు రవాణాకు ఈ-వే బిల్లు తప్పనిసరి కానున్నది. రూ.50,000లకు మించి విలువైన వస్తువుల రవాణా కోసం బిల్లు తీసుకోవాల్సిందే. రాష్ట్రం లోపల కూడా సరకు రవాణాపై జూన్ 1 నుంచి ఈ-వే బిల్లు అవసరం కానుండగా, 10 కిలోమీటర్లు మించి రవాణా చేయాల్సివస్తేనే ఈ బిల్లు కావాల్సి ఉంటుంది. ఇందుకు ఇప్పటివరకు 15 రాష్ట్రాలు అంగీకరించాయని ప్రకాశ్ కుమార్ చెప్పారు. దేశంలో వ్యాపార నిర్వహణను సులభతరం చేయడానికి ఈ-వే బిల్లులు దోహదపడగలవన్నారు. ఈ-ఫైలింగ్‌తో ఈ-వే బిల్లులను జీఎస్టీ నెట్‌వర్క్ అనుసంధానిస్తున్నదన్నారు.

టాప్-50లోకి భారత్ వెళ్లగలదు!

ప్రపంచ బ్యాంకు సులభతర వ్యాపార నిర్వహణ (ఈవోడీబీ) సూచీలో భారత్ ర్యాంకు టాప్-50లో రాగలదన్న ధీమాను జైట్లీ వెలిబుచ్చారు. పన్నుల విభాగంతోపాటు ఇతర కీలక శాఖల సహకారం, ప్రభావవంతమైన సంస్కరణలు, అత్యుత్తమ ప్రభుత్వ విధానాలతో ఇది సాధ్యమేనన్నారు. మూడేండ్లలో 142 నుంచి 100వ స్థానానికి మెరుగుపడిన భారత్ ఈవోడీబీ ర్యాంకు.. కేవలం గతేడాదే 30 స్థానాలు ఎగబాకిన సంగతి విదితమే. ఈ క్రమంలోనే టాప్-50 దేశాల్లో భారత్ ఉండాలన్న లక్ష్యాన్ని ఆర్థిక శాఖకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అప్పగించారని జైట్లీ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. భూసేకరణ, భవన నిర్మాణాలకు వేగవంతమైన మున్సిపల్ అనుమతులు, సరిహద్దుల వెంట వాణిజ్యావకాశాలను పెంచడం, సరళతరమైన పన్నుల విధానాన్ని ఏర్పాటు చేయడం వంటి వాటితో భారత్ ఈవోడీబీ ర్యాంకును చాలా రెట్లు మెరుగుపరుచవచ్చన్నారు. ఇందులో భాగంగానే కేంద్ర ఎక్సైజ్, కస్టమ్స్ బోర్డు రూపొందించిన ఐసీఈటీఆర్ఏకే, ఐసీఈటీపీబీ టెక్నాలజీ వేదికలను ఇప్పటికే జైట్లీ ఆవిష్కరించారు.



సబ్సిడీల అజెండా మారేనా?

ఈసారి బడ్జెట్‌లో జైట్లీ కొత్త పంథా!

వ్యవసాయ, గ్రామీణ రంగాలకు అధిక ప్రాధాన్యం!!

న్యూఢిల్లీ, జనవరి 27:

సార్వత్రిక ఎన్నికలకు ముందు కేంద్ర బడ్జెట్‌లో భారీగా సబ్సిడీలను ప్రకటించడం ఏ ప్రభుత్వ హయాంలోనైనా ఆర్థిక మంత్రులకు 'సాంప్రదాయం'గా వస్తున్నది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కూడా ఆరంభంలో ఇదే సాంప్రదాయాన్ని కొనసాగించినప్పటికీ గత ఏడాది నుంచి ఈ విషయంలో రూటు మార్చింది. 2014-15 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రభుత్వ మొత్తం వ్యయంలో 15.52 శాతంగా ఉన్న సబ్సిడీలు 2017-18లో 11.2 శాతానికి తగ్గడమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. 2014లో మోదీ సర్కారు అధికారంలోకి రావడానికి కేవలం రెండేళ్ల ముందు ఈ సబ్సిడీలు అత్యంత తారాస్థాయికి చేరాయి. అయితే ఈ ఏడాది గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ మరోసారి అధికారాన్ని నిలబెట్టుకున్నప్పటికీ ఆ ఫలితాలు కమలనాథులకు అనుకున్నంత సంతృప్తిని కలిగించలేదు. ఈ ఎన్నికల సందర్భంగా గుజరాత్ గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీకి కొంతమేర ఎదురుగాలి వీయడమే ఇందుకు కారణం. దీనితో పాటు గత కొంత కాలం నుంచి తరుచుగా రైతు ఉద్యమాలు జరుగుతున్న మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్ లాంటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందే అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఈసారి బడ్జెట్‌లో 'విభిన్నమైన మార్గాన్ని' అనుసరించే అవకాశం కనిపిస్తున్నది. ఫిబ్రవరి 1వ తేదీన పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ఈ బడ్జెట్ రైతులకు మరింత లబ్ధిని చేకూర్చేదిగా ఉండవచ్చని, మార్కెట్ సంస్కరణల ద్వారా వ్యవసాయ దిగుబడులకు మంచి ధరలు లభించేలా చూడటం, అన్నదాతలకు మెరుగైన రుణ సదుపాయాలను కల్పించడం, పంటల బీమాను మరింత విస్తరించడం వంటి అంశాలపై జైట్లీ ఈసారి ఎక్కువగా దృష్టి కేంద్రీకరించవచ్చన్న అభిప్రాయం చాలా బలంగా వినిపిస్తున్నది. ఇదే గనుక జరిగితే ఈసారి బడ్జెట్‌లో సబ్సిడీల వాటా పెరుగుతుంది. గ్రామీణ రంగానికి సబ్సిడీలు ఇవ్వడంపై మోదీ ప్రభుత్వం దృష్టి సారించినట్లయితే బడ్జెట్ ప్రసంగంలో 'వ్యవసాయం' అనే పదాన్ని జైట్లీ పదేపదే ఉచ్ఛరించడం ఖాయం. స్వతంత్ర భారతావనిలో 1960వ దశకం మధ్య వరకూ కేంద్ర ఆర్థిక మంత్రుల బడ్జెట్ ప్రసంగాల్లో 'వ్యవసాయం' అనే మాట అత్యంత అరుదుగా వినిపించేది. 1965లో అప్పటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి 'జై జవాన్, జై కిసాన్' అని నినదించడంతో ఈ ధోరణి మారినప్పటికీ, కొంత కాలానికే పరిమితమైంది. ఆ తర్వాత నుంచి బడ్జెట్ ప్రసంగాల్లో వ్యవసాయ అజెండా గురించి అన్యమనస్కంగానే ప్రస్తావించిన కేంద్ర పాలకులు.. గత కొన్నేండ్ల నుంచి గ్రామీణ రంగం గురించి వల్లె వేస్తున్నారు.

ఐడియాలో 100 శాతం ఎఫ్‌డీఐ!

కేంద్రాన్ని కోరుతున్న సంస్థ

న్యూఢిల్లీ, జనవరి 27: దేశీయ మూడో అతిపెద్ద టెలికం సంస్థ ఐడియాలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను అనుమతించేదానిపై ఆ సంస్థ కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించింది. ఇందుకు సంబంధించి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీయల్ పాలసీ అండ్ ప్రమోషన్(డీఐపీపీ)కూ దరఖాస్తు చేసుకున్నది. డిసెంబర్‌కల్లా కంపెనీలో విదేశీ పెట్టుబడిదారుల వాటా 27 శాతంగా ఉంది. కాగా, టెలికం కంపెనీల్లో 100 శాతం ఎఫ్‌డీఐకి ఇటీవల కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా, గతంలో 49 శాతానికే అనుమతి ఉన్నది. అయితే ఆటోమేటిక్ రూట్‌లో ఈ పరిమితిని 100 శాతానికి పెంచుతున్నట్లు మోదీ సర్కార్ కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. ఇక వొడాఫోన్-ఐడియా విలీన ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో ఎఫ్‌డీఐలపై దృష్టి సారించడం విశేషం. టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ వివరాల ప్రకారం ఐడియా-వొడాఫోన్ విలీనం తర్వాతి సంస్థ 40 కోట్ల మంది మొబైల్ వినియోగదారులతో దేశీయ అతిపెద్ద టెలికం సంస్థగా అవతరించనున్నది. ఇందులో వొడాఫోన్‌కు 47.5 శాతం వాటా, మిగతాది ఐడియాది.

41 వేల దిగువకు వెండి

రూ.250 తగ్గిన బంగారం ధర

న్యూఢిల్లీ, జనవరి 27: బంగారం ధరలు క్రమంగా దిగువముఖం పడుతున్నాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.250 తగ్గి రూ.31,200కి జారుకుంది. వెండి ధర ఏకంగా రూ.41 వేల కిందకు పడిపోయింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే కిలో ధర రూ.350 తగ్గి రూ.40,650కి చేరుకుంది. దేశవ్యాప్తంగా ఆభరణాల కొనుగోళ్లలో నెలకొన్న మందకొడి కారణంగా ధరలు దిగువముఖం పట్టాయని, వీటికితోడు అంతర్జాతీయ మార్కెట్లో డౌన్‌ట్రెండ్ కొనసాగుతుండటం కూడా తగ్గింపును మరింత పెంచిందని బులియన్ ట్రేడర్ వెల్లడించారు. న్యూయార్క్ బులియన్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,349.30 డాలర్లకు పడిపోగా, వెండి 17.38 డాలర్ల వద్ద ముగిసింది.



నమస్తే తెలంగాణ కళ్యాణమస్తు

...మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు



భాగ్యలక్ష్మీ రెడ్డి మ్యాట్రిమోని

రెడ్డి వధూవరులకు ప్రత్యేకముగా చూడబడును



H.O : తార్నాక హుడా కాంప్లెక్స్,
Konala Bhagyalakshmi Reddy, M.A.
Vice-President:
Telangana Marriage Links.
Cell: 9246960888,9030315599.
Whatsapp: 9866044439
bhagyalakshmireddymatrimoni@gmail.com

వధువు కావలెను

★ రెడ్డి డాక్టర్: 28Y, 5'8", MBBS MD, Doctor, 25 crores Property వరునికి తగిన వధువు కావలెను. ఫోన్. నెంబరు: 9246960888

★ రెడ్డి : 31Y, 5'10", B.Tech (IIT), MS (USA), Phd (Germany), Scientist, USA, 3.5 LPM, 10 Crores Property వరునికి తగిన వధువు కావలెను. 9248064777

★ రెడ్డి : 28Y, 5'7", MS, SWE, USA, 120 KPA, 5 Crores Property వరునికి తగిన USA వధువు కావలెను. సంప్ర: 9030315599

★ రెడ్డి : 34Y, 5'11", MCA, SWE, UK, 37.5 KPA, 5 Crores Property వరునికి తగిన వధువు కావలెను. సంప్ర: 7207930999

★ రెడ్డి : 31Y, 5'4", B.Tech, PG, MS, SWE, USA, 7LPM, 8 Crores Property వరునికి తగిన వధువు కావలెను. సంప్ర: 9246960888

★ రెడ్డి : 31Y, 5'9", B.Tech, Central Governament Employ, 50,000/- P.M, 2 Crores Property వరునికి తగిన వధువు కావలెను. 9248064777

★ రెడ్డి : 30Y, 5'8", B.Tech, MBA, IT Manager, 4 LPM, 45 Crores Property వరునికి తగిన వధువు కావలెను. 9030315599

★ రెడ్డి : 29Y, 5'10", PG, MS (UK), Manager, SWE, 25 LPA, Well settled వరునికి తగిన వధువు కావలెను. సంప్ర: 7207930999

★ రెడ్డి : 29Y, 5'6", B.Tech, MS (USA), SWE, 9.3 LPA, 5 Crores Property వరునికి తగిన వధువు కావలెను. 9246960888

★ రెడ్డి రెండవ పెళ్ళి: 34Y, 5'11", MBA, Business, 1LPM, 10 Crores Property వరునికి తగిన వధువు కావలెను. 9248064777

వరుడు కావలెను

★ రెడ్డి డాక్టర్: 23Y, 5'6", MBBS, Prepared PG, (Step-1Completed) 2 Crores Property వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777

★ రెడ్డి: 26Y, 5'3", B.Tech, MS, SWE, USA, 70KPA, 5 Crores వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్. నెం: 9246960888

★ రెడ్డి: 28Y, 5'6", MS, SWE, USA, 65KPA అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్. నెం: 7207930999

★ రెడ్డి: 24Y, 5'4", B.Tech, MS, USA, 2 Crores Property వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్. నెం: 9030315599

★ రెడ్డి: 26Y, 5'5", B.Tech, MS (IIT), SWE, USA, 120 KPA వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్. నెం: 9248064777

★ రెడ్డి: 27Y, 5'3", B.Tech, MBA, HR, Manager, 8 Crores Property వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్. నెం: 9246960888

★ రెడ్డి: 31Y, 5'4", M.Sc, Senior Research Analyst, 10 LPA వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్. నెం: 7207930999

★ రెడ్డి: 25Y, 5'2", BE (Bitspilani), M.Sc Biology, Scientist 6 LPA, 2 Crores Property వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్. నెం: 9030315599

★ రెడ్డి: 27Y, 5'4", B.Tech, SWE, 8 LPA, వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్. నెం: 9248064777

★ రెడ్డి రెండవ పెళ్ళి: 31Y, 5'4", D.Pharmacy, Chief Executive Officer, 10 LPA వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్.నెం: 9246960888

తెలంగాణ రెడ్డీలకు మాత్రమే

కేవలం తెలంగాణలో రెడ్డి వివాహ సంబంధాలు కుదర్చగల ఏకైక వివాహ వేదిక. కేసరి మోహన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, బర్కత్‌పుర, హైదరాబాద్. ☎: 040-27555006, 9246573006, 7981053739
E-mail:keesarimb@gmail.com, www.keesarimarriages.com
Timing: 10 am to 5.00 pm. Tuesday Holiday.
మా బ్రాంచ్: B.N.రెడ్డి క్రాస్ రోడ్స్, సాగర్‌రోడ్, చైతన్యనగర్, ఫేస్-2, రోడ్ నం.4, హైదరాబాద్.
Native Place:తిరుగండ్లపల్లి (గ్రా), మర్రిగూడ (మం), నల్గొండ (జి)

వధువు కావలెను

★ రెడ్డి: 29/ 5'11"/ B.Pharmacy/ M.Pham/ 12L P/A /10Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★ రెడ్డి: 28/5'10"/ B.Sc/ MS/ UK/ 25L P/A/ HYD/ 20Cr/ వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★ రెడ్డి: 30/ 5'9"/ BE/ Govt Job/ 6L P/A/ 3Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★ రెడ్డి: 29/ 5'8"/ BE/ MBA/ 30L P/A / Own Business/ 10Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★ రెడ్డి: 38/ 5'11"/ MBBS/ MD/ Radiology/ 12L PA/ 15Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★ రెడ్డి: 28/ 5'9" / MBBS/ MD/ Paedriatrics/ 14L P/A/ 40Cr/ వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★ రెడ్డి: 29 / 5'7" / MBBS/ DNB/ Gen.Med/ 6L P/A/ 3Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★ రెడ్డి : 28 / 5'9" / BE/ MS/ USA/ H1/ 100K/ Full Time/ 20Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★ రెడ్డి : 30/ 5'8" / BE/ MS/ 135K/ Full Time/ H1/ 12Cr/ USA/ వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★ రెడ్డి : 25/ 5'9" / BE/ MS/ USA/ H1/ 80K/ Full Time/ 15Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

వరుడు కావలెను

★ రెడ్డి: 25 / 5'5" / BE/ IIT/ 14L P/A/ 5Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★ రెడ్డి : 23 / 5'4" / BE/ MS/ USA/ Own Company/ Hyd/ Rich family/ జూబ్లీహిల్స్/ వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★ రెడ్డి: 26 / 5'2" / BE/ 3L P/A/ 4Cr/ వధువుకి తెలంగాణ Business వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★ రెడ్డి : 24 / 5'3" / BE/ 4L P/A/ 1Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★ రెడ్డి : 24 / 5'2" / B.Com/ CA /4L P/A / 50L వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006


★ రెడ్డి : 38 / 5'3" / B.Sc/M.Sc /17L P/A/ 1Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★ రెడ్డి : 26/ 5'6" / BE/ IIT/ MS/ USA/ 100K / Full Time /2Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★ రెడ్డి : 25 / 5'7" / BE/ MS/ H1/ USA/ 80K/ Full Time/ 3Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★ రెడ్డి: 31/ 5'2"/MBBS/MD/Emergency Medicine/ 18L P/A/ 1Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★ రెడ్డి : 27 / 5'3" / MBBS/ MS/ gynacology/ 10Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006



కళ్యాణ వేదికలు

★ T.Bhoom Reddy Marriage Bureau for Local, Abroad Matches. Cont: H-13/1, Near Ahobilamutt, D.D. Colony, Hyd. Ph: 040-27425273, 8790123939, 9347225273


★ శ్రీశ్రీ కొమురవెల్లి మ్యారేజ్ బ్యూరో: ప్రత్యేకముగా మాల, మాదిగ లకు లేట్, 2వ & ఇతర కులముల సంబంధాలు చూడబడును. సంప్ర||రాంనగర్'X' రోడ్స్, Hyd. 9701552985. Mail ID:avula.ramulu@yahoo.com

★ రజక మ్యారేజ్ బ్యూరో: Drs., Engrs., A.E., Bank, J.T.O., Teachers, USA, Kamala Pandu, New Bowenpally, Sec-bad-11. kp.rajaka@gmail.com. Ph: 9676673789, 9949871493.

★ SC మాల, హిందూలకు మాత్రమే Engineers/ Doctors/PG M.Sc. & USA. Contact: Sri Laxmi Marriage Bureau Sai Ram: 8008988513, 9000919182.

★ Pushpalatha Marriages for all Caste, SC, Mala, Madhiga Gouds/ Brahmin's/Yadavs. Contact: 9494450649, 9063782365.

★ SC మాల మాదిగ వివాహ సంబంధాలకై ఫోటో వివరాలను 7981782162 నెంబర్‌కు వాట్సాప్ గాని markway910 marriages@gmail.comకు మెయిల్‌గాని పంపించండి. సంప్ర: Markway Marriages, RTC 'X' Road, Hyd. రిజిస్ట్రేషన్ ఫ్రీ.



వధువు కావలెను

★రెడ్డి, డైవర్సీ, CNB, 56, 5'10", ఇంటర్, కారు, ఇల్లు, ప్లాటు, పొలం, 1.5L PM. *ఒంటరి, 60, 5'10", ఓపెన్ మైండ్ వారు కావలెను. ఇల్లరికం OK. Ph: 9063471025, 7386103012

★వైశ్య వరుడు RMP డాక్టర్ వరునికి వధువు కావలెను, కుల సంబంధం లేదు. అభిప్రాయం ఉంటే ఎవరు అయిన సంప్రదించవచ్చు. ఇది డైరెక్టుగా ఇచ్చినాము. సెల్:7993508359

★కమ్మరి:26సం.,5'9", M.Tech (CSE), SWE జాబ్ చేస్తున్న వరునికి B.Tech/ M.Tech/MSC చేసిన వధువు కావలెను. Ph: 9989187844, వాట్సాప్: 9704824886



వరుడు కావలెను

★SC మాల: 40 సం.లు, 2nd, అందమైన వధువుకు కులపట్టింపులేని వరుడు కావలెను. పెన్షనర్స్ కూడా OK. ఇల్లరికం OK. Ph: 9490570029, 9154969331.

★GOUDS: Age: 27, Height: 5'4", Qly: M.Sc.B.Ed., Presently: Private Job. Salary:12,000/-. Ph: 9652659684, Direct, No Brokers

★ దూదేకుల ముస్లిం:(కుల పట్టింపు లేదు) 2nd మ్యారేజ్, 40/5'4", డిగ్రీ/ఓన్ బిజినెస్ 50,000/- PM, 3 Cr ప్రాపర్టీ గల అందమైన వధువుకు ఇల్లరికం వరుడు కావలెను. Ph:9550296562

★ గౌడ్స్: విడో, 30 సం., 5'4", RTO Office జాబ్స్/ 15Cr. ప్రాపర్టీ గల అందమైన వధువుకి కుల పట్టింపులేని వరుడు కావలెను. Ph:8790788977

www.prabhakarreddymatrimony.com



20 సంవత్సరాల అనుభవం అన్ని కులములు 1వ, 2వ, లేట్, India/Abroad
Email: prabhakarpinnama@gmail.com
కార్పొరేట్ ఆఫీస్: LB Nagar హైదరాబాద్ Flat No.51, Sirinagar-Hyd
బ్రాంచ్‌లు: తెలంగాణ, AP అన్ని మండల జిల్లా కేంద్రాలలో నిర్వహించుటకు ఆసక్తి కలవారు సంప్రదించగలరు
Head Office: L.B. Nagar, Hyderabad Ph:9391198332, 9059430595
Branch Office: సీతాఫల్‌మండి, SECUNDERABAD Ph: 7095596623

వధువు కావలెను

★ SC - వధూవరుల పరిచయ వేదిక : తేది 28/1/2018 ఉదయం 9.00 AM నుండి 1.00 PM వరకు SC - వధూవరుల పరిచయవేదిక సూర్యనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప్పల్‌లో జరుపబడును. Reg.fee 600/-. Cell No : 9391198332/ 9133908508

★ Gouds వధూవరుల పరిచయ వేదిక : 28/1/2018 మధ్యాహ్నం 2.00 PM నుండి 6.00 PM వరకు Goud's వధూవరుల పరిచయవేదిక సూర్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప్పల్‌లో జరుపబడును. Reg.fee 1000/-. Cell No : 9391198332,9133908508.

★ ముదిరాజ్ వధూవరుల పరిచయ వేదిక: 11/2/2018 ఉదయం 9.00 AM నుండి 1.00 PM వరకు ముదిరాజ్ వధూవరుల పరిచయ వేదిక సూర్యనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప్పల్‌లో జరుపబడును. Reg.fee: 1000/- Cell No. 9391198332,9133908508

★ యాదవ వధూవరుల పరిచయ వేదిక: 11/2/2018 మధ్యాహ్నం: 2:00 PM నుండి 6:00PM వరకు యాదవ వధూవరుల పరిచయవేదిక సూర్యనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప్పల్‌లో జరుపబడును. Reg.fee: 1000/- Cell No. 9391198332, 9133908508

★ రెడ్డి : 30Y/ 6"/ Fair B.Tech, SWE-USA, 175K 2Cr ఆస్తి గల వరుడుకి వధువు కావలెను. 9391198332

★ రెడ్డి : 28Y/ 6"/ Fair B.Tech, MS-USA, SWE-USA, 125K 3Cr ఆస్తి గల వరుడుకి వధువు కావలెను. 9391198332

★ రెడ్డి : 29Y/ 5,11"/ Fair B.Tech, SWE-Hyd 70,000/- PM 2Cr ఆస్తి గల వరుడుకి వధువు కావలెను. 9391198332

★ మున్నూరుకాపు : 27Y/ 5,9"/ Fair B.Tech, MS-USA, SWE-Canada 60K 1Cr ఆస్తి గల వరుడుకి వధువు కావలెను. 9391198332

★ మున్నూరుకాపు : 30Y/ 5,10"/ Fair B.Tech, MS-London SWE-Hyd 7Lac P/A 2cr ఆస్తి గల వరుడుకి వధువు కావలెను. 9391198332

★ ముదిరాజ్ : 26Y/ 5,9"/ Fair B.Com (CS), Business, 80,000/- PM 5Cr ఆస్తి గల వరుడుకి వధువు కావలెను. 9391198332

★ గౌడ్ : 29Y/ 5,7"/ Fair, B.Tech, Sr.Team member SWE-Emp 40,000/- PM 1Cr ఆస్తి గల వరుడుకి వధువు కావలెను. 9391198332

★ ముస్లిం : 26Y/ 5,11"/ Fair, M.Sc, Lab-Exe Emp 32000/- PM 60 Lac's ఆస్తి గల వరుడుకి వధువు కావలెను. 9391198332

★ యాదవ్ : 27Y/ 5,7"/ Fair, B.Tech, SWE-Emp, Hyd, 18000/- PM గల వరుడుకి వధువు కావలెను. 9391198332

★ బ్రాహ్మణ్ : 31Y/ 5,8"/ Fair, MCA, SWE-Emp, 4Lac P/M గల వరుడుకి వధువు కావలెను. 9391198332

★ SC - Mala రెండోపెళ్ళి : 35Y/ 5,8"/ Fair, MBA, MNC Job 8Lac P/A 2Cr ఆస్తిగల వరుడుకి వధువు కావలెను. 9391198332

★ పద్మశాలి రెండోపెళ్ళి : 29Y/ 5,10"/ Fair, MCA & DMHS, Diploma Doctor-Hyd, 80,000/- PM 2.5Cr ఆస్తి గల వరుడుకి వధువు కావలెను. 9391198332

★ గౌడ్ రెండోపెళ్ళి : 34Y/ 5,6"/ Fair, Diploma, Automobile Eng Project work 15000/- PM 1Cr ఆస్తి గల వరుడుకి వధువు కావలెను. 9391198332

★ SC - వధూవరుల పరిచయ వేదిక : తేది 28/1/2018 ఉదయం 9.00 AM నుండి 1.00 PM వరకు SC - వధూవరుల పరిచయవేదిక సూర్యనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప్పల్‌లో జరుపబడును. Reg.fee 600/-. Cell No : 9391198332/ 9133908508

★ Gouds వధూవరుల పరిచయ వేదిక : 28/1/2018 మధ్యాహ్నం 2.00 PM నుండి 6.00 PM వరకు Goud's వధూవరుల పరిచయవేదిక సూర్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప్పల్‌లో జరుపబడును. Reg.fee 1000/-. Cell No : 9391198332,9133908508.

★ ముదిరాజ్ వధూవరుల పరిచయ వేదిక: 11/2/2018 ఉదయం 9.00 AM నుండి 1.00 PM వరకు ముదిరాజ్ వధూవరుల పరిచయ వేదిక సూర్యనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప్పల్‌లో జరుపబడును. Reg.fee: 1000/- Cell No. 9391198332,9133908508

వరుడు కావలెను

★ SC వధూవరుల పరిచయ వేదిక: 28/01/2018 ఉదయం : 9.00AM నుండి 1.00 PM వరకు SC వధూవరుల పరిచయ వేదిక సూర్యనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప్పల్‌లో జరుపబడును. Reg.fee - 600/- Cell No. : 9391198332, 9133908508.

★ Gouds : వధూవరుల పరిచయ వేదిక: 28/01/2018 మధ్యాహ్నం : 2.00PM నుండి 6.00 PM వరకు Goud's వధూవరుల పరిచయ వేదిక సూర్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప్పల్‌లో జరుపబడును. Reg.fee - 1000/- Cell No. : 9391198332, 9133908508.

★ రెడ్డి: 26y/ 5,6"/ Fair, B.Tech, MS-USA, SWE-USA, 95000/- $ 1Cr ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9133908508

★ రెడ్డి: 26y/ 5,6"/ Fair, B.Tech, MS - USA, SWE - USA, 100K 1Cr ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9133908508

★ రెడ్డి: 25y/ 5,3"/ Fair, B.Tech, SWE-Eng 35000/- PM 50Lac's ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. 9133908508

★ రెడ్డి: 27y/ 5,5"/ Fair, MBBS, PG 1St year, Anesthesiology-DNB Doctor వధువుకు వరుడు కావలెను. 9133908508

★ గౌడ్: 27y/ 5,3"/ Fair, M.Sc, B.Ed, Pvt. Job 14000/- PM గల వధువుకు వరుడు కావలెను. 9133908508

★ యాదవ: 25y/ 5,3"/ Fair, B.Tech, SWE-Eng 5Lac P/A గల వధువుకు వరుడు కావలెను. 9133908508

★ బెస్తా: 25y/ 5,3"/ Fair, Degree, Pvt Job 10,000/- P/M గల వధువుకు వరుడు కావలెను. 9133908508

★ బ్రాహ్మణ్: 25y/ 5,5"/ Fair, B.Tech, SWE - Eng 50,000/- PM గల వధువుకు వరుడు కావలెను. 9133908508

★ ముస్లిం: 25y/ 5,4"/ Fair, B.Com & (CS), Accounting 15000/- PM గల వధువుకు వరుడు కావలెను. 9133908508

★ వైశ్యా: 26y/ 5,3"/ Fair, B.Tech, Sr.SWE-Bangalore 67000/- PM గల వధువుకు వరుడు కావలెను. 9133908508

★ ముదిరాజ్: 30y/ 5,4"/ Fair, MBA, ICWA Account Officer, 20,000/- PM గల వధువుకు వరుడు కావలెను. 9133908508

★ మున్నూరుకాపు: 27y/ 5,3"/ Fair, B.Tech, SWE-Hyd, 80,000 /- PM 1Cr ఆస్తిగల వధువుకు వరుడు కావలెను. 9133908508

★ మున్నూరుకాపు: 27y/ 5,5"/ Fair, & M.Tech, SWE-Emp 18000/- PM గల వధువుకు వరుడు కావలెను. 9133908508

★ రెడ్డి రెండోపెళ్ళి: 28y/ 5,3"/ Fair, B.Tech, SWE-Emp 15Lac P/A గల వధువుకు వరుడు కావలెను. 9133908508

★ రెడ్డి రెండోపెళ్ళి: 32y/ 5,3"/ Fair, Degree వధువుకు వరుడు కావలెను. 9133908508

★ రెడ్డి రెండోపెళ్ళి: 25y/ 5,4"/ Fair MBA, MNC EMP - 25000/- PM గల వధువుకు వరుడు కావలెను. 9133908508

★ SC మాదిగ: 31y/ 5,3"/ Fair, MBA (finance) MNC Emp - 20,000 P/M గల వధువుకు వరుడు కావలెను. 9133908508

★ SC వధూవరుల పరిచయ వేదిక: 28/01/2018 ఉదయం : 9.00AM నుండి 1.00 PM వరకు SC వధూవరుల పరిచయ వేదిక సూర్యనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప్పల్‌లో జరుపబడును. Reg.fee - 600/- Cell No. : 9391198332, 9133908508.

శ్రీ పద్మశాలి మ్యారేజ్ బ్యూరో



దాసి దయానంద్
Regd. No. 864/2009
E-mail: sripadmashalimarriages@gmail.com
పద్మశాలి కులస్తులకు మాత్రమే ప్రత్యేక శ్రద్ధతో సంబంధములు కుదుర్చబడును.
5-265, Opp: గ్రీన్ బావర్చి రెస్టారెంట్, HMT రోడ్, చింతల్, హైదరాబాద్-54.
8019960999, 9603308999
9030895678, 040-42024047

శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్ లైన్



దేశిరెడ్డి శోభారెడ్డి
రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 400/- మాత్రమే
తెలంగాణ రెడ్డి వధూవరుల వివాహ సంబంధాలకై సంప్ర.
Flat No. 201, 2nd Floor, Sheshadri Heights Apartment
Opp: SLMS Hospital, Nagole "X" Road, Hyd.
Cell: 73968 91999 / 9398618816

"శుభమస్తు" మ్యారేజ్ బ్యూరో

TM EST: 1995
గౌడ, ఈడిగ, శెట్టిబలిజ 1st, 2nd, దేశ, విదేశ సంబంధాలకై సంప్రదించండి.
ఎస్. శారదా గౌడ్
లింగాల కాంప్లెక్స్, DSNR, HYD.
24150704/9490479371
Email: subhamastu_saradagoud@yahoo.co.in

కుమ్మర కళ్యాణ వేదిక

కుమ్మరి కులస్తుల పెళ్ళి సంబంధాల కోసం సంప్రదించండి
దేవరుప్పల యాదగిరి కుమ్మర
బడంగ్‌పేట్, హైదరాబాద్ జిల్లా
Cell: 9640972206

శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో (ముదిరాజ్ స్పెషల్)

ముదిరాజ్ సంబంధములకు సంప్రదించండి
H.O : తార్నాక హుడా కాంప్లెక్స్,
srisowbhagya.hyd@gmail.com,
Konala Bhagyalakshmi Reddy, M.A.
Vice-President:
Telangana Marriage Links.
Cell: 9246960888,9030315599.

వధువు కావలెను

★ ముదిరాజ్ : 27Y, 5'9", B.Tech, MS, SWE, USA, 110K PA, వరునికి తగిన వధువు కావలెను. 9030315599

★ ముదిరాజ్ : 25Y, 5'11", Degree, Central Govt Employee, 56,000 PM వరునికి తగిన వధువు కావలెను. 7207930999

★ ముదిరాజ్ : 28Y, 5'7", MBA, MA, Bank Employee, 40,000 PM వరునికి తగిన వధువు కావలెను. 9246960888

★ ముదిరాజ్ : 28Y, 5'10", M.Tech, Govt Job, 70K PM వరునికి తగిన వధువు కావలెను. 9248064777

★ ముదిరాజ్ : 27Y, 5'5", MBA, SWE, 10L PA వరునికి తగిన వధువు కావలెను. 9030315599

★ ముదిరాజ్ : 29Y, 5'6", MBA, Admin, 47,000 PM వరునికి తగిన వధువు కావలెను. 7207930999

★ ముదిరాజ్ : 30Y, 5'5", B.Tech, MBA, SWE, 6L PA వరునికి తగిన వధువు కావలెను. 9248064777

★ ముదిరాజ్ : 30Y, 6ft, MBA, Banking Manager, 80,000 PM, వరునికి తగిన వధువు కావలెను. 9246960888

★ ముదిరాజ్ : 29Y, 5'7", B.Tech, SWE, 1.5L PM వరునికి తగిన వధువు కావలెను. 9030315599

★ ముదిరాజ్ : 31Y, 5'6", B.Tech, SWE, 80,000 PM వరునికి తగిన వధువు కావలెను. 7207930999

వరుడు కావలెను

★ ముదిరాజ్ : 25Y, 5ft, B.Tech (IT), SWE, USA, 5L PM, వధువుకి తగిన వరుడు కావలెను. 7207930999

★ ముదిరాజ్ : 28Y, 5'3", BE, MS, USA, 76K PA, వధువుకి తగిన వరుడు కావలెను. 9030315599

★ ముదిరాజ్ : 29Y, 5'4", BDS, MS, USA, వధువుకి తగిన వరుడు కావలెను. 9246960888

★ ముదిరాజ్ : 28Y, 5'6", B.Tech, M.Tech, Govt Employee, 7.5 PA వధువుకి తగిన వరుడు కావలెను. 9248064777

★ ముదిరాజ్ : 25Y, 5'4", B.Tech, M.Tech, SWE, 7.5L PA వధువుకి Govt or SWE వరుడు కావలెను. 7207930999

★ ముదిరాజ్ : 26Y, 5'7", MBA, (finance), Private Job, 13,000 PM వధువుకి తగిన వరుడు కావలెను. 9030315599

★ ముదిరాజ్ : 23Y, 5'4", B.Tech, Private Teacher, 8,000 PM వధువుకి తగిన వరుడు కావలెను. 9246960888

★ ముదిరాజ్: 29Y, 5'4", MA, B.Ed, Job in MEO Office 10,000 PM వధువుకి తగిన వరుడు కావలెను. 9248064777

★ ముదిరాజ్ : 25Y, 5'3", MBA, US, SWE, 26,000 PM వధువుకి తగిన వరుడు కావలెను. 7207930999

★ ముదిరాజ్ : 26Y, 5'2", B.Tech, SWE, 20,000 PM వధువుకి తగిన వరుడు కావలెను. 9030315599

శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో

అన్ని కులముల పెండ్లి సంబంధములకు సంప్రదించండి.
H.O : తార్నాక హుడా కాంప్లెక్స్,
srisowbhagya.hyd@gmail.com,
Konala Bhagyalakshmi Reddy, M.A.
Vice-President:
Telangana Marriage Links.
Cell: 9246960888,9030315599.



వధువు కావలెను

★ బ్రాహ్మణ : 31Y, 5'8", B.Tech, SWE, 12 Laks PA, వరునికి వధువు కావలెను. 9246960888

★ మున్నూరుకాపు : 31Y, 5'8", B.Tech, SWE, 9 Laks PA వరునికి వధువు కావలెను. 9248064777

★ పద్మశాలి : 28Y, 5'11", CA, Finance Manager, 18 Laks PA వరునికి వధువు కావలెను. 9030315599

★ గౌడ్స్ : 31Y, 5'11", B.Tech, SWE, 12L PA, వరునికి వధువు కావలెను. 7207930999

★ గంగపుత్ర : 30Y, 5'8", B.Tech, MBA, Bank Manager, 50,000 PM వరునికి వధువు కావలెను. 9246960888

★ విశ్వబ్రాహ్మణ : 30Y, 5'9", BA, LLB, Govt Job, 1 Lak PM వరునికి వధువు కావలెను. 9248064777

★ నాయీబ్రాహ్మణ : 29Y, 5'11", MCA, SWE, 9.5 Laks PA వరునికి వధువు కావలెను. 9030315599

★ హిందూమాల : 29Y, 5'8", B.Tech, SWE, 10 Laks PA వరునికి వధువు కావలెను. 7207930999

★ హిందూమాదిగ : 29Y, 5'5", B.Tech, MBA, Govt job, 60,000 PM వరునికి వధువు కావలెను. 9246960888

★ కుల పట్టింపులేదు : 27Y, 5'8", B.Com, System Head, 50,000 PM వరునికి కుల పట్టింపులేని వధువు కావలెను. 9248064777

వరుడు కావలెను

★ కమ్మ : 25Y, 5'2", B.Tech, SWE, 5.5 laks PA వధువుకి వరుడు కావలెను. 9248064777

★ మున్నూరుకాపు : 26Y, 5'2", MBA, HR, 30,000 PM వధువుకి వరుడు కావలెను. 9246960888

★ పద్మశాలి : 29Y, 5'2", B.Tech, SWE, 10 laks PA, వధువుకి వరుడు కావలెను.9030315599

★ గౌడ్స్ : 25Y, 5'4", M.Tech, SWE, 7.5 Laks PA వధువుకి వరుడు కావలెను. 7207930999

★ గంగపుత్ర : 25Y, 5'4", M.Tech, SWE, 4.35 Laks PA వధువుకి వరుడు కావలెను. 9248064777

★ విశ్వబ్రాహ్మణ : 25Y, 5'2", B.Tech, SWE, 4 Lacs PA వధువుకి వరుడు కావలెను. 9246960888

★ నాయీబ్రాహ్మణ : 27Y, 5'6", MCA, 25,000 PM వధువుకి వరుడు కావలెను. 9030315599

★ హిందూమాల : 26Y, 5'5", B.Tech, SWE, 35,000 PM వధువుకి వరుడు కావలెను. 7207930999

★ హిందూమాదిగ : 31Y, 5'3", B.Tech, Govt Job, 40,000 PM వధువుకి వరుడు కావలెను. 9248064777

★ విశ్వబ్రాహ్మణ రెండవ పెళ్ళి : 26Y, 5'4", B.Tech, Managing Director, Property 30 Crores వధువుకి Cast No-Bar వరుడు కావలెను. 9246960888

4 లైన్ల ప్రకటనకు 400/-

ప్రతి అదనపు లైనుకు 100/-

గమనిక: "కళ్యాణమస్తు" ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటన దారులకు సంబంధించిన హామీలకు పత్రిక బాధ్యత వహించదు. ప్రకటనల అన్ని విషయాలలో వధూ వరులు, పెండ్లి పెద్దలే నిర్ణయాలు తీసుకోవాలి. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

కళ్యాణమస్తు

8-2-603/1/7, 8, 9, Krishnapuram, Road. No.10 Banjara Hills, Hyderabad - 500034.

80966 77819

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై|| లి||

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, abroad Matches Fast Settlement: (For Reddy's Only) (Telangana) Cont:K.C. Reddy, Address: 106, A.K. Enclave, Phase-II, 8-2-350, Road No.3, Banjara Hills (Near A.P.Furniture Mall), Hyd.
Ph: 9849321309 / 9347807015
Email: kcreddy43@gmail.com

వధువు కావలెను

★ Reddy/(Business) B.Tech/ MBA/ V.Smart boy/ 100Cr (Prop) 27/6feet. *Cont: K.C. Reddy -Mar- Bureau - Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/B.Tech (IIT)/ M.Tech (IIT) Ph.D USA/ 300K/ 32/6'/ 10Cr *VIT/ GMAT/ MBA/ (USA) (KELLY) 30/5'11"/ 180K * Cont: K.C. Reddy, Hyd. Ph:9849321309/9347807015.

★ Reddy/ USA Green Card/ B.Tech/ MS/ 27/5'9"/ 95K 30Cr (Prop) Hyd - Ph : 9849321309/ 9347807015. K.C. Reddy-Marriage Bureau-Hyd.

★ Reddy/ MBBS/ Res-Doc-USA-28/6'/ (Surgeon) / 50Cr + (Prop)/ Father-Doc-USA *Cont: K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ Business/ B.Tech/ MBA * 32/6'/400 Cr * 28/5'10"/ 200 Cr * 31/ 5'9"/ 200 Cr * 29/5'8"/200 Cr * 30/5'10"/200 Cr * Cont: K.C. Reddy-Hyd. Ph:9849321309.

★ Reddy/ B.Tech/ MBA/ USA/ 26/5'9"/ 75Cr *BS/USA/ 25/6'/150 Cr * MS/ 24/6'/ 40Cr * Cont: K.C. Reddy-Hyd.Ph:9849321309/9347807015.

★ Reddy/ B.Tech/MS/H1/USA *28/6'/ 200Cr * 28/5'11"/ 60 Cr *34/5'10"/70 Cr * 30/5'7"/150K/ 70 Cr *28/5'8"/100K/ 30 Cr *Cont: K.C. Reddy-Hyd. Ph:9849321309.

★ Reddy/ PG-Doc/MS (Optha) Both Parents Govt. Doc/30/5'10" /V.Smart/ 10Cr (Prop) *Cont: K.C. Reddy-Hyd. Ph:9849321309/9347807015.

★ Reddy/ MBBS/ MS (SUR)/ DM/ Both Parents-doc/ Own Hospital-Hyd/ 29/5'11"/ 80Cr * Cont: K.C. Reddy.Ph:9849321309/ 9347807015.

★ Reddy/ B.Sc (Statistics)/ M.Sc (Actuary) 25Lyr / 15Cr (Prop)/ 29/ 5'11"/ * Cont: K.C. Reddy -Mar- Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/(NLG) B.Tech/ MS/ Aus/30/5'8"/ 6L/M Rental income/ 25Cr(Prop) Hyd/ 75K *Cont: K.C.Reddy- Mar- Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/(Wgl) MBBS/ Res-Doc-USA/ 31/6'/ *Cont: K.C.Reddy-Mar-Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/R.R.Dist/ B.Tech/ MS (Australia) V.Smart (Aus-Citizen) 29/5'9"/ 30Cr (Prop) *Cont: K.C.Reddy- Mar- Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/(Divercee) Hyd/ B.Tech/ Business - Contractor/ 38/5'9"/60Cr Big house in B.hills *Cont: K.C. Reddy. Ph:9849321309/ 9347807015.

★ Reddy/(US-Green Card) Medak/ B.Tech/ 95K/ 30Cr (Prop) 28/5'9"/ *Cont: K.C.Reddy- Mar- Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/R.R.Dist/ Business/ 34/ 5'5"/ 60Cr (Prop) Hyd - Good factory *Cont: K.C.Reddy- Mar- Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/R.R.Dist/Business/ Builder/ 29/5'10"/ 40Cr (Prop) Hyd. *Cont: K.C.Reddy- Mar- Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/(WGL) B.Tech/ MBA (USA) 26/5'9"/ 75 Cr- Fr-Big Contractor- in Hyd *Cont: K.C.Reddy- Mar- Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/(NZB) BS / USA/ 25/ 6/150Cr- Fr big- Business Man- Hyd *Cont: K.C.Reddy- Mar- Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/Business/ 31/5'9"/ 200Cr *B.Tech MBA *30/5'8"/200Cr* 30/5'10"/ 200Cr *Cont: K.C.Reddy- Mar- Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

వరుడు కావలెను

★ Reddy/ MBBS/ Most Beautiful/ 22/5'5"/ 30Cr (Prop) *Cont K.C. Reddy-Mar-Bureau-Road-No3 B-Hills-Hyd. Ph: 9849321309.

★ Reddy/ B.Tech/ MS/ Most Beautiful/ 26/5'3"/ 50Cr (Prop) *Cont K.C. Reddy -Mar- Bureau- Road - No - 3- B-Hills-Hyd. Ph: 9347807015.

★ Reddy/ Very young girl/ B.Tech/ 19years/ 5'8"/ 30Cr (Prop) *Cont K.C. Reddy - Mar-Bureau - B-Hills-Hyd. Ph: 9849321309/9347807015.

★ Reddy/ B.Tech/ MS/ 26/5'3"/ 150Cr *26/5'3½"/ 40Cr/ 28/5'5"/ 40Cr *26/5'7"/ 30Cr *28/5'4"/ 30Cr *27/5'6"/ 100Cr *Cont K.C. Reddy - Hyd. Ph: 9849321309/9347807015.

★ Reddy/ B.Tech/ (IIT) MS/ USA *30/5'5"/ 200K/ 15Cr *29/5'4"/ 180K *27/5'4" *26/5'7"/ 30Cr *27/5'2" /5Cr *27/5'5" *Cont K.C. Reddy - Hyd. Ph: 9849321309/9347807015.

★ Reddy/ MBBS/ Res-Doc-USA *26/5'7"/ 50Cr *26/5'4"/ 120Cr* 27/5'7"/ 10Cr *29/5'3" *29/5'5"/ 10Cr* 30/5'4" *Cont K.C. Reddy - Hyd. Ph: 9849321309/9347807015.

★ Reddy/ MBBS/ PG *28/5'3" (SUR)/ 27/5'6"/ GM/ 29/5'3" / (Rad) *30/5'6" / (DER) *28/5'8"/ GM *29/5'4" /GY *28/5'4" ENT *26/5'5" (Path) * Cont: K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ RICH *B.Tech/ 27/5'6" /100Cr 30/5'2½"/ 100 Cr * 28/5'7"/50 Cr *28/5'3"/20Cr * 28/ 5'5"/40 Cr * 29 / 5'3'/ 30Cr* Cont: K.C. Reddy, Hyd. Ph:9849321309/9347807015.

★ Reddy/ Rich * B.Tech/ 26/5'5"/ 10Cr *27/ 5'5"/ 25Cr *27/5'2" /20Cr * 27/5'5"/20Cr *28/5'3"/20Cr *26/5'6"/30Cr *20/5'8"/30Cr *Cont K.C. Reddy - Hyd. Ph: 9849321309/9347807015.

★ Reddy/ (divercee) Most beautiful/ 26/5'3"/ BBA/ 10Cr *32/5'6"/ M.Tech/20Cr *28/ 5'6"/ 25Cr/ B.Tech *31/5'2½"/10Cr *Cont K.C. Reddy - Hyd. Ph: 9347807015.

★ Reddy/ B.Tech/ 21/ 5'5"/10 Cr * 20/5'8"/ 30 Cr * 24/ 5'4"/ 50 Cr *BDS/ 30/5'3"/ 100Cr *Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/B.Tech (IIT)/ BITS/ MS/ USA*25/5'7"/30Cr *26/ 5'2"/5Cr/ 110K *26/5'5" *Cont K.C.Reddy-Hyd.Ph:9849321309/9347807015

★ Reddy/B.Tech/MS/H1/USA/ 25/5'4"/3Cr*26/5'6"/5Cr*27/5'4"/ 30Cr *25/5'7"/8Cr*26/5'5/2Cr*Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/9347807015

★ Reddy/MBBS/Res-Doc/USA*25/ 5'7"/50Cr*29/5'6" *33/5'7"/10Cr*BDS/ DDS/29/5'3"/100Cr *Cont K.C.Reddy-Hyd. Ph:9849321309/9347807015

★ Reddy/B.Tech/IIT/BITS/India Job*29/5'6"/12L/Y*25/5'9"*28/ 5'3" *Cont K.C.Reddy-Hyd. Ph:9849321309/9347807015

★ Reddy/USA-CITIZEN *Doctors/25/5'5"/ 100Cr *25/5'7"/50Cr *28/5'5"/10Cr*30/5'2"/ 10Cr*Engineer/22/5'6"*32/5'5"*Cont K.C.Reddy-Hyd. Ph:9849321309

★ Reddy/Catholic.H1/USA*B.Tech/ MS/25/5'7"/30Cr*27/5'6"*34/5'4"* IND/ 23/5'5"/15Cr*27/5'4" *Cont K.C.Reddy-Hyd. Ph:9849321309/9347807015

★ Reddy/B.Tech/Working/Hyd*B.Tech (CBIT)M.Tech IIT/26/5'4"/14 L/Y/2Cr*25 /5'5"/10Cr*27/5'5"*26/5'7"*28/5'5"/12/yr" *Cont K.C.Reddy-Hyd. Ph:9849321309

★ Reddy/Divercee*India*B.Tech/27/ 5'6"/25Cr*32/5'2"/25Cr*32/5'2"/1Cr*30/ 5'2½"/10Cr*28/5'5"/5Cr *Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/9347807015

★ Reddy/Divercee USA *B.Tech/27/ 5'2"/ 4Cr *30/5'6"/4Cr*40/5'5" *34/5'3"/ 10Cr*31/5'5" *36/5'2" *Cont K.C. Reddy -Hyd. Ph:9849321309/9347807015

మచ్‌దార్ మోటర్ స్పోర్ట్స్ సంస్థ ఎండీ అరెస్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఐ-వన్ కారు రేసు ఫ్రాంచైజ్‌ను కేటాయిస్తామని మోసంచేసిన కేసులో బెంగళూరుకు చెందిన మచ్‌దార్ స్పోర్ట్స్ సంస్థ ఎండీని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. 2011 సంవత్సరంలో ఐ-వన్ కారు రేసు పోటీల్లో చెన్నై ఫ్రాంచైజ్‌ను కేటాయిస్తామని బెంగళూరుకు చెందిన మచ్‌దార్ మోటర్ స్పోర్ట్స్ సంస్థ జూబ్లీహిల్స్ ఫిలింనగర్‌కు చెందిన ఇండ్ భారతి స్పోర్ట్స్ సంస్థ నుంచి రూ.7.50 కోట్లు వసూలు చేసింది. 2011లో మచ్‌దార్ సంస్థ కారు రేసును నిర్వహించలేదు. ఫ్రాంచైజ్ కోసం తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వకపోవడంతో ఇండ్ భారతీ స్పోర్ట్స్ సంస్థ హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు విచారణలో భాగంగా మచ్‌దార్ మోటర్ స్పోర్ట్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మచంఅదా దర్శన్ ఉత్తప్ప (40)ను బెంగళూరులో అరెస్టు చేసి, హైదరాబాద్‌కు తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించామని డీసీపీ అవినాశ్ మహంతి తెలిపారు.

30న స్వాతంత్ర్యయోధుల సంస్మరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్వాతంత్ర్యోద్యమంలో అమరులైన యోధులను సంస్మరిస్తూ ఈ నెల 30న ఉదయం 11 గంటల నుంచి 11.02 నిమిషాల వరకు ప్రజలు విధిగా మౌనం పాటించాలని కేంద్రప్రభుత్వం ఆదేశించింది. సచివాలయ ఉద్యోగులందరూ సమతా బ్లాక్ ముందుకు చేరుకొని మౌనం పాటించాలని జీఏడీ ముఖ్యకార్యదర్శి అధర్‌సిన్హా శనివారం సూచించారు.



శనివారం హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో 'వరకవి భూమగౌడు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్. చిత్రంలో బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, నమస్తే తెలంగాణ దినపత్రిక ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, బుక్‌ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ తదితరులు కూడా ఉన్నారు.

పాటే చైతన్యం నింపింది

- హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్
- 'వరకవి భూమగౌడు' నవల ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ప్రజల్లో చైతన్యం వస్తుందని మన చరిత్రను పరాయి పాలకులు తొక్కిపెట్టినా.. పాటే ప్రజలకు చైతన్యం నూరిపోస్తూ ఉద్యమాన్ని లేవనెత్తిందని శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ చెప్పారు. శనివారం రాత్రి హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో సినారె వేదికపై బుక్‌ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ అధ్యక్షతన సాహితీ సభ నిర్వహించారు. వేముల ప్రభాకర్ రచించిన 'వరకవి భూమగౌడు' నవలను స్వామిగౌడ్ ఆవిష్కరించారు. వరకవి భూమగౌడు నవలలో చారిత్రక, సామాజిక పరిణామాలను వివరించారని బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు చెప్పారు. 'కులములందున ఏముండెను గుణము కానీ' అంటూ పురాణాల్లోని ప్రముఖుల పుట్టుకలను ప్రస్తావిస్తూ, గుణం గొప్పదనాన్ని చూడాలని చెప్తూ కులతత్వాన్ని వ్యతిరేకించిన కవి భూమాగౌడ్ అని 'నమస్తే తెలంగాణ' సంపాదకులు కట్టా శేఖర్‌రెడ్డి చెప్పారు. నేటి నిజం సంపాదకుడు బైసా దేవదాసు, రచయిత వేముల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నవలతో సమూహాల్ని చదివే అవకాశం: కట్టా శేఖర్‌రెడ్డి

ఒక నవల ద్వారా ఒక కాలానికి చెందిన మొత్తం సమూహాన్ని చదివే అవకాశం ఉంటుందని 'నమస్తే తెలంగాణ' సంపాదకుడు కట్టా శేఖర్‌రెడ్డి చెప్పారు. సంగిశెట్టి శ్రీనివాస్, విద్యావతి సంపాదకత్వం వహించిన 'మాదిరెడ్డి సులోచన' పుస్తకాన్ని సినారె వేదికపై పరిచయం చేశారు. మాదిరెడ్డి సులోచన తెలంగాణ జీవితాన్ని తన రచనల్లో ఆవిష్కరించారని, ఆమె కథలను వెలుగులోకి తీసుకొచ్చిన సంగిశెట్టి, విద్యావతి అభినందనీయులని చెప్పారు. కవయిత్రులు తిరునగరి దేవకీదేవి, ముదిగంటి సుజాతారెడ్డి, పాలపిట్ట సంపాదకులు కేపీ అశోక్ కుమార్, ప్రొఫెసర్ రఘు తదితరులు ప్రసంగించారు.



శుక్రవారం రాత్రి బౌలింగ్‌చేసేటప్పుడు గుండెపోటు రావడంతో కుప్పకూలిన ఆంథోనీ.. (ఫైల్)

బౌలింగ్ చేస్తూ మృత్యుఒడికి..

- హైదరాబాద్ బంజారాహిల్స్‌లో విషాదం

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: ఉత్సాహంగా బౌలింగ్ చేస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో మైదానంలోనే ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్-10లోని ఓ మైదానంలో శుక్రవారం రాత్రి ఈ విషాదం చోటుచేసుకుంది. నందినగర్ వాసి లాయిడ్ ఆంథోనీ (23) స్నేహితులంతా బస్తీ తరపున జట్టుగా ఏర్పడి టోర్నీలో పాల్గొంటున్నారు. ఆ జట్టులో సభ్యుడైన ఆంథోనీ ఓవర్‌లో నాలుగో బంతిని వేయడానికి సిద్ధమవుతూ కుప్పకూలిపోయాడు. సహచరులు స్థానిక దవాఖానకు తరలించగా చనిపోయినట్టు వైద్యులు తెలిపారు.

మెట్రోరైలు రెండోదశకు సన్నాహాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు రెండోదశను 60 కిలోమీటర్ల మేరకు విస్తరించేందుకు ఢిల్లీ నిపుణులతో ఆదివారం చర్చలు జరిగాయి. శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు వరకు విస్తరించే విధంగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను తయారుచేసే బాధ్యతను ఢిల్లీ మెట్రో రైలు కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ)కు అప్పగించారు. పాదచారులకు కావాల్సిన సదుపాయాలు, భూసేకరణ, రూట్ అలైన్‌మెంట్, పర్యావరణ సమస్యలు, సామాజిక సమస్యలు, సాంకేతిక సమస్యలు తదితర అంశాలపై చర్చించి పూర్తిస్థాయి నివేదికను సిద్ధంచేయనున్నారు. కొత్తగా విస్తరించనున్న 30 కిలోమీటర్ల మెట్రోరైలు రాయదుర్గం నుంచి శంషాబాద్ వరకు ఉంటుంది. రెండో లైను లక్డీకాపూల్ నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు 21 కిలోమీటర్ల మేరకు అనుసంధానం చేయనున్నారు. మొదటిదశలోని నాగోలు-ఎల్బీనగర్ మార్గంలో ఐదు కిలోమీటర్ల టర్మినల్‌లను పూర్తిచేస్తారు. ఆదివారంనాడు ఢిల్లీ మెట్రోరైలు కార్పొరేషన్ అధికారులు హైదరాబాద్ మెట్రోరైలు అధికారులతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. రెండోదశలో చేపట్టాల్సిన పనులను చర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ, ఎక్కువ డిమాండు ఉన్నచోటనే పనులు వేగంగా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. మొదటిదశలో వచ్చిన అనుభవాలను పరిగణలోకి తీసుకొని కావాల్సిన సదుపాయాలను పెంపొందిస్తామన్నారు. రామచంద్రాపురం వద్ద మెట్రోరైలు డిపో కోసం 70ఎకరాల స్థలం, లక్డీకాపూల్ నుంచి బీహెచ్‌ఈఎల్ దారిలో పార్కింగ్ కోసం నాలుగు ఎకరాల స్థలం అవసరమని భావించినట్టు చెప్పారు.

పెన్షనర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/సుల్తాన్ బజార్: రాష్ట్ర ప్రభుత్వం పదో పీఆర్సీలో ఇచ్చిన హామీ ప్రకారం.. క్వాం టమ్ ఆఫ్ పింఛన్‌ను మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. శనివారం అబిడ్స్‌లోని జయ ఇంటర్నేషనల్ హోటల్‌లో పెన్షనర్ల జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ చైర్మన్ కే లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి టీ సుభాకర్‌రావు, ఫైనాన్స్ సెక్రటరీ జీ నర్సింహ తదితరులు మాట్లాడుతూ.. 1969, మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న పెన్షనర్లకు తెలంగాణ ప్రత్యేక ఇన్‌సెంటివ్ ఇవ్వాలని వారు కోరారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో భాగం గా సకల జనుల సమ్మె, రైల్‌రోకో, రిలేనిరాహార దీక్షలు వంటి కార్యక్రమాల్లో పాల్గొని పదవీవిరమణ పొందిన వారికి ఇన్‌సెంటివ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి రెండున రాష్ట్రంలోని మజీదుల్లో ముస్లిం పెన్షనర్లు, మూడున ఆలయాల్లో హిందూ పెన్షనర్లు, 4న క్రిస్టియన్ పెన్షనర్లు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి వినూత్న నిరసన తెలుపుతారన్నారు. సమావేశంలో జీ నర్సింహ, సుధాకర్‌రావు, రాజమల్లయ్య, ఎం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లా చెర్వుగట్టు ఆలయంలో స్వామివారి ఊరేగింపు

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండాలు

నార్కట్‌పల్లి: తెలంగాణలోనే ప్రసిద్ధ ఆలయాల్లో ఒకటైన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల పరిధిలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం తెల్లవారుజామున అగ్నిగుండాల మహోత్సవం భక్తిశ్రద్ధలతో సాగింది. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ వేడుకను నిర్వహించారు. శివసత్తుల విన్యాసాలు, ఆటపాటలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు అగ్నిగుండంలో నడిచేందుకు పోటీపడ్డారు. పర్వతవాహనంపై ఆసీనులైన పార్వతీ రామలింగేశ్వరులను మంగళవాయిద్యాల నడుమ అగ్నిగుండాల వద్దకు తీసుకొచ్చిన ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వరశర్మ ప్రత్యేక హారతి నివేదించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి ఏకాంత సేవలు, పుష్పోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ నల్ల వెంకన్న, ఈఓ సైకం అంజనారెడ్డి తెలిపారు.



పెరిగిన చలి తీవ్రత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో చలి తీవ్రత మళ్లీ పెరుగుతున్నది. శనివారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 5.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఉత్తరాది నుంచి వీస్తున్న చలిగాలుల తీవ్రత పెరుగడంతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల మేర తగ్గుతున్నట్టు టీఎస్‌డీపీఎస్(తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ) అధికారులు తెలిపారు. రానున్న మూడు రోజులు ఇదే రకమైన పరిస్థితులు ఉండవచ్చని వారు పేర్కొన్నారు.

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
కుమ్రంభీం ఆసిఫాబాద్	34.9	5.8
ఆదిలాబాద్	33.3	7.5
కామారెడ్డి	33.6	7.8
నిర్మల్	35.6	8.3
జయశంకర్ భూపాలపల్లి	34.6	8.9
నిజామాబాద్	35.7	9.0
రాజన్న సిరిసిల్ల	34.7	9.1
జగిత్యాల	35.7	9.3
సిద్దిపేట	34.6	9.4
మంచిర్యాల	34.6	9.5
మేడ్చల్	34.6	9.5
భద్రాద్రి కొత్తగూడెం	35.7	9.5
వికారాబాద్	34.8	9.6
పెద్దపల్లి	35.7	9.7
మహబూబాబాద్	35.8	9.7
సంగారెడ్డి	34.1	9.8
మెదక్	34.6	9.9
కరీంనగర్	34.9	10.4
మహబూబ్‌నగర్	34.8	10.4
వరంగల్ అర్బన్	32.9	10.5
రంగారెడ్డి	35.2	10.7
వరంగల్ రూరల్	35.1	10.9
యాదాద్రి భువనగిరి	35.4	11.7
నల్లగొండ	35.5	12.0
నాగర్‌కర్నూల్	34.6	12.2
జనగామ	35.6	12.5
హైదరాబాద్	34.6	12.9
జోగుళాంబ గద్వాల	34.6	14.8
వనపర్తి	34.0	14.8
ఖమ్మం	34.7	15.3
సూర్యాపేట	34.8	15.6



నిలువెత్తు బంగారం సమర్పిస్తున్న స్పీకర్ మధుసూదనాచారి

మేడారం జాతర అద్భుతం

- స్పీకర్ మధుసూదనాచారి

జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ: మేడారం మహాజాతర అద్భుతమని శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శనివారం ఆయన మేడారం వనదేవతలను దర్శించుకున్నారు. నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... కుంభమేళాలో నది పరీవాహక ప్రాంతం వెంట కిలోమీటర్ల మేర జనాలు ఉంటారని, మేడారం మహాజాతరలో కేవలం నాలుగైదు కిలోమీటర్ల పరిధిలోనే లక్షలాది మంది ఉండటం అద్భుతమన్నారు. ఆ తరువాత ఆయన మేడారం జాతర ఏర్పాట్లపై అధికారులతో సమావేశమయ్యారు. మేడారం జాతరకు కోటి మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నదన్నారు. అనంతరం కలెక్టర్ కర్ణన్‌తో కలిసి ట్రైబల్ మ్యూజియం, భక్తులు పుణ్యస్నానాలు చేసే జంపన్నవాగును సందర్శించారు. మేడారంలో ఏర్పాటుచేసిన మీడియా సెంటర్‌ను స్పీకర్ ప్రారంభించారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ అమయ్‌కుమార్, మేడారం జాతర ట్రస్టు బోర్డు చైర్మన్ కాక లింగయ్య తదితరులు ఉన్నారు.

బాసర ఆలయ అక్రమాలపై విచారణకు కమిటీ

నిర్మల్, నమస్తే తెలంగాణ: నిర్మల్ జిల్లా బాసర ఆలయంలో అక్రమాలపై సమగ్ర విచారణకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశించారు. ఆలయంలో కొద్దిరోజులుగా అక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వెల్లువెత్తిన నేపథ్యంలో విచారణ జరిపి నివేదిక అందజేయాలని దేవాదాయ కమిషనర్‌ను ఆదేశించినట్టు తెలిపారు. విచారణ కమిటీని ఏర్పాటు చేస్తూ దేవాదాయశాఖ కమిషనర్ శివశంకర్ శనివారం ఉత్తర్వులను జారీచేశారు. దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, దేవాదాయశాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్లతో కూడిన త్రిసభ్య విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీ వారంరోజుల్లో నివేదికను ప్రభుత్వానికి అందజేయనుంది.

మహాజాతరకు సింగరేణి సైతం

- రూ.56 లక్షలతో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం
- 20 ట్యాంకర్లతో తాగునీటి సరఫరా
- అందుబాటులో గజ ఈతగాళ్లు, రెస్క్యూ టీం



మేడారంలో సింగరేణి సంస్థ నిర్మించిన సులభ్ కాంప్లెక్స్



మేడారం జాతరలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సేవలందించేందుకు సిద్ధంగా ఉన్న రెస్క్యూ టీం

జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ: మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతరలో భక్తులకు పలు రకాల సేవలు అందించేందుకు సింగరేణి సంస్థ ముందుకు వచ్చింది. సీఎస్ఆర్ కింద దాదాపు కోటి రూపాయలు వెచ్చించేందుకు సిద్ధపడింది. ఇందులో భాగంగా జాతర పరిసరాల్లో రూ.56 లక్షలతో సులభ్ కాంప్లెక్స్‌ను నిర్మించింది. శాశ్వత ప్రాతిపదికన జీ ప్లస్ వన్ పద్ధతిలో ఈ కాంప్లెక్స్‌ను తీర్చిదిద్దింది. రెండేండ్లకోసారి జరిగే జాతరలో ప్రతీసారి సింగరేణి సంస్థ భక్తులకు సేవలు అందిస్తూనే ఉన్నది. ఈసారి సేవలను మరింత విస్తృతం చేసింది. జాతరలో భక్తులకు ఎదురయ్యే ప్రధాన సమస్యల్లో మరుగుదొడ్లు ఒకటి. ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ అధికారులు మేడారంలో శాశ్వత మరుగుదొడ్లు, మూత్రశాలలు, స్నానగదుల కోసం ఇటీవల సులభ్‌కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపట్టారు. 20 మరుగుదొడ్లు, మరో 20 స్నానగదులు, 10 మూత్రశాలలు ఉండేలా కాంప్లెక్స్ నిర్మించారు. జంపన్నవాగు వద్ద మేడారం వెళ్లే రహదారిలో సిద్ధమైన ఈ సులభ్ కాంప్లెక్స్‌ను కొద్దిరోజుల క్రితం ఇంచార్జి కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ప్రారంభించారు.

మంచి నీటి వసతికి ట్యాంకర్లు..

భక్తులకు వారం రోజులపాటు తాగు నీటిని అందించేందుకు 20 వాటర్ ట్యాంకర్లను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈనెల 30నుంచి ఈ ట్యాంకర్ల ద్వారా నీటిని అందించనున్నారు. అదీగాక ఇరువై మంది గజ ఈతగాళ్లను జంపన్న వాగు వద్ద, 20 మంది స్కౌట్ రోవర్స్‌ను గద్దెల వద్ద సేవలందించడానికి ఏర్పాట్లు చేశారు. వికలాంగులు, వృద్ధులు, పిల్లలకు వన దేవతలను దర్శనం చేసుకోవడంలో స్కౌట్ రోవర్స్ సహకరిస్తారు. ఆరోగ్య సమస్యలు తలెత్తినా, ప్రమాదానికి గురైన భక్తులను అవసరమైతే అందుబాటులో ఉన్న దవాఖానకు వీరు తరలించేందుకు సాయపడతారు. ప్రమాదాల బారిన పడిన వారిని రక్షించడానికి 54 మంది రెస్క్యూ టీం సభ్యులు ఉంటారు. మేడారం చేరుకునే రహదారుల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రోడ్లపై ఆగిన వాహనాలు, కూలిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించేందుకు రెండు జేసీబీలు, మరో రెండు క్రేన్లను కూడా అందుబాటులో ఉంచనున్నారు. అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో జాతర విధులు నిర్వహించే అధికారులు, ఉద్యోగుల కోసం 150 హెల్మెట్లను సమకూర్చనున్నారు.

ప్లాస్టిక్ రహిత జాతరే లక్ష్యం

- ఎన్జీసీ వలంటీర్లకు శిక్షణ



వలంటీర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో ప్లాస్టిక్‌ను నిషేధించిన అధికారులు అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం నేషనల్ గ్రీన్ కార్ప్స్ సేవలను వినియోగించుకుంటున్నారు. ఇప్పటికే 200 మంది వలంటీర్లను నియమించారు. మేడారంలో వలంటీర్లకు శనివారం మేడారం ప్రత్యేక అధికారులు శిక్షణ ఇచ్చినట్టు ఎన్జీసీ ప్రాజెక్ట్ అధికారి రాధిక 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ప్లాస్టిక్ రహిత జాతరే లక్ష్యంగా పనిచేయాలని వారు సూచించినట్టు రాధిక పేర్కొన్నారు.

మిషన్ భగీరథ పనుల్లో వేగం పెంచండి

పాలమూరు జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి జూపల్లి

మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ:



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం ఉమ్మడి జిల్లాల జెడ్పీ సర్వసభ్య సమావేశం చైర్మన్ బండారి భాస్కర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నిర్లక్ష్యం ఉంటే చర్యలు తప్పవన్నారు. అనంతరం జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు 24 గంటల విద్యుత్‌ను ఇస్తున్నా చాలా ప్రాంతాల్లో ఆటోమెటిక్ స్టార్టర్లను రైతులు తొలగించడం లేదన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్యయాదవ్, గువ్వల బాలరాజు, చిన్నారెడ్డి, కలెక్టర్ రొనాల్డ్‌రోస్, జెడ్పీ సీఈవో కొమురయ్య, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు పాల్గొన్నారు.

రాణాకు చేరిన ఉపాధ్యాయుల పంచాయితీ

రాజాపూర్: విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే గొడువకు దిగి పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కిన ఘటన మహబూబ్‌నగర్‌లో చోటుచేసుకుంది. రాజాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాణిక్యప్రభు ఓ విద్యార్థితో ఇంగ్లిష్ టీచర్ ఉదయ్‌కుమార్‌ను తొమ్మిదో తరగతి క్లాస్ తీసుకోవాలని సూచించడం వివాదానికి కారణమైంది. ఎస్సై మల్లారెడ్డి కథనం ప్రకారం.. సదరు విద్యార్థి వెళ్లి.. 'సార్ మీరు క్లాస్ చెప్పాలని హెచ్ఎం సార్ చెప్పారు' అని అనడంతో కోపోద్రిక్తుడైన ఉదయ్ ఆ విద్యార్థిని చితకబాదాడు. తర్వాత హెచ్ఎం వద్దకెళ్లి.. 'నీవు నాకు వచ్చే హెచ్ఎం పోస్టును రాకుండా చేశావు.. ఇప్పుడేమో నన్ను క్లాస్ చెప్పమని ఆదేశిస్తావా?' అని మాణిక్యప్రభుపై దాడికి యత్నించాడు. వెంటనే అక్కడున్న ఉపాధ్యాయులు అడ్డుకోవడానికి వెళ్లగా వారిని దూషించాడు. తర్వాత సదరు ఉపాధ్యాయుడిపై పాఠశాల హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, హెచ్ఎంపై సదరు ఉపాధ్యాయుడు ఉదయ్ కూడా ఫిర్యాదు చేశాడు.



కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో మాట్లాడుతున్న ఎంపీ వినోద్‌కుమార్

వ్యవసాయ రంగానికి సర్కార్ పెద్దపీట

- కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్

చిగురుమామిడి: మిడ్‌మానేరు నుంచి గండిపల్లి, గౌరవెల్లి ప్రాజెక్టు వరకు సాగు నీరు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ స్పష్టంచేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కాంగ్రెస్ పూర్తిచేయలేకపోయిందన్నారు. టీఆర్ఎస్ సర్కార్ ప్రాజెక్టులపై దృష్టిసారించి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నదని చెప్పారు. మిడ్‌మానేరు ద్వారా కాల్వల రూపంలో 80 వేల ఎకరాల్లో 75 కిలోమీటర్ల వరకు సాగునీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నందిమేడారం సందర్శించిన సీఈల బృందం

ధర్మారం/రామడుగు: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం శివారులో జరుగుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు 6వ ప్యాకేజీ అండర్ టన్నెల్ పనులను శనివారం నీటిపారుదలశాఖ అనుబంధ ప్రాజెక్టుల ఇంజినీరింగ్ ఇన్ చీఫ్, సీఈల బృందం పరిశీలించింది. నీటిపారుదల శాఖ ఈఎన్సీ అడ్మిన్ చీఫ్ బీ నాగేందర్‌రావు, ఈఎన్సీ ప్రాజెక్టు చీఫ్ జీ అనిల్‌కుమార్, వివిధ ప్రాజెక్టుల సీఈలు సునీల్, బంగారయ్య, బీ శంకర్, పీ మధుసూదన్‌రావు, వీ లింగరాజు, బీ శంకర్‌నాయక్, సుధాకర్, కే భగవంతరావు, పీ శ్యామ్‌సుందర్ సందర్శించారు. టన్నెల్‌లోని పంపుహౌజ్, సబ్‌స్టేషన్, సర్జిపూల్ పనుల పురోగతిని పరిశీలించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుబంధంగా జరుగుతున్న ప్యాకేజీ పనులు రాత్రింబవళ్లు నిరంతరంగా కొనసాగుతున్నాయని ప్రాజెక్టు ఎస్ఈ పాక వెంకట్రాములు, ఈఈ నూనె శ్రీధర్ తెలిపారు. తర్వాత కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపురంలోని 8వ ప్యాకేజీ పనులను పరిశీలించారు.

ఉద్యమంలో డైరీల పాత్ర కీలకం

- బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్



నల్లగొండలో టీఎన్జీవోస్ డైరీ ఆవిష్కరణలో బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టీఎన్జీవోస్ నేత రవీందర్‌రెడ్డి, ఎంపీ గుత్తా, కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు

నీలగిరి: టీఎన్జీవోస్ డైరీలు సీమాంధ్ర పాలకుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా విసిరిన బాణాలని బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్, టీఎన్జీవోస్ గౌరవాధ్యక్షుడు దేవీప్రసాద్ అన్నారు. శనివారం నల్లగొండలోని టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో 2018 డైరీ, క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులు ఎజెండాలు రూపొందించుకోవడానికి డైరీలు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. జిల్లాల ఏర్పాటులో సరైన నిష్పత్తిలో ఉద్యోగులు లేకపోయినా, బంగారు తెలంగాణ పునర్నిర్మాణం కోసం పనిభారాన్ని కష్టమైనా ఇష్టంగా మార్చుకుని పని చేస్తున్నారని అన్నారు. టీఎన్జీవోస్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఉద్యోగులు ఒక రోజు వేతనం అందజేసి బాసటగా నిలిచారన్నారు. మార్చి ఒకటిన రాబోయే పీఆర్‌సీతో ఉద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ గుత్తా సుఖేందర్ రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ పూల రవీందర్, కలెక్టర్ గౌరవ్ ఉప్పల్, టీజీవోస్, టీఎన్జీవోస్ నాయకులు పాల్గొన్నారు.



కొత్తగూడెం జిల్లా భూపతిరావుపేటలో దహనమైన ఇసుక లారీలు

ఇన్‌ఫార్మర్ల నెపంతో మావోయిస్టుల దుశ్చర్య

- ఒకరి నరికివేత, మరొకరిపై కాల్పులు
- నాలుగు లారీలు, మూడు జేసీబీలు, ఒక ట్రాక్టర్ దహనం

పినపాక: భద్రాద్రికొత్తగూడెం జిల్లా పినపాక మండలంలో శుక్రవారం రాత్రి మావోయిస్టులు విధ్వంసం సృష్టించారు. వలస ఆదివాసీలపై ఇన్‌ఫార్మర్ల నెపంతో దాడిచేశారు. ఒకరిని కత్తులతో పొడిచి చంపగా మరొకరిపై కాల్పులు జరిపారు. భూపతిరావుపేట ట్రైబల్ సొసైటీ ఇసుక క్వారీలో పనిచేస్తున్న నాలుగు లారీలు, మూడు జేసీబీలు, ఒక ట్రాక్టర్‌ను దహనం చేశారు. మండలంలోని జానంపేట పంచాయతీ పరిధిలోని సుందరయ్యనగర్, దుగినేపల్లి పంచాయతీ పరిధిలోని భీమవరం గ్రామాల్లో గత కొన్నేండ్లుగా కొందరు ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చి ఆదివాసీల ఆవాసాలను ఏర్పర్చుకున్నారు. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో సాయుధులైన 40 మంది మావోయిస్టులు గోదావరి నది దాటొచ్చి మూడు బృందాలుగా విడిపోయి భీమవరానికి చెందిన పొడియం జోగయ్య (38) అలియాస్ రామును ఇంట్లో నుంచి తీసుకొచ్చి కత్తులతో పొడిచి హతమార్చారు. సుందరయ్యనగర్‌కు చెందిన మడవి రమేశ్‌ను ఇంట్లో నుంచి బయటికి తీసుకొచ్చి తుపాకులతో కాల్పులు జరుపగా త్రుటిలో తప్పించుకుని జానంపేట వైపు పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నాడు. ఈ రెండు ప్రదేశాల్లో మావోయిస్టులు రెండు లేఖలు వదిలి వెళ్లారు. వీరు పోలీసుల ఇన్‌ఫార్మర్లుగా మారి నక్సల్స్ ఉద్యమానికి విఘాతం కల్గిస్తుండటంతో దాడి చేసినట్టు లేఖలో పేర్కొన్నారు.

- మలేషియా యువకులు.. మన జైలులో ఖైదీలు



జైలు జీవితం ఎలా ఉంటుందో తెలుసుకునేందుకు మలేషియా నుంచి ఇద్దరు యువకులు సంగారెడ్డిలోని జైలు మ్యూజియానికి వచ్చారు. సరదాగా జైలు జీవితం గురించి ఆన్‌లైన్‌లో తెలుసుకొన్న మలేషియాకు చెందిన కెన్, కెల్విన్‌లు జిల్లా జైలు అధికారులను సంప్రదించారు. రోజుకు రూ.500 చొప్పున ఇద్దరి నుంచి రెండురోజులకు రూ.2వేలు రుసుము తీసుకుని జైలులోకి పంపించారు. మధ్యాహ్నం సాధారణ ఖైదీలకు అందించే ఆహారాన్ని వడ్డించారు. అనంతరం వారు జిల్లా జైలులో ఖైదీల మాదిరిగా మొక్కలకు నీళ్లు పోసి కూలి పనులు చేశారు. -సంగారెడ్డి టౌన్



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో మంత్రి ఈటల రాజేందర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరుతున్న టీడీపీ కౌన్సిలర్ అంపటి రాధికాసుధీర్




ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో కండువా కప్పి టీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి జోగు రామన్న

అభివృద్ధిని చూసే టీఆర్ఎస్‌లోకి వలసలు

- ఆర్థిక మంత్రి ఈటల

హుజూరాబాద్/ నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: సీఎం కేసీఆర్ సర్కార్ చేపడుతున్న అభివృద్ధిని చూసే ఇతర పార్టీల నాయకులు, సంఘాల వారు పెద్ద ఎత్తున టీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. శనివారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో భారీగా టీఆర్ఎస్‌లో చేరారు. హుజూరాబాద్ టీడీపీ కౌన్సిలర్ అంపటి రాధిక-సుధీర్‌తోపాటు 250 మంది అనుచరులు పార్టీలో చేరారు. వీరితోపాటు పలు గ్రామాలకు చెందిన వెయ్యిమంది మంత్రి సమక్షంలో గులాబీగూటికి చేరారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. వనపర్తిలో 40 మంది యువకులు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సమక్షంలో, కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్‌లో పలువురు కాంగ్రెస్ నాయకులు టీఆర్ఎస్ నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి నేతృత్వంలో, కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని టీడీపీ, సీపీఐ, కాంగ్రెస్‌లకు చెందిన 130 కుటుంబాల వారు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో 25 కుటుంబాల వారు ఎమ్మెల్యే రెడ్యానాయక్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.



మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో దగ్ధమవుతున్న కందిపంట

25 ఎకరాల కంది పంట దగ్ధం

బయ్యారం: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం రాయికుంట సమీపంలో ప్రమాదవశాత్తు 25 ఎకరాల కంది పంట దగ్ధమైంది. నామాలపాగు, రాయికుంట, కొత్తపేట గ్రామాలకు చెందిన రైతులు కంది పంట సాగు చేయగా శనివారం సాయంత్రం అకస్మాత్తుగా మంటలు అంటుకోవడంతో పూర్తిగా పంట దగ్ధమైంది. రూ. 10 లక్షల మేర పంట నష్టం జరిగినట్టు వారు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
ఆదివారం 28 జనవరి 2018

పదకొండో సీజన్ ఐపీఎల్ వేలం ఆసక్తికరంగా సాగింది. ఐపీఎల్ చైర్మన్ రాజీవ్‌శుక్లా, బీసీసీఐ కార్యదర్శి అమితాబ్ చౌదరి, సీఈవో రాహుల్ జోహ్రి, ఇతర ఆఫీస్ బేరర్ల సమక్షంలో వేలం జరిగింది. రెండేండ్ల నిషేధం అనంతరం వేలంలో పాల్గొన్న రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్‌కింగ్స్‌కు రాజీవ్‌శుక్లా స్వాగతం పలికారు. శనివారం జరిగిన తొలి రోజు ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్‌స్టోక్స్ అత్యధిక ధర పలుకగా..భారత బ్యాట్స్‌మెన్ కేఎల్ రాహుల్, మనీశ్‌పాండేలకు బంపర్ ఆఫర్ దక్కింది. ఆస్ట్రేలియన్ పేసర్ మిచెల్ స్టార్క్, బ్యాట్స్‌మన్ క్రిస్‌లిన్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, ఆరోన్ ఫించ్ కూడా కోట్లు కొల్లగొట్టారు. యువరాజ్, గంభీర్, హర్భజన్ విషయంలో అంచనాలు తలకిందులవగా..గేల్, మలింగను ఎవరూ పట్టించుకోలేదు. ఇక వేలంలో తొలిసారిగా ప్రవేశ పెట్టిన రైట్ టూ మ్యాచ్‌ను ఉపయోగించుకుంటూసన్‌రైజర్స్ ధవన్, రషీద్‌ఖాన్‌ను దక్కించుకోగా...చెన్నై బ్రావో, డుప్లెసిస్‌ను, ముంబై పొలార్డ్‌ను, బెంగళూరు యుజ్వేంద్ర చాహల్‌ను తీసుకుంది. తొలి రోజు వేలంలో మొత్తం 78మంది ఆటగాళ్లు అమ్ముడుపోగా..వీరిలో 29 మంది విదేశీ ఆటగాళ్లున్నారు. వీరి కోసం ఎనిమిది ఫ్రాంచైజీలు మొత్తం 321.10కోట్లు ఖర్చు చేశాయి.



అశ్విన్‌ను ఎందుకు వదులుకున్నారో..?

ఈసారి వేలంలో ఆసక్తికర బిడ్డింగ్ ఎవరిదంటే..తక్కున అశ్విన్ పేరే గుర్తొస్తుంది. ఎందుకంటే చెన్నై ఇతడిని రైట్ టూ మ్యాచ్ ద్వారా దక్కించుకుంటుందని అంతా భావించగా, పంజాబ్ ఎగురేసుకుపోయింది. అవకాశం ఉన్నప్పటికీ తమిళ ఫ్రాంచైజీ అశ్విన్‌ను వదులుకునేందుకే ఇష్టపడింది. బ్రావో, డుప్లెసిస్‌లను రైట్ టూ మ్యాచ్ ద్వారా తీసుకుని, హర్భజన్, తాహీర్ వంటి స్పిన్నర్లనూ జట్టులో చేర్చుకుంది గానీ, లోకల్ హీరోను మరిచిపోయిందంటూ అభిమానులు విమర్శిస్తున్నారు. జాదవ్, వాట్సన్‌కు భారీ మొత్తం వెచ్చించిందే గానీ, అధిక ధర (రూ.7.5కోట్లు) పేరుతో అశ్విన్‌ను పక్కన పెట్టడం భావ్యం కాదంటున్నారు.

కుర్ర మిలియనీర్

గతేడాది సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడిన ఆఫ్ఘనిస్థాన్ యువ స్పిన్ బౌలర్ రషీద్ ఖాన్ ఈసారి రికార్డు స్థాయిలో రూ.9కోట్ల ధర పలికాడు. 19 ఏండ్ల వయసులోనే మిలియనీర్‌గా మారిన ఆఫ్ఘన్ క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు . ఇతడి కోసం ఫ్రాంచైజీలు పోటీపడ్డ తీరు తొలిరోజు వేలంలో హైలైట్‌గా నిలిచింది. మొదట పంజాబ్ బిడ్ వేయగా..రాజస్థాన్ రేసులోకొచ్చింది. ఆ తర్వాత బెంగళూరు కూడా పోటీకొచ్చింది. ఆసక్తికరంగా సాగిన పోటీలో పంజాబ్ దక్కించుకునే ప్రయత్నం చేయగా..రైట్ టూ మ్యాచ్ ద్వారా సన్‌రైజర్స్ హైదరాబాద్ రషీద్‌ను తిరిగి సొంతం చేసుకున్నది.

కోట్లు కొల్లగొట్టారు

ఎవరి దగ్గర ఎంత ?

చెన్నై సూపర్ కింగ్స్	17కోట్లు
ఢిల్లీ డేర్‌డెవిల్స్	12.30కోట్లు
కింగ్స్ ఎలెవన్ పంజాబ్	21.90కోట్లు
కోల్‌కతా నైట్ రైడర్స్	7.60కోట్లు
ముంబై ఇండియన్స్	15.80కోట్లు
రాజస్థాన్ రాయల్స్	23.50కోట్లు
రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	15.85కోట్లు
సన్‌రైజర్స్ హైదరాబాద్	7.95కోట్లు

■ బెన్‌స్టోక్స్‌కు రూ.12.50కోట్లు జాక్ పాట్..
■ 11 కోట్లు పలికిన మనీశ్, రాహుల్
■ అశ్విన్ పంజాబ్‌కు, భజ్జీ చెన్నైకి
■ రషీద్‌ఖాన్‌కు రూ.9కోట్లు
■ యువ ఆటగాళ్లకు మంచి బేరం
■ గేల్, మలింగను పట్టించుకోని ఫ్రాంచైజీలు
■ తొలి రోజు అమ్ముడైన 78 ఆటగాళ్లు

వేచి చూసిన వేలం తొలి దశ ముగిసింది. కొందరిపై కోట్లు కురియగా.. మరికొందరకి భంగపాటు తప్పలేదు.. అనూహ్యం, ఆశ్చర్యం, సంచలనం ఒకే వేదికను పంచుకోగా.. అందరూ ఊహించినట్టుగానే బెన్‌స్టోక్స్ జాక్‌పాట్ కొట్టేశాడు. యువీ, గంభీర్, భజ్జీ పాతాళానికి పడిపోగా..రాహుల్, మనీశ్ అందలమెక్కారు..ఆఫ్ఘన్ కుర్రాడు అకస్మాత్తుగా మిలియనీర్ అయిన వేళ ..గేల్, మలింగ జీరోలుగా మిగిలారు..కృనాల్, కౌల్ దేశీ ధమాకా చూపించగా.. అనామక ఆటగాడైన ఆర్చర్ అధరగొట్టాడు..మలి వేలం మరికాసేపట్లో ఉన్నది.. మరెంతమంది కాసుల వర్షంలో తడిసిపోతారో చూడాలి.

సన్‌రైజర్స్ బోణీ

పదకొండో సీజన్ ఐపీఎల్ వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ బోణీ కొట్టింది. మార్క్యూ ఆటగాళ్ల జాబితాతో మొదలైన వేలంలో మొదట శిఖర్ ధవన్ పేరు వచ్చింది. వెంటనే రాజస్థాన్ రాయల్స్ రంగంలోకి దిగింది. రూ.4కోట్ల బిడ్‌తో వేలం రేసును మొదలుపెట్టింది.ఆ తర్వాత ముంబై రూ.4.2కోట్లతో పోటీకొచ్చింది. ఇక కింగ్స్ ఎలెవన్ పంజాబ్ రూ.5.20కోట్లతో ధవన్‌ను దక్కించుకున్నట్టే కనిపించినా, రైట్ టూ మ్యాచ్ ద్వారా సన్‌రైజర్స్ తమ ఆటగాడిని తిరిగి దక్కించుకున్నది.

హతవిధీ గేల్

టీ20 సూపర్ స్టార్, పరుగుల సునామీ సృష్టించడంలో దిట్ట అయిన వెస్టిండీస్ బ్యాట్స్‌మన్ క్రిస్‌గేల్‌ను తొలిరోజు వేలంలో దక్కించుకునేందుకు ఏ ఫ్రాంచైజీ ముందుకు రాలేదు. బెంగళూరు తిరిగి దక్కించుకుంటుందని అభిమానులు భావించినప్పటికీ నిరాశతప్పలేదు. గతేడాది గేల్ అంతర్జాతీయ మ్యాచుల్లో పెద్దగా ఆడింది లేదు. అయితే బంగ్లాదేశ్ లీగ్‌లో 146 పరుగులతో అదురగొట్టినప్పటికీ..ఫ్రాంచైజీలు మాత్రం దాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. మరోవైపు దిగ్గజ పేస్ బౌలర్ లసిత మలింగకూ ఫ్రాంచైజీలు మొండిచెయ్యి చూపాయి. తొలిసారిగా వేలంలోకి వచ్చిన ఇంగ్లండ్ కెప్టెన్ జోరూట్‌నూ పట్టించుకోలేదు. ఆస్ట్రేలియా పేసర్లు మిచెల్ జాన్సన్, హేజల్‌వుడ్ అలాగే మిగిలిపోయారు.

ఉంటే ఉండనీ..!

భారత్‌కు 2011 ప్రపంచకప్ అందించడంలో కీలకపాత్ర పోషించిన గౌతమ్‌గంభీర్, యువరాజ్‌సింగ్, హర్భజన్‌సింగ్ విషయంలో కథ అడ్డం తిరిగింది. 2016లో రూ.16కోట్లు దక్కించుకుని సంచలనం సృష్టించిన యువరాజ్ ఒక్కసారిగా పాతాళానికి పడిపోయాడు. ఈసారి అతడిని కేవలం రూ.2కోట్ల(కనీస ధర)కే పంజాబ్ దక్కించుకున్నది. గంభీర్‌ను ఢిల్లీ, హర్భజన్(2 కోట్లు)ను చెన్నై..ఏదో ఉంటే ఉన్నారులే అన్న చందంగానే తీసుకున్నది.

విదేశీ చిచ్చర పిడుగులు

ఈసారి వేలంలో విదేశీ అన్‌క్యాప్డ్ ఆటగాళ్లు వెస్టిండీస్ యువ ఆల్‌రౌండర్ జోఫ్రా ఆర్చర్ (రూ.7.40కోట్లు) , ఆస్ట్రేలియన్ సంచలనం డార్కీ షార్ట్ (రూ. 4కోట్లు) ఎవరూ ఊహించని రీతిలో భారీ ధర పలికారు. తాజాగా ఆస్ట్రేలియాలో జరుగుతున్న బిగ్‌బాష్ లీగ్‌లో అదురగొడుతున్న ఈ ఇద్దరినీ రాజస్థాన్ రాయల్స్ దక్కించుకున్నది. ఆర్చర్ కోసం మిగతా ఫ్రాంచైజీలు పోటీపడగా అతను తన కనీస ధర కంటే 36 రెట్లు ఎక్కువ ధర పలుకడం విశేషం. ఆర్చర్ చివరి ఓవర్లలో పరుగులను అడ్డుకునే బౌలర్‌గా, ఆఖర్లో హిట్టింగ్ చేయడంలోనూ దిట్ట అని పేరు తెచ్చుకున్నాడు. ఇక డార్కీ షార్ట్.. స్లో లెఫ్టార్మ్ ఆర్థోడ్రాక్స్ బౌలింగ్‌తో, అద్భుతమైన ఎడమ చేతి బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటున్నాడు.


జోఫ్రా ఆర్చర్

దేశీ దరువు

దేశీ ఆటగాళ్లను మరింత వెలుగులోకి తీసుకురావడమే ఐపీఎల్ ప్రధాన ఉద్దేశమని చెప్పిన చైర్మన్ రాజీవ్‌శుక్లా మాటలకు అనుగుణంగానే..ఈసారి వేలంలో లోకల్ ఆటగాళ్లు అనూహ్య ధరతో దూసుకొచ్చారు. కృనాల్ పాండ్య అత్యధికంగా రూ.8.80కోట్లతో సంచలనం రేపగా.. సిద్దార్థ్ కౌల్ రూ.3.80కోట్లు, దీపక్ హుడా రూ.3.60 కోట్లు, రాహుల్ త్రిపాఠి రూ.3.40కోట్లు, నితీశ్ రానా రూ. 3.40కోట్లు కమ్‌లేశ్ నాగర్ కోటి రూ.3.20 నవ్‌దీప్ సైనీ రూ.3కోట్ల ధర పలికి దేశీ సత్తా చాటారు.

అమ్ముడుపోని ఆ ముగ్గురు

ప్రసుతం దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న భారత ఆటగాళ్లలో మురళీ విజయ్, పార్థివ్ పటేల్, ఇషాంత్‌శర్మను ఎవరూ పట్టించుకోలేదు. వికెట్ కీపర్ దినేశ్‌కార్తీక్ (కోల్‌కతా) ఉమేశ్ (బెంగళూరు), షమీ(ఢిల్లీ)కి మాత్రం వేలంలో సంతృప్తికర ఫలితం దక్కింది.

వేలంలో ఎవరికి ఎంత

సన్‌రైజర్స్ హైదరాబాద్	
మనీశ్ పాండే	రూ.11కోట్లు
రషీద్ ఖాన్	రూ.9కోట్లు
శిఖర్ ధావన్	రూ.5.20కోట్లు
వృద్ధిమాన్ సాహా	రూ.5కోట్లు
సిద్దార్థ్ కౌల్	రూ.3.80కోట్లు
దీపక్ హుడా	రూ.3.6కోట్లు
కేన్ విలియమ్సన్	రూ.3కోట్లు
సయ్యద్ ఖలీల్ అహ్మద్	రూ.3కోట్లు
కార్లోస్ బ్రాత్‌వైట్	రూ.2కోట్లు
షకిబల్ హసన్	రూ.2కోట్లు
యూసుఫ్ పఠాన్	రూ.1.90కోట్లు
బాసిల్ థంపి	రూ.95లక్షలు
టి. నటరాజన్	రూ.40లక్షలు
రికీభుయ్	రూ.20లక్షలు

చెన్నై సూపర్ కింగ్స్	
కేదార్ జాదవ్	రూ.7.80కోట్లు
డ్వేన్ బ్రావో	రూ.6.40కోట్లు
కర్ణ్ శర్మ	రూ.5కోట్లు
షేన్ వాట్సన్	రూ.4 కోట్లు
అంబటిరాయుడు	రూ.2.20కోట్లు
హర్భజన్ సింగ్	రూ.2కోట్లు
ఫాఫ్ డుప్లెసిస్	రూ.1.60కోట్లు
ఇమ్రాన్ తాహీర్	రూ.1కోటి

ఢిల్లీ డేర్ డెవిల్స్	
గ్లెన్ మ్యాక్స్‌వెల్	రూ.9కోట్లు
కగిసో రబాడ	రూ.4.2కోట్లు
అమిత్ మిశ్రా	రూ.4కోట్లు
విజయ్ శంకర్	రూ.3.20కోట్లు
మహ్మద్ షమీ	రూ.3కోట్లు
రాహుల్ తెవాటియా	రూ.3కోట్లు
గౌతమ్ గంభీర్	రూ.2.80కోట్లు
కొలిన్ మున్రో	రూ.1.90కోట్లు
జాసన్ రాయ్	రూ.1.50కోట్లు
పృథ్వీషా	రూ.1.20కోట్లు
అవేశ్ ఖాన్	రూ.70లక్షలు
హర్షల్ పటేల్	రూ.20లక్షలు

కింగ్స్ ఎలెవన్ పంజాబ్	
కేఎల్ రాహుల్	రూ.11కోట్లు
రవిచంద్రన్ అశ్విన్	రూ.7.60కోట్లు
ఆరోన్ ఫించ్	రూ.6.20కోట్లు
మార్కస్ స్టొయినిస్	రూ.6.20కోట్లు
కరుణ్ నాయర్	రూ.5.60కోట్లు
డేవిడ్ మిల్లర్	రూ.3కోట్లు
అంకిత్ రాజ్‌పుత్	రూ.3కోట్లు
యువరాజ్ సింగ్	రూ.2కోట్లు
మయాంక్ అగర్వాల్	రూ.1కోటి

కోల్‌కతా నైట్‌రైడర్స్	
క్రిస్ లిన్	రూ.9.60కోట్లు
మిచెల్ స్టార్క్	రూ.9.40కోట్లు
దినేశ కార్తీక్	రూ.7.40కోట్లు
రాబిన్ ఊతప్ప	రూ.6.40కోట్లు
కుల్దీప్ యాదవ్	రూ. 5.8కోట్లు
పీయూష్ చావ్లా	రూ.4.2కోట్లు
నితీశ్ రానా	రూ.3.40కోట్లు
కమలేశ్ నాగర్‌కోటి	రూ.3.20కోట్లు
శుభ్మన్ గిల్	రూ.1.80కోట్లు
ఇషాంక్ జగ్గీ	రూ.20లక్షలు

ముంబై ఇండియన్స్	
కృనాల్ పాండ్య	రూ.8.80కోట్లు
ఇషాన్ కిషన్	రూ.6.20కోట్లు
కిరన్ పొలార్డ్	రూ.5.40కోట్లు
ప్యాట్ కమిన్స్	రూ.5.40కోట్లు
సూర్యకుమార్ యాదవ్	రూ.3.20కోట్లు
ముస్తఫిజుర్ రహ్మన్	రూ.2.20కోట్లు

రాజస్థాన్ రాయల్స్	
బెన్ స్టోక్స్	రూ.12.50కోట్లు
సంజు శాంసన్	రూ.8కోట్లు
జోఫ్రా ఆర్చర్	రూ. 7.20కోట్లు
జాస్ బట్లర్	రూ.4.40కోట్లు
అజింక్య రహానే	రూ.4కోట్లు
డార్కీ షార్ట్	రూ.4కోట్లు
రాహుల్ త్రిపాఠి	రూ.3.40కోట్లు
స్టువర్ట్ బిన్నీ	రూ. 50 లక్షలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	
క్రిస్ వోక్స్	రూ.7.40కోట్లు
యుజ్వేంద్ర చాహల్	రూ.6కోట్లు
ఉమేశ్ యాదవ్	రూ.4.20కోట్లు
బ్రెండన్ మెకల్లమ్	రూ.3.60కోట్లు
నవదీప్ సైనీ	రూ.3కోట్లు
క్వింటన్ డికాక్	రూ.2.80కోట్లు
కొలిన్ గ్రాండ్‌హోం	రూ.2.20కోట్లు
మొయిన్ అలీ	రూ.1.70కోట్లు
మనన్ వోరా	రూ.1.10కోట్లు
కుల్వంత్ ఖెజ్రోలియా	రూ.85లక్షలు
అంకిత్ చౌదరి	రూ. 30లక్షలు

ఐపీఎల్ వేలం
స్టార్ స్పోర్ట్స్ - 1లో
ఉదయం 10 గం. నుంచి

కల నెరవేరె..

■ ఆస్ట్రేలియా ఓపెన్ విజేత వోజ్నియాకి
■ తొలి గ్రాండ్‌స్లామ్ సాధించిన డెన్మార్క్ భామ
■ ఫైనల్లో హలెప్‌పై ఘన విజయం



మెల్‌బోర్న్: ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో విజేతగా నిలిచిన కరోలిన్ వోజ్నియాకి కల నెరవేర్చుకుంది. కెరీర్‌లో తొలిగ్రాండ్‌స్లామ్ విజయం సాధించడంతో పాటు డెన్మార్క్ తరపున తొలి గ్రాండ్‌స్లామ్ సాధించిన రికార్డునూ తన పేరిట లిఖించింది. రాడ్‌లేవర్ ఎరీనాలో శనివారం ప్రపంచ రెండోసీడ్ వోజ్నియాకి 7-6 (7/2), 3-6, 6-4 స్కోరుతో టాప్ సీడ్, రుమేనియాకు చెందిన సిమోన్ హలెప్‌పై విజయం సాధించింది. తొలిసెట్‌లో హలెప్ తొలి సర్వీస్‌నే బ్రేక్ చేసిన వోజ్నియాకి 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లినా.. తేరుకున్న హలెప్ ఎదురుదాడి చేయడంతో స్కోరు 6-6తో సమంగా నిలిచింది. ట్రై బ్రేకర్‌లో వోజ్నియాకి పవర్‌గేమ్‌తో హడలెత్తిచింది. వోజ్నియాకి సంధించిన సర్వీసులకు హలెప్ వద్ద సమాధానం లేకుండా పోయింది. దీంతో తొలిసెట్ వోజ్నియాకి సొంతమైంది. ఇక రెండోసెట్‌లో తనదైన మార్కు ఆటతీరుతో హలెప్ చెలరేగింది. అద్భుతమైన ప్లేస్‌మెంట్స్, కళ్లు చెదిరే సర్వీస్ రిటర్న్స్.. తిరుగులేని ప్లేస్‌మెంట్స్‌తో అదురగొడుతూ 6-3తో రెండోసెట్ దక్కించుకుంది. చివరిదైన మూడోసెట్లో ఇద్దరు భామలు కాస్త ఉద్వేగంగా కనిపించారు. చివరకు ఉత్కంఠను తట్టుకున్న వోజ్నియాకి..హలెప్‌ను 6-4తో ఓడించి సెట్‌తోపాటు మ్యాచ్‌ను గెలుచుకుని ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా నిలిచింది.



శనివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో పద్మశ్రీ అవార్డు గెలుచుకున్న భారత బ్యాడ్మింటన్ స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్‌ను అభినందిస్తున్న సాట్స్ చైర్మన్ ఏ వెంకటేశ్వర రెడ్డి, టీఎస్ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ప్రేమ్‌రాజ్ తదితరులు.


హైదరాబాద్ ఫుట్‌బాల్ లీగ్(హెచ్‌పీఎల్)లో విజేతగా నిలిచిన ప్రా హార్ట్ విజన్ క్లబ్ జట్టు. శనివారం జరిగిన ఫైనల్లో విజేతలుగా నిలిచిన ప్రా హార్ట్ క్లబ్ జట్టుకు ట్రోఫీని బహూకరించిన టోర్నీ మెంటార్, భారత ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ బైచుంగ్ భాటియా.

మధురమీ..విజయం

■ షమీ విజృంభణ
■ దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 177ఆలౌట్
■ భారత్ చిరస్మరణీయ విజయం
■ ఎల్గర్ శ్రమ వృథా

పరువు కోసం పట్టుదలగా పోరాడారు. సిరీస్ కోల్పోయి విమర్శలు ఎదురైనా వెరువకుండా ప్రత్యర్థి పనిపట్టారు. అనూహ్య బౌన్స్‌తో వెన్నులో వణుకుపుట్టించిన వాండరర్స్‌లో తమ రికార్డును పదిలపర్చుకుంటూ చిరస్మరణీయ విజయంతో సత్తాచాటారు. పచ్చికతో పడగొడుదామనుకున్న దక్షిణాఫ్రికాను నిఖార్సైన పేస్‌తో పల్టీకొట్టించి పరువు నిలబెట్టుకున్నారు. మహ్మద్ షమీ నిప్పులు చెరిగే బంతులతో విజృంభించిన వేళ..ఆఖరిదైన మూడో టెస్ట్‌లో కోహ్లీసేన మరిచిపోలేని విజయాన్నందుకుంది.



జొహాన్నెస్‌బర్గ్:

విదేశీ గడ్డపై భారత్ ఖాతాలో చిరస్మరణీయ విజయం. టెస్ట్‌ల్లో నంబర్‌వన్ ర్యాంక్ హోదాకు తగ్గట్లు టీమ్‌ఇండియా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదురగొట్టింది. ఆధిక్యం చేతులు మారుకుంటూ వచ్చిన మూడో టెస్ట్‌లో భారత్ 63 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై అద్భుత విజయం సాధించింది. కోహ్లీసేన నిర్దేశించిన 241 పరుగుల లక్ష్యఛేదనలో షమీ(5/28) విజృంభణకు తోడు బుమ్రా(2/57), ఇషాంత్(2/31) చెలరేగడంతో సఫారీలు 73.3 ఓవర్లలో 177 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ఎల్గర్(240 బంతుల్లో 86 నాటౌట్, 9ఫోర్లు, సిక్స్) అజేయ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న భువనేశ్వర్ కుమార్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. వెర్నాన్ ఫిలాండర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కింది.

53 పరుగులకు 9 వికెట్లు: ఓవైపు అనూహ్య బౌన్స్‌తో బెంబేలెత్తిస్తున్న పిచ్. 241 పరుగుల లక్ష్యం కోసం నాలుగో రోజు దక్షిణాఫ్రికా బరిలోకి దిగింది. గత రాత్రి కురిసిన వర్షంతో మైదానం తడిగా ఉండటంతో మ్యాచ్ ఓ అర్ధగంట ఆలస్యంగా మొదలైంది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ ఎల్గర్(11*), ఆమ్లా(2*) భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ పరుగులు సాధించారు. దక్షిణాఫ్రికా 69/1 స్కోరుతో లంచ్ విరామానికి వెళ్లింది. క్రీజులో పాతుకుపోయిన ఎల్గర్, ఆమ్లా కీలక పరుగులు జోడిస్తూ భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. ఈ క్రమంలో ఇషాంత్ బౌలింగ్‌లో హార్దిక్‌కు క్యాచ్ ఇచ్చి ఆమ్లా వెనుదిరగడంతో రెండో వికెట్‌కు 119 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఇక్కణ్నుంచి సఫారీ ఇన్నింగ్స్ పేకమేడను తలపించింది. డివిలీయర్స్(6)ను బుమ్రా..సూపర్ బంతితో బోల్తా కొట్టించాడు. 136/3 స్కోరుతో టీ విరామానికి వెళ్లిన దక్షిణాఫ్రికా ఆ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయింది. ఇషాంత్ ఇన్‌స్వింగర్‌కు డుప్లెసిస్(2) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. డీకాక్(0)ను బుమ్రా వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. లోయార్డర్‌లో ఫిలాండర్(10), ఫెల్కువాయో(0), మోర్కెల్(0), ఎన్గిడ్(4) వికెట్లను షమీ పడగొట్టి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు. 124/1 స్కోరుతో గెలుపు దిశగా పయనించిన దక్షిణాఫ్రికా 53 పరుగుల తేడాతో ఆఖరి 9 వికెట్లను కోల్పోయింది. గాయపడ్డ పార్థివ్‌పటేల్ స్థానంలో దినేశ్ కార్తీక్ వికెట్‌కీపర్‌గా వ్యవహరించాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 187 ఆలౌట్; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** 194 ఆలౌట్; **భారత్ రెండో ఇన్నింగ్స్:** 247 ఆలౌట్; **దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** మర్క్రామ్(సి)పార్థివ్(బి)షమీ 4, ఎల్గర్ 86 నాటౌట్, ఆమ్లా(సి)హార్దిక్(బి)ఇషాంత్ 52, డివిలీయర్స్(సి)రహానే(బి)బుమ్రా 6, డుప్లెసిస్(బి)ఇషాంత్ 2, డీకాక్(ఎల్బీ)బుమ్రా 0, ఫిలాండర్(బి)షమీ 10, ఫెల్కువాయో(బి)షమీ 0, రబాడ(సి)పుజార(బి)భువనేశ్వర్ 0, మోర్కెల్(బి)షమీ 0, ఎన్గిడ్(సబ్/కార్తీక్(బి)షమీ 4; **ఎక్స్‌ట్రాలు:** 13; **మొత్తం:** 73.3 ఓవర్లలో 177 ఆలౌట్; **వికెట్ల పతనం:** 1-5, 2-124, 3-131, 4-144, 5-145, 6-157, 7-157, 8-160, 9-161, 10-177; **బౌలింగ్:** భువనేశ్వర్ 18-4-39-1, షమీ 12.3-2-28-5, బుమ్రా 21-3-57-2, ఇషాంత్ 16-3-31-2, హార్దిక్ 6-1-15-0.

ఫైనల్లో సైనా

ఇండోనేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

జకార్త: భారత బ్యాడ్మింటన్ స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ ఇండోనేషియా మాస్టర్స్ టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్స్‌లో సింధుపై ఘన విజయం నమోదు చేసిన ఊపులో సెమీస్‌లోనూ అదే ఆటతీరుతో అదురగొట్టింది. థాయిలాండ్‌కు చెందిన ప్రపంచ నాలుగోసీడ్ రచనోక్‌ను 21-19,21-19 స్కోరుతో వరుసగేముల్లో ఓడించి ఈ ఏడాది తొలి టోర్నీలో ఫైనల్ చేరింది. 49 నిమిషాలపాటు సాగిన ఈ పోరులో విజయం కోసం సైనా హోరాహోరీగా పోరాడాల్సి వచ్చింది. తై జుయంగ్, బింగ్ జియావోల మధ్య జరిగే సెమీఫైనల్ విజేతతో మన హైదరాబాదీ సైనా ఫైనల్లో తలపడనుంది.

విశ్వాసపు విశ్వరూపం మేడారం

- అనాది జీవనంలోకి ఆధునిక మానవుడు
- ఆత్మగౌరవ ప్రతీకకు నిలువెత్తు నిదర్శనం
- ప్రపంచంలోనే కోటి మందికి పైగా పాల్గొనే ఏకైక జాతర
- దేవతలుగా మారిన సబలల వీరగాథ
- పులకించిపోతున్న అడవితల్లి

(నూర శ్రీనివాస్, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి-వరంగల్)



మేడారం తెలంగాణ రాష్ట్రంలో ఓ చిన్న కోయగూడెం. తెలంగాణ స్వరాష్ట్రం సాధిస్తున్న అబ్బుర ప్రగతిని ఇవ్వాళ సర్వప్రపంచం ఆసక్తిగా చూస్తున్నట్టే.. రెండేండ్లకోసారి మహానగరపు మేనిఛాయలు సంతరించుకునే ఆ అడవి గ్రామాన్ని అపూర్వ శక్తిగా ఆదరిస్తున్నది. ఆధునికత ఎన్ని కుప్పిగంతులు వేస్తున్నా అనాది జీవన విధానంలోకి.. ఆధునిక మానవుడు పరకాయ ప్రవేశం చేసే అపురూప దృశ్యకావ్యం మేడారం జాతర. ఆదివాసీల ఇలవేల్పులైన సమ్మక్క సారలమ్మలకు సమస్త ప్రపంచం ప్రణమిల్లే అద్భుత సన్నివేశమిది. ఎనిమిది వందల సంవత్సరాల క్రితం పెల్లుబికిన తెలంగాణ ఆత్మగౌరవానికి నిలువెత్తు సంతకం. మనుషులే దైవాలుగా మారిన మహిళాన్విత శక్తికి ప్రతిరూపం. ధీరత్వమే దైవత్వంగా మారిన వీర గాథ. ఇక్కడ పూజలు చేస్తారు.. కానీ వేదమంత్రాలు ఉండవు. మొక్కులు చెల్లించుకొంటారు కానీ అర్చనలు.. ఆర్జిత సేవలు ఉండవు.. సంప్రోక్షణలు, శఠగోపాలు.. తీర్థ ప్రసాదాలు ఏవీ ఉండవు.. ఇక్కడ తల్లులకు..బిడ్డలకు మధ్యన మధ్యవర్తులుండరు. నిరాకార రూపాలైన తల్లులకు, సాకార రూపులైన బిడ్డలు తమ విన్నపాలు విన్నవించుకొంటే.. ఆ అమ్మలు ఎంతో అనుగ్రహంతో బిడ్డల ఆకాంక్షలు తీరుస్తారు. అక్కడ మనుషులంతా ఒక్కటే.. డబ్బున్నోళ్లు.. లేనోళ్లనే తేడా లేదు. ఆ నాలుగు రోజులూ కోయ దొరలదే రాజ్యం. వారు చెప్పిందే శాసనం. ఆ అడవిలో స్టార్ హోటళ్లు.. శాశ్వత సదుపాయాలకు తావులేదు. లుంగీ పైకి ఎగదీసి కట్టి.. ఊరూ పేరూ మరిచి ప్రతి ఒక్కరూ తన్మయులయ్యే అద్భుతమైన సంబురమిది. చీమలపుట్టలు పోటెత్తినట్టు.. ఉసిళ్ల దండు ఎగజిమ్మినట్టు తల్లికి మొక్కుతూ దారిపొడువునా దండాలుపెడుతూ జన జాతరకు జైకొట్టి వస్తారు. అదీ మేడారం గొప్పదనం. కొక్కెర కృష్ణయ్య, సిద్దబోయిన మునీందర్, సిద్దబోయిన లక్ష్మణ్ రావు వీళ్లంతా ఆ అమ్మలకు పూజారులు. చిలుకలగుట్టను చేరి తమకు మాత్రమే తెలిసిన రహస్యతావు నుంచి కుంకుమ భరిణె రూపంలోని సమ్మక్కను.. తల్లీ నీ రాజ్యానికి రమ్మని పబ్బతి పడుతారు. ఆమె అనుగ్రహంతో గుట్ట దిగి గద్దెమీదకు వస్తుంది. ఆమెకంటే ముందే కన్నెపల్లి నుంచి కూతురు సారలమ్మ గద్దె మీదకు వచ్చి తల్లి కోసం వేచిచూస్తుంది. పగిడిద్దరాజు, గోవిందరాజులు పతాకాల రూపంలో అమ్మల ముందు ఆవిష్కృతమవుతారు.

పాలకుడి ద్వారా ప్రజలకు..

ఆదివాసీ ఆచార సంప్రదాయాలు, పూజా విధానం అంతా ప్రత్యేకమైనవి. మేడారంలో ప్రతాపరుద్రుడు సమ్మక్క జాతరను జరిపించాడని చెప్పుకుంటారు. ఇవ్వాళ జగదల్‌పూర్‌లోని దంతేశ్వరీ ఆలయంలో జరుగుతున్న పూజలను దానికి కొనసాగింపుగా చెప్పుకుంటారు. బస్తర్‌లో మలి కాకతీయుల సజీవ ఆనవాళ్లు ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి. దసరా ఉత్సవాల సందర్భంగా దంతేశ్వరీ మాతకు జరిపే పూజా విధానం అచ్చం మేడారం సంప్రదాయాన్నే ప్రతిఫలిస్తుంది. ఇక్కడైతే ఎట్లా సమ్మక్కకు ప్రజలకు నడుమ ఎటువంటి పూజారి లేదా మధ్యవర్తి ఉండరో అదేరీతి అక్కడా ఉన్నది. మేడారంలో కోయ వడ్డెలు మాత్రమే సమ్మక్కకు, సారలమ్మను గద్దెమీదకు తెచ్చే క్రమంలో తల్లిరాకకు సంకేతంగా ఇవ్వాళ ప్రభుత్వ ప్రతినిధిగా జిల్లా పోలీసు ఉన్నతాధికారి తూటా పేల్చి తల్లిని తన రాజ్యానికి రావాలని సంకేతాత్మకంగా ఆహ్వానించడం కొనసాగుతున్న ఆనవాయితీ.

విశ్వాస జాతర

సంక్రాంతి పండుగ ముగిసినప్పటి నుంచే.. కన్నెపల్లి, మేడారం, ఊరట్టం, కొండాయి, బయ్యక్కపేట, నార్లాపూర్, ఎల్బాక, తాడ్వాయి పరిసర ప్రాంతాలన్నీ జన గుడారాలుగా మారిపోతాయి. జంపన్నవాగుగా మారిన సంపెంగ వాగులో నీటి ఆనవాళ్లు కనిపించనంతగా జనం నిండిపోతారు. బంగారమే(బెల్లం) నైవేద్యంగా, మాంసమే ప్రసాదంగా మైమరిచిపోయే అపురూప దృశ్యం. తెగిన కోళ్లు.. మేకలు. గొర్ల వాసన గుప్పుమంటుంది. చల్వాయి తొవ్వల్లో సన్నపు దుబ్బలు పోయి తారురోడ్లపై వాహనాలు ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షపుధారగా పరుగులు పెడతాయి. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా సహా పలు ఈశాన్య రాష్ట్రాల నుంచి ఆదివాసీ గిరిజన తెగలు గొట్టు (గోత్రం) విధానపు పూజాది ఆచార సంప్రదాయాలను ఆచరిస్తారు. కన్నెపల్లి గుడి నుంచి సారలమ్మను కాక సారయ్య మేడారం గద్దె పైకి తెచ్చే సమయంలో గుడి నుంచి దాదాపు కన్నెపల్లి పొలిమేరల దాకా పొర్లు దండాలు పెడుతారు. బొక్కబోర్లా పడుకొని తమ కోరికలు తీర్చాలంటూ జనం బారులు తీరి పడుకొంటే ప్రధాన వడ్డె (పూజారి) కాకసారయ్య సహ ఇతర వడ్డెలు అలా పడుకున్న వారిని తొక్కుతూ పోతే తమకు ముక్తిఫలం లభిస్తుందని ఆదివాసీలతోపాటు నాగరికులూ పోటీపడుతారు. సారలమ్మ మేడారం గద్దెపై కొలువుదీరడంలో జాతర ప్రథమ అంకం మొదలవుతుంది. అప్పటికే పూనుగుండ్ల (ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం) నుంచి సమ్మక్క భర్త అయిన పగిడిద్దరాజును దాదాపు 70 కిలోమీటర్ల మేర కాలినడకన మేడారం తోడ్కొని వస్తారు. అదేరోజు ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి గోవిందరాజులు (నాగులమ్మ.. సారలమ్మ అక్క భర్త) ను తీసుకొస్తారు. ఒకవైపు సారలమ్మ వడ్డెలు, మరోవైపు పగిడిద్దరాజు, గోవిందరాజు వడ్డెలు ముగ్గురు కలిసి మేడారంలోని గుడిలో పూజలు చేస్తారు.

విశ్వవేదికపై మేడారం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి లోటు రానీయకుండా అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ జాతరకు జాతీయ హోదా కల్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నెల 31 నుంచి వచ్చే నెల 3 వరకు నాలుగురోజుల పాటు జాతర జరుగుతుంది. చేతిలో బెల్లం ఉంటే ఈగలు వాలుతాయంటారు. కానీ మేడారంలో బెల్లమే నైవేద్యంగా గుట్టలు గుట్టలుగా పోగయ్యే బంగారు రాసులున్నా ఒక్కచీమ కానీ, దోమగానీ జాతర దినాల్లో కంటికి దుర్భిణి వేసి చూసినా కనిపించదు. అంతేకాదు జాతర నడిచే నాలుగు రోజులు ఒళ్లు హూనం అయ్యేలా తిరిగినా సరే మనస్సుకే కాదు శరీరానికీ చిన్న అలసట ఉండదు. మనసు బంగారమవుతుంది. సమక్కకు జై. చలో చలో మేడారం..!

ఆత్మగౌరవ సారథ్యం

మేడారం ఆత్మగౌరవానికి ప్రతీక. తెలంగాణ ఆత్మగౌరవ నినాదం ఎత్తుకున్న ఆనాటి ఉద్యమనాయకుడు, ఈనాటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నిట్టనిలువునా అమ్మల పోరాట చరిత్రనే స్ఫూర్తిగా చేసుకొని ప్రత్యేక తెలంగాణకు దారులు తీసిన సందర్భం అజరామరం. 800 ఏండ్ల క్రితం తీవ్ర కరువు కాటకాలతో అల్లాడుతున్న కోయరాజ్యాన్ని కప్పం కట్టలేదని కాకతీయ ప్రతాపరుద్రుడు కత్తి కట్టి నేలకూల్చిన కొద్దిరోజులకే ప్రతాపరుద్రుడు పశ్చాత్తాపానికి గురై మేడారంలో సమ్మక్క త్యాగానికి గుర్తుగా జాతర నిర్వహించాడనే మౌఖిక ఆధారాలకు అనుగుణంగా నమ్మే చరిత్ర మేడారానిది. తెలంగాణ ఉద్యమం సమయం నుంచి సమ్మక్కను నెత్తిన ఎత్తుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివాసీ సంస్కృతీసంప్రదాయాలకు విలువ ఇవ్వడమే కాదు, వారి ఆచారవ్యవహారాలను, కట్టుబాట్లను భవిష్యత్ తరాలకు అందించే శాశ్వత చర్యలను చేపట్టారు. దానివల్ల ఇవ్వాళ ఎడ్లబండి నుంచి హెలికాప్టర్ దాకా ఏ మార్గంలో వెళ్లినా జాతర దారుల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తిన దాఖలాలు లేవు.

మహాజాతరకు 16 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మేడారం జాతరకు వెళ్లే భక్తుల కోసం 16 ప్రత్యేక రైళ్లను నడుపాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయించారు.

మేడారం రైళ్ల వేళలు : సికింద్రాబాద్-వరంగల్ మార్గంలో వెళ్లే రైలు (07014) ఈ నెల 31న మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి 3.40 గంటలకు వరంగల్‌కు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 5.45 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 8.30 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటుంది. ఈ నెల 31, ఫిబ్రవరి 1, 2, 3 తేదీలలో ఈ ప్రత్యేక రైలు సర్వీసులు ఉంటాయి. కాజీపేట-సిర్పూర్ కాగజ్‌నగర్ 07019 రైలు కాజీపేటలో ఈ నెల 31న రాత్రి 7 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 11 గంటలకు సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చేరుకుంటుంది. ఈ నెల 31, ఫిబ్రవరి 4న ఈ రైలు సేవలుంటాయి. సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి ఖమ్మం వెళ్లే రైలు సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి ఉదయం 11.15 గంటలకు ఖమ్మం చేరుతుంది. ఫిబ్రవరి 1, 2, 3 తేదీలలో ఈ సర్వీసులుంటాయి.

పవర్‌గ్రిడ్‌లో 150 ఏఈ ట్రెయినీలు

భారత ప్రభుత్వరంగ సంస్థ పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్)లో గేట్ - 2017 స్కోర్ ఆధారంగా అసిస్టెంట్ ఇంజినీర్ ట్రెయినీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- ఎలక్ట్రికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్‌సైన్స్ అభ్యర్థులకు అవకాశం
- గేట్ 2017 స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
- చివరితేదీ: ఫిబ్రవరి 17

వివరాలు:

పవర్‌గ్రిడ్ ప్రభుత్వ పరిధిలోని ఒక నవరత్న కంపెనీ.

- పోస్టు పేరు: అసిస్టెంట్ ఇంజినీర్ ట్రెయినీ
- ఈ పోస్టులకు ఎంపికైనవారికి ఏడాది శిక్షణ సమయంగా పరిగణిస్తారు. అనంతరం అభ్యర్థులకు అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగావకాశం కల్పిస్తారు.

మొత్తం ఖాళీలు - 150. విభాగాల వారీగా...

- ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ - 100 (జనరల్ -51, ఓబీసీ -27, ఎస్సీ -15, ఎస్టీ - 7)
- ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్- 20 (జనరల్ - 11, ఓబీసీ - 5, ఎస్సీ - 2, ఎస్టీ - 1)
- సివిల్ ఇంజినీరింగ్- 20 (జనరల్ - 10, ఓబీసీ - 5, ఎస్సీ - 4, ఎస్టీ - 1)
- కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ - 10 (జనరల్ - 5, ఓబీసీ - 3, ఎస్సీ -1, ఎస్టీ - 1)
- **అర్హతలు:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్ లేదా బీఎస్సీ ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత. సంబంధిత బ్రాంచీలో కనీసం 65 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు సంబంధిత పేపర్‌లో గేట్ - 2017లో వ్యాలిడ్ స్కోర్ వచ్చి ఉండాలి.

గమనిక: బ్యాచిలర్ డిగ్రీని ఫుల్‌టైంలో చేసిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.



- **వయస్సు:** 2016, డిసెంబర్ 31 నాటికి 28 ఏండ్లు మించరాదు. ఓబీసీలకు మూడేండ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **అప్లికేషన్ ఫీజు :** రూ. 200/-
- **ఎంపిక:** గేట్ - 2017 స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూకు పిలుస్తారు.
- మొత్తం 100 నార్మలైజ్డ్ మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.
- గేట్ - 2017 మార్కులకు - 85 శాతం
- గ్రూప్ డిస్కషన్ - 3 శాతం
- పర్సనల్ ఇంటర్వ్యూ - 12 శాతం
- మొత్తం - 100 శాతం మార్కులకు ఎంపికచేస్తారు.

నోట్: గేట్- 2016, 2018 స్కోర్‌లను పరిగణనలోకి తీసుకోరు.

- **జీతభత్యాలు:** ఎంపికైన అభ్యర్థులకు శిక్షణా సమయంలో నెలకు రూ. 24,500/- ఇస్తారు.
- విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్న తర్వాత ఏఈ పోస్టు ఇస్తారు.
- **పేస్కేల్:** రూ. 20,600 - 46,500/- లేదా సీటీసీ రూ. 12.8 (సుమారుగా) లక్షలు.
- **బాండ్ :** ఎంపికైన అభ్యర్థులు సంస్థలో కనీసం మూడేండ్లు పనిచేస్తామని బాండ్ అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉంటుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 17
- **వెబ్‌సైట్:** www.powergridindia.com

మెడికల్ ఆఫీసర్లు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) కేంద్రప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్, సైంటిస్ట్ తదితర పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

యూపీఎస్సీ స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థ.

- మొత్త పోస్టుల సంఖ్య: 23

విభాగాలవారీగా ఖాళీలు



- అసిస్టెంట్ ప్రొఫెసర్ (స్పెషలిస్ట్ గ్రేడ్ 3)- 2, కెమిస్ట్-3, డిప్యూటీ డైరెక్టర్-1, సైంటిస్ట్ (గ్రేడ్ బీ)-6, మెడికల్ ఆఫీసర్-11 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హత:**యూపీఎస్సీ నింబధనల ప్రకారం అర్హతలను కలిగి ఉండాలి.
- **వయస్సు:** 35 ఏండ్లకు మించరాదు.
- **అప్లికేషన్ ఫీజు :** రూ. 25/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళలకు ఫీజు లేదు.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 1
- **వెబ్‌సైట్:** www.upsconline.nic.in

ఎన్‌ఆర్‌ఎల్‌లో ట్రెయినీలు

అసోంలోని నుమాలీగఢ్ రిఫైనరీ లిమిటెడ్ (ఎన్‌ఆర్‌ఎల్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న గ్రాడ్యుయేట్ ఇంజినీర్, మేనేజ్‌మెంట్/ఆఫీసర్ ట్రెయినీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఎన్‌ఆర్‌ఎల్ అనేది మినీరత్న హోదా కలిగిన భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) అనుబంధ సంస్థ. దీన్ని 1999 జూలై 9న ఏర్పాటు చేశారు.

- మొత్తం పోస్టుల సంఖ్య: 21
- **విభాగాలవారీగా ఖాళీలు:** గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెయినీ (కెమికల్-7, ఎలక్ట్రికల్-4, ఇన్‌స్ట్రుమెంటేషన్-2, మెకానికల్-3, సివిల్-1, ఐఐఎస్-2) మేనేజ్‌మెంట్ ట్రెయినీ (ఫైనాన్స్-1), ఆఫీసర్ (ఫైనాన్స్)-1
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెయినీ పోస్టులకు కెమికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, సివిల్/ఐఐఎస్ ఇంజినీరింగ్ బ్రాంచీలో 65 శాతం మార్కులతో బీఈ/బీటెక్, మేనేజ్‌మెంట్ ట్రెయినీకి ఎంబీఏ/పీజీడీఎంలో 60 శాతం, ఆఫీసర్ (ఫైనాన్స్)పోస్టుకు సీఏలో ఉత్తీర్ణత ఉండాలి. ఐసీఏఐలో అసోసియేట్ మెంబర్‌షిప్‌గా నమోదు చేసుకుని ఉండాలి.
- **వయస్సు:** 2018 జనవరి 1 నాటికి 30 ఏండ్లు (ఆఫీసర్‌కు 32 ఏండ్లకు) మించరాదు. కంపెనీ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.



- **పే స్కేల్:** రూ. 24,900/-. ఏడాది ట్రెయినింగ్ పీరియడ్ పూర్తయిన తర్వాత సుమారు రూ. 60,000-1,80,000/- జీతం చెల్లిస్తారు.

గమనిక : ఎంపికైన అభ్యర్థులు ఎన్‌ఆర్‌ఎల్ లేదా అనుబంధ సంస్థల్లో ఎక్కడైనా పనిచేయాల్సి ఉంటుంది.

- **ఎంపిక:** రాతపరీక్ష + గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ద్వారా.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఫిబ్రవరి 23
- **వెబ్‌సైట్:** www.nrl.co.in

నిమ్‌హాన్స్‌లో ఎల్‌డీసీలు

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ (నిమ్‌హాన్స్) ఖాళీగా ఉన్న లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- **మొత్తం ఖాళీలు:** 24 (జనరల్-14, ఓబీసీ-6, ఎస్సీ-3, ఎస్టీ-1)
- **పోస్టు పేరు:** లోయర్ డివిజన్ క్లర్క్
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి డిగ్రీతోపాటు టైపింగ్ స్కిల్స్ ఉండాలి. ఇంగ్లిష్/హిందీలో నిమిషానికి 35/30 పదాల వేగాన్ని కలిగి టైపింగ్ సామర్థ్యం ఉండాలి.
- **వయస్సు:** 27 ఏండ్లకు మించరాదు
- **పే స్కేల్:** రూ. 21,000/-
- **అప్లికేషన్ ఫీజు :** రూ. 500/- (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.250/-)
- **ఎంపిక:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2018 జనవరి 31
- **వెబ్‌సైట్:**www.nimhans.ac.in

విద్య, ఉద్యోగ సమాచారం

సీసీఎంబీలో జేఆర్‌ఎఫ్

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) ఖాళీగా ఉన్న ప్రాజెక్ట్ జూనియర్ రిసెర్చ్ ఫెలో పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

సీసీఎంబీ అనేది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) పరిధిలో పనిచేస్తున్న అనుబంధ సంస్థ.




- **పోస్టు పేరు :** ప్రాజెక్ట్ జూనియర్ రిసెర్చ్ ఫెలో
- **అర్హత:** బయోటెక్నాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్, ఫార్మసీలో బీఈ/బీటెక్/ఎమ్మెస్సీలో ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 28 ఏండ్లకు మించరాదు.
- **స్టయిఫండ్:** రూ. 16,000+ హెచ్‌ఆర్‌ఏ
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 1
- **వెబ్‌సైట్ :** www.ccmb.res.in

సీఈసీఆర్‌ఐలో సైంటిస్టులు

తమిళనాడులోని సెంట్రల్ ఎలక్ట్రోకెమికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఈసీఆర్ఐ)లో ఖాళీగా ఉన్న సైంటిస్టు పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

సీఈసీఆర్ఐ అనేది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) పరిధిలో పనిచేస్తున్న సంస్థ.



- మొత్తం పోస్టుల సంఖ్య: 20
- **విభాగాలవారీగా ఖాళీలు:** సైంటిస్ట్-11, సీనియర్ సైంటిస్ట్-2, టెక్నికల్ అసిస్టెంట్-5, మెడికల్ ఆఫీసర్ (మహిళ)-1
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను బట్టి పీహెచ్‌డీ, ఎంఈ/ఎంటెక్, ఎమ్మెస్సీ, బీఈ/బీటెక్, +ఎంబీఏ, ఇంజినీరింగ్ డిప్లొమా, ఎంబీబీఎస్‌లో ఉత్తీర్ణత.సంబంధిత రంగంలో అనుభవం.
- **వయస్సు:** 2018 ఫిబ్రవరి 12 నాటికి సైంటిస్ట్‌కు 32 ఏండ్లు, సీనియర్ సైంటిస్ట్‌కు 37 ఏండ్లు, టెక్నికల్ అసిస్టెంట్‌కు 28 ఏండ్లకు మించరాదు
- **ఎంపిక:** రాత పరీక్ష/ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 12
- **హార్డ్‌కాపీలకు చివరితేదీ:** ఫిబ్రవరి 19
- **వెబ్‌సైట్:** www.cecri.res.in

సుప్రీంకోర్టులో అసిస్టెంట్లు

సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా టెక్నికల్ విభాగంలో తాత్కాలిక ప్రాతిపదికన ఖాళీగా ఉన్న అసిస్టెంట్ (టెక్నికల్ అసిస్టెంట్ కమ్ ప్రోగ్రామర్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:



- మొత్తం పోస్టుల సంఖ్య:15
- **పోస్టు పేరు:** అసిస్టెంట్
- **అర్హత:** బీఈ/బీటెక్ (కంప్యూటర్ సైన్స్/ఐటీ) లేదా ఎంసీఏ, బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్) లేదా బీసీఏలో ఉత్తీర్ణత. ఎల్ఎల్‌బీ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 30 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** రూ. 44,900/-
- **ఎంపిక:**రాతపరీక్ష,ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా.
- **చివరితేదీ:** ఫిబ్రవరి 20
- **వెబ్‌సైట్:** www.sci.nic.in.